TELUGU

VOLUME FOURTEEN

# The Voice of Truth

# సత్యవాణి International


దేవుడు పక్షపాతి
పేజి -12

సాటిలేని యేసు మాటలు
పేజి -21

కష్టమైన వారితో జీవించుట
పేజి -32

శక్తివంతమైన ఆరాధన
పేజి - 37

అన్నింటికంటే గొప్పధనము
పేజి - 50

ఈ లోకాన్ని మార్చిన యుద్ధము
పేజి - 53

ఈ యేసు ఎవరు?
పేజి - 67

క్రీస్తుయొక్క రెండవరాకడ
పేజి - 75





వోయిస్ ఆఫ్ ట్రూత్ (సత్యవాణి) ఇంటర్నేషనల్

పోస్టుబాక్సు నెం. 80, కాకినాడ - 533 001, తూ॥గో॥జిల్లా. ఆం.ప్ర

# THE VOICE OF TRUTH INTERNATIONAL

ఒక్కమాట :

"నీ యౌవనమును బట్టి ఎవడును నిన్ను తృణీకరింపనీయకుము, గాని మాటలోను ప్రవర్తనలోను ప్రేమలోను విశ్వాసము లోను పవిత్రతలోను విశ్వాసులకు మాదిరిగా యుండుము. నేను వచ్చువరకు చదువుట యందును హెచ్చరించుట యందును బోధించుట యందును జాగ్రత్తగా యుండుము. ... నీయభివృద్ధి అందరికీ తేటగా కనబడు నిమిత్తము వీటిని మనస్కరించుము, వీటియందే సాధకము చేసికొనుము"

(1 తిమోతి 4:13-16)


## STAFF :

***Editor-In-Chief :*** J.C. Choate
***Managing Editor :*** Byron Nichols
***Layout Editor :*** Betty Burton Choate
***Art & Computer Consultant :*** Joshua Gootam
***Promotion :*** Colin McKee, Bobby Tillman, Sudhir Mendiratta, Dale Grissom, Oran Rhodes, Mark Posey Buck Davenport, James Warren, Ken Willis, Dennis Larson, Don Hinds, Charles Salmon

***Associate Editors for Foreign Editions :***
Roger Dickson, South Africa
Sunny David, India
Joshua Gootam
Henry Kong, Singapore
Reuben Emperado, Philippines
Stephen Randall, Australia
Rod Kyle, New Zealand



The Voice of Truth International is published by Churches of Chirst, under the non-profit World Evangelism Foundation, U.S.A.

**వోయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్**

***Telugu Edition***
***Managing Editor : Joshua Gootam***
***P.O. Box-80, Kakinada. A.P. - 533 001, India.***


Reader's requests for articles on particular subjects will be considered. Comments and suggestions regarding the content and appearance of the magazine will be appreciated.


## STAFF WRITERS :

George Akpabli
W.T. Allison
O.P. Baird
Leon Barnes
Wayne Barrier
Roay Beasley
V.P. Black
Maxie B. Boren
T. Pierce Brown
Ron Bryant
Salvador Cariaga
Jack W. Carter
David Chadwell
Frank Chesser
Betty Burton Choate
Jeril Cline
Charles E. Cobb
Glenn Collery
Willard Collins
Owen Cosgrove
Sunny David
Jerry Davidson
Hans Dederscheck
David Deffenbaugh
Clarence Deloach, Jr.
Roger Dickson
Bobby G. Dockery
Earl Edwards
Demar Elam
Reuben Emperado
Garell L. Forehand
Royce Frederick
E. Claude Gardner
R. Gnanasundaram
Mark Hall
Gary C. Hampton
Jack Harriman
W. Dauglass Harris
Ray Hawk
Gordon Hogan
Tom Holland
Wayne Jackson
Ancil Jenkins
Dan Jenkins
Jerry Jenkins
Jimmy Jividen
Dayton Keesee
Tom Kelton
Dalton Key
Michael L. King
Mack Lyon
Avon Malone
Cecil May, Jr.
Bill Mc Farland
Don McWhorter
Jane McWhorter
Hollis Miller
Wayne Miller
Tim Nichols
Bill Nicks
Fenter Northern
Don L. Norwood
Basil Overton
Frances Parr
Max Patterson
David Pharr
Harvey Porter
G.F. Raines
Eulene Ramsey
John Thiesen
Betty Tucker
Ken Tyler
Don W. Walker
Tex Williams
Willeam Woodson


**THE CHURCHES OF CHRIST SALUTE YOU (ROMANS 16:16).**



# Freedom of Religion

**J.C. CHOATE**
**Editor -in- chief**

Of all the freedoms we enjoy, the freedom of religion is one of the most important. An individual or a people might have every freedom known to man, but if there is no freedom of religion all other freedoms are meaningless. Without such freedom one is a slave, held against his will, with no choice of his own. He has no opportunity to obey God to be saved. Being in ignorance of God's will, only an eternity in hell remains for such a person and for those who imposed slavery of the soul upon him.

Can we begin to imagine what is it like to be born in a part of the world where God is not allowed to reign supreme, where the name of Christ is rejected, and where the religion of Christianity cannot be practiced? Just think about the Bible being outlawed and worship not permitted! In such places the gospel is not allowed to be preached and one cannot publicly live the Christian life. What kind of people would live under these conditions? Is there such a people? Yes, such places do exist in the world today and there are governments and people who insist that every soul under their power must practice

the chosen religion or no religion at all.

These are the same people who take full advantage of freedom of religion in other countries of the world. They send their missionaries and their holy book, they build their elaborate houses of worship, and they publicly complain if they feel that they are discriminated against in any way. The growing fundamentalists among them are fanatical and harsh in dealing with those who do not agree with them. They are also hard on their own people, making demands of them that are neither humane nor lawful. These people often pass themselves off as being very religious and moral, while portraying Christianity as permissive and immortal. The truth is, however, what they practice is generally otherwise, making them very hypocritical.

Christians believe that there is one true and living God, and saviour, Jesus Christ, one book of God's inspired word, the Bible, and one religion, Christianity; and while we recognize that there are many false gods, saviours, books, and religions, we still believe in the right of every soul to have freedom of religion. We may disagree with one's choice, but we believe and the Bible teaches that every individual should be allowed to choose what he believes and the religion he wants to practice. He should have the right even though his choice may be wrong.

From creation, God has always given man a choice. Being the Creator and all powerful, He could have forced humanity to submit to Him but what glory or satisfaction would that have brought to God? On the other hand, love and obedience from the heart of man, by his own choice, is the treasure God seeks. This is the only service to Him that counts.

God invites man to come to him (Matthew 11:28-30) and it is only when we voluntarily turn to God that He is glorified. On the other hand, we may choose to reject God, That option is

certainly open to us, but we will suffer the consequences that follow.

In the same manner, God has not given any man or people the authority to impose spiritual choices on others. Each person must be free to learn of God and to choose Him, or to follow error if that is his preference.

Freedom is a way of life. Parents allow their children to choose to obey or to disobey. All of us may choose to be law-abiding citizens or to become outlaws. Even at market, one can choose the kind of fruit he will buy, and so on with hundreds and thousands of other things. Of course, there are consequences if we make the wrong choices, but how sad to be in a situation where there is no choice, where one is forced to do a thing even when it is against his will.

All of us are just naturally suspicious of anything that is forced on us. This is especially true of religion. Any religion or church that must have a government or a set of laws to force itself upon others, and to protect its followers from other religions, is a very weak religion. Any religion or government body that forbids people of the "state" religion or church from being converted to some other religious group is obviously a very weak religion or church. Otherwise, why would there be the necessity to use laws or force to hold on to its people? How sad that such must be.

I believe in Christianity and I believe other religions are not of God. But I believe in the freedom of religion for all people. If Christianity cannot stand on its own merits, then how can it stand at all, regardless of what is done to prop it up?

Let every soul be given the opportunity to read, study, learn and compare all religions. Then, based on the truth - the facts - let him choose which one is of God and which one he will follow. That is freedom. Anything else is slavery, and slavery of the soul is the worst slavery of all.



# DIGGING SPIRITUTAL HOLES

**Byron Nichols**
Managing Editor

In Matthew 25:14-30 we read the parable of the talents. You will remember that Jesus told of a certain master giving three servants different amounts of money, the amounts varying in relation to the ability of each one. One was given five talents (or portions of money), another was given two, and the third received one. If you will recall, each of the first two servants wisely handled the master's money, even to the extent of doubling it.

But then, there was that fellow who had been given the one talent. His handling of his master's money resulted in no increase whatsoever. Notice the master's rebuke : *"You wicked and slothful(lazy) servant..."* The master later refers to this one as *"the unprofitable servant"*(verse 30).

Question : What was it that the servant had done that was so bad? Answer : Nothing - absolutely nothing. That was the problem. Instead of trying to make a profit for his master, he just went out and dug a hole in the ground and buried the master's money.

The master trusted them all; he placed his confidence in them. He was giving them an opportunity to prove themselves worthy of his faith in them. He didn't stay there and look over their shoulders to see if they were handling the situation just like he would do it. Instead, he went away and gave them the opportunity to make their own decisions.

Before leaving, the master let the servants know clearly what he expected of them. There was no lack of instruction or communication. Each one could know just as well as the others exactly what the master wanted him to do. All that was necessary was to pay attention to what the master said before he left.

It is also noteworthy in verse 19 that it was only after *"a long time"* that the master returned and asked for an accounting by each servant. He gave them ample time to do what was expected of them. They were allotted sufficient time to start out wrong and end up right - they had plenty of time to make some mistakes and still correct their course of action and present an acceptable profit to the master upon his return.

I believe the fact that the master was gone for *"a long time"* is a definite indication that he did not expect or require significant results immediately. It seems that he understood that things require an adequate amount of time in order to be accomplished.

Even a rather casual reading of this parable shows that these servants were not in competition with each other. The master had not made a contest out of the situation. It was not a matter of who was more capable than the others, but rather it was a matter of who was faithful in following instructions and trying to do the will of the master. The servant who received two talents of money received the same praise

and commendation as the one who had received five. They deserved equal recognition - they had both done the same thing, that is, they both did the best they knew how to do with what they had.

The master did not require fantastic results. Verse 27 shows that he would have been satisfied if the servant who was entrusted with the one talent had just put the money in the bank and earned the interest on it. That wouldn't be much of a return now, and it would not have been too much then either, but it would have at least been an improvement over digging a hole in the dirt and depositing the money there.

In verse 24 we read the report to the master by the servant who buried the money. He said *"I knew you to be a hard man ...."* Obviously, this was only an excuse, not a fact. There is nothing in the text to indicate that the master was hard or demanding, except for the fact that he did demand obedience. There is no evidence of harshness or unfairness on his part.

Jesus wants us all to see that He is portrayed by the master in the story, and that we, as His followers, are the servants. Let's be sure to carefully read the parable with this in mind.

We can all be successful servants, stewards. Our Master is not a hard taskmaster, but He has made it clear that "digging a hole" and burying our spiritual talents will not be acceptable. He definitely is demanding that every servant of His be busy using his / her talents in an effort to increase the size of the Master's estate. May all of us rejoice in our role as His servants and do our very best to faithfully use what He has entrusted to us, and not bury it in fear of failure. He wants us to succeed, and He has promised to help us to be successful.

# విషయసూచిక


**దేవుడు - దేవుని వాక్యము**

దేవుని యొక్క పునాది ... 9
దేవుని చేతిలోయున్న చేట ... 10
దేవుడు పక్షపాతి ... 12
మనుష్యుని ప్రశ్నలు దేవుని జవాబులు ... 15
I పేతురులో దేవుని కృప ... 16
దేవుని వాక్య ప్రయోజనము ... 18

**క్రీస్తు - క్రైస్తవ్యము**

ఆదర్శవంతుడైన యేసు ... 19
సాటిలేని యేసు మాటలు ... 21
యేసు క్రీస్తు ... 25
నిజమైన జ్ఞానము ... 26
క్రీస్తు లేపబడియుండకపోతే ... 27

**క్రియలో క్రైస్తవ్యము**

విశ్వసించుట ఒక క్రియ ... 29
సర్వసమానత్వము ... 30
కష్టమైన వారితో జీవించుట ... 32

**సంఘము - ఆరాధన**

నేనేమి బోధించగలను? ... 34
ఆరాధనలో దేవుని మహిమపరచుట ... 35
శక్తివంతమైన ఆరాధన ... 37

ఆదివారం ఆరాధన దినం ... 39
ఆరాధనకు ఆహ్వానం ... 41

**క్రైస్తవ జీవితం**

సంతోషము ... 42
మిత్రుల వలన ఆశీర్వాదములు ... 44
శ్రేష్టమైన బహుమానము ... 46
ఆ పని చాల గొప్పదా? ... 48
అన్నిటికంటే గొప్ప ధనము ... 50

**రక్షణ**

ఈ లోకాన్ని మార్చిన యుద్ధము ... 53
న్యాయమైన ప్రతిఫలము ... 55
బాప్తిస్మము పొందినపుడు రక్షణ ... 57

**బైబిలు వ్యక్తులు**

పిల్లతనపు రాజు ... 59
అతడు ప్రజలను దేవునికి మరలించెను ... 61

**ప్రత్యేకాంశములు**

విలాప వాక్యములు ... 64
గొప్ప ఆహ్వానము ... 66
ఈ యేసు ఎవరు ? ... 67
క్రీస్తు యొక్క రెండవ రాకడ ... 75
పాపుల మిత్రుడు ... 93

# దేవుని యొక్క పునాది
## The Foundation of God

*Tom Holland*



భవన నిర్మాణములో పునాది ప్రాముఖ్యము. విద్యాసంస్థలకు మంచి పునాదులు ప్రాముఖ్యము. మానవుని జీవితంలో మంచి పునాదులు ప్రాముఖ్యము.

అతి త్వరితముగా మార్పు చెందుతున్న యుగంలో దేవుని యొక్క స్థిరమైన పునాది నిలుకడగా యున్నదియని తెలసికొనుట చాల ప్రోత్సాహమునిచ్చుచున్నది(2 తిమో 2:19).

మొదటి శతాబ్ధములోని క్రైస్తవ సోదరులు నేడు మనవలెనే కొన్ని సార్లు అసత్య బోధలవలన కలత జెందేవారు. సత్యము విషయము తప్పిపోయిన బోధకులుండేవారు (2 తిమో 2:18). సత్యమునుండి తొలగి పోయినా, దానిని చెరిపినా ఆ సంగతిని తెలిసి కోలేనంత గజిబిజిగా సత్యము ఎన్నడు లేదు. అయినను సత్యమునుండి తొలగిపోయిన వారు దేవుని పునాదిని కదలింపలేకపోయారు.

ప్రభువు తన వారినెరుగును (2 తిమో 2:19). ప్రభువు నెరిగిన ప్రజలున్నారు. ప్రభువు ఎరిగిన ప్రజలున్నారు. వారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారు గనుక దేవుని కుమారులు (గలతీ 3:26-27). క్రీస్తులో నిలిచియున్న నమ్మకమైన ప్రజలున్నారు (యోహాను 15:4). ఎన్ని శ్రమలు, బాధలు, హింసలు కలిగినా ప్రభువుకు నమ్మకముగా యున్న ప్రజలున్నారు. ప్రభువు తన వారి నెరుగుననుటలో గొప్ప నిర్ధారణ అనుగ్రహించబడుచున్నది. దేవుడు తన వారి నెరుగుననుటలో గొప్ప ఆదరణ యున్నది. ప్రభువు తన వారిని గూర్చి చింతించును, రక్షించును, కాపాడును, దీవించునను దానిలో గొప్ప నిరీక్షణ యున్నది.

"నేను మిమ్మును ఎన్నడు ఎరుగను" అని ప్రభువు కొందరితో తీర్పునాడు చెప్పును. అదెంతటి భారమో! (మత్త 7:23), అయితే మనలను నిత్యము తనవారిగ ప్రభువు గుర్తించితే ఎంత ఆనంద దాయకమో కదా!

- టామ్ హాలెండ్

# దేవుని చేతిలో యున్న చేట
## (God's Winnowing Fan)


*Joe C. Magee*

“ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది. ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులోపోసి ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయును” (మత్తయి 3:12).

కోతకాలము రైతులకు ప్రాముఖ్య సమ-యము. కోతకోయబడిన పనలన్నియు ఒక కళ్లములో చేర్చబడి ఎద్దులచే నూర్చబడును. ఆరీతిగా గడ్డి నుండి ధాన్యపు గింజలు వేరుచేయబడును. పోగుచేయబడిన గింజలు పొల్లుతో కూడ వచ్చును. గనుక ధాన్యమును చేటలో వేసి గాలిలో ఎగుర వేతురు. గాలికి ధాన్యపు గింజలు, పొల్లు వేరు చేయబడును. బాప్తిస్మమిచ్చు యోహాను పైన చెప్పిన మాటలను అతనిని వినుచున్నవారందరు గ్రహించు కొనే యుందురు. అయితే ఈ తారతమ్యం వలన మనం యేమి నేర్చుకోగలము?

మనం దేవుని రాజ్యపు కళ్లములో చేర్చ బడిన తరువాత దేవుని చేతిలోయున్న చేట దిగువ రీతులగా మనలను వేరు చేయును.

### అజ్ఞాన మనే పొల్లు



“నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నది” (కీర్తన 119:105).

### అశ్రద్ధ అనే పొల్లు

“దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కరలేని పనివాని గాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము“(2 తిమో 2:15).

### స్వార్థమనే పొల్లు

“సహోదరులారా, ఒకడు ఏ తప్పిదము లో నైనను చిక్కుకొనిన యెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింప బడుదునేమో అని తన విషయమై

చూచుకొనుచూ సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసికొని రావలెను. ఒకని భారములనొకడు భరించి యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" (గలతీ 6:1-2).

## ద్వేషమనే పొల్లు

"ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును, తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనవమాయన వలన పొంది యున్నాము" (యోహాను 4:20-21).

## నైతిక వెలితి అనే పొల్లు

"మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను, మెప్పైనను ఉండిన యెడల ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటి మీద ధ్యానముంచుకొనుడి... అప్పుడు సమాధాన కర్తయగు దేవుడు మీకు తోడైయుండును" (ఫిలిప్పీ 4:8-9).

## నిరీక్షణ లేని జీవిత పొల్లు

"కాబట్టి మీ మనస్సు అను నడుము కట్టుకొని నిబ్బరమైన బుద్ధి గలవారై యేసు క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు తేబడు కృప



విషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగియుండుడి" (I పేతురు 1:13).

## అనిశ్చయం, భయం అనే పొల్లు

"మంచి పోరాటము పోరాడితిని, నా పరుగుకడముట్టించితిని, విశ్వాసము కాపాడు కొంటిని. ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును"(2 తిమో 4:7.8).

దేవుని వాక్యమనే చేటను ఈ లోకంలో వినియోగిస్తు పొల్లును వేరుచేద్దాము. లేని యెడల దేవుని తీర్పు అనే చేట వలన మనం దేవుని నుండి నిత్యము వేరుచేయబడ్తాము.

\- జో మేగీ

# దేవుడు పక్షపాతి !

## (God is a Respector of Persons !)

*- John Harris*



నేనొక కూటములో యుండగా దిగువ ప్రశ్న నాకు పంపబడింది. "మీరు ఒకరాత్రి మీటింగులో అపో.కా. 10:34 చదివి దేవుడు పక్షపాతి కాదన్నారు. మరొక రాత్రేమో క్రీస్తు సంఘస్థులు మాత్రమే రక్షింపబడినవారన్నారు. వారే రక్షింపబడగలవారన్నారు. దేవుడు క్రీస్తు

సంఘస్థలను మాత్రమే రక్షిస్తే ఆయన పక్షపాతికాడా?". ఈ ప్రశ్న వేసిన సభ్యులకు కృతజ్ఞత చెప్పి మరునాడు "దేవుడు పక్షపాతి" యనే అంశముపై మాట్లాడుదునని వారికి ప్రకటించాను.

అపొ.కా. 10:34లో పేతురు, "దేవుడు నిజముగా పక్షపాతికాడని గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించు నని" చెప్పెను. నిస్సందేహముగా దేవుడు పక్ష పాతికాడని అపొ. పేతురు ఇక్కడ బోధించెను. అతడు మొట్టమొదటిగా అన్యజనులకు ఇక్కడ సువార్త బోధిస్తూ, దేవుడు యూదులకు అన్య జనులకు మధ్య వ్యత్యాసమేమీ చూపడుకాని ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఎవనినైనను ఆయన అంగీకరించునని చెప్పెను. అందువలన ఒక వ్యక్తి యూదుడో అన్యుడో, ధనికుడో బీదవాడో, స్వతంత్రుడో దాసుడో, స్త్రీయో పురుషుడో అను వ్యత్యాసాన్ని దేవుడు చూపడు (గలతీ 3:26-29), గాని ఎవడు ఆయనకు భయపడి ఆయన మాటల చొప్పున నడుచుకొనునో వానిని ఆయన లక్ష్యపెట్టును!

"నీ ఆజ్ఞలన్నియు న్యాయములు. నీ వాక్య మును గూర్చి నా నాలుక పాడును" అని దావీదు చెప్పెను (దా.కీర్తన 119:172). సమూయేలు రాజైన సౌలుతో, "నీ దేవుడైన యెహోవా నీకిచ్చిన ఆజ్ఞను గైకొనక నీవు అవివేకపు పని చేసితివి. నీ రాజ్యమును ఇశ్రాయేలీయుల మీద సదాకాలను స్థిరపరచు టకు యెహోవా తలంచియుండెను. అయితే నీ రాజ్యము నిలువదు" అని చెప్పెను (1 సమూ 13:13). "జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరువాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను, కపటపుమాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను. అతడు కీడు నుండి తొలగి మేలు చేయవలెను. సమాధానమును వెదకి దాని వెంటాడవలెను. ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయు వారికి విరోధముగా ఉన్నది" యని పేతురు చెప్పెను (1 పేతురు 3:10-12).

గనుక ప్రభువు కొందరిని లక్ష్యపెట్టును, కొందరిని అలక్ష్యపెట్టును. ఆయన కన్నులు, చెవులు నీతిమంతుల వైపుననున్నవి. గాని కీడు చేయువారికి ఆయన ముఖము విరోధ ముగా నున్నది. ఆయన తనకు విధేయులైన వారందరికీ నిత్యరక్షణకు కారకుడాయెనని పౌలు చెప్పాడు (హెబ్రీ 5:10). ఆయనకు విధేయులు కాని వారికి ఆయన రక్షకుడు కాదు. ఇంకో మాటలో ఆయనకు విధేయులు కాని వారిని ఆయన రక్షించదు. ఈ రీతిగా

ఆయన పక్షపాతం వహించును. "మీరు సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగ చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:32). "ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించు చున్నాడు" (1 తిమో 2:4).

అందువలన ఒకడు రక్షింపబడవలె నంటే అతడు సత్యమును ముందుగా తెలిసికొనుట అవుసరం. యేసు స్వయంగా వారికి బోధించు చున్న దినాల్లో కొందరు తమ కండ్లను చెవులను మూసికొన్నారు (మత్తయి 13:15). గనుక సత్యమును విని విశ్వసించి దానికి లోబడిన వారిని దేవుడు అంగీకరిస్తారు. అట్లు చేయని వారిని తిరస్కరిస్తారు.

రోమీయులకు వ్రాసిన పత్రికలో పౌలు ఇట్లు చెప్పాడు. ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును. సత్క్రియను ఓపికగాచేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి నిత్య జీవమునిచ్చును. అయితే భేదములు పుట్టించి సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడు వారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును (రోమా 2:6-7). నిజ క్రైస్తవునికి నిత్యజీవ బహుమానము లభించును. అయితే దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు శ్రమయు వేదనయు కలుగును (రోమా 2:9).

ఈ లేఖనములన్నిటిని బట్టి దేవుడు కొందరిని లక్ష్యపెట్టును, కొందరిని అలక్ష్య పెట్టునని గ్రహించాము. ఆయనకు భయపడి నీతిననుసరించి నడుచుకొనువానిని ఆయన లక్ష్యపెట్టును. రక్షించును. ఆయన సువార్తకు లోబడిన వారిని రక్షించును, సువార్తకులోబడిన వారు క్రైస్తవులవుతారు. క్రీస్తుసంఘమవుతారు. సంఘమనగా రక్షింపబడిన వారే. రక్షింపబడిన వారందరినీ ప్రభువు తన సంఘముతో చేర్చుకొంటాడు (అపొ. కా. 2:47). అందువలన ప్రభువు తన సంఘసభ్యుల యెడల పక్షపాతము చూపుతారు. ఏలయనగా ఆయన వారిని రక్షిస్తాడు. తన సంఘమందు లేనివారిని నిరాకరిస్తాడు.

అయితే నిజానికి దేవుడు పక్షపాతి కాడు. ఆయన వ్యక్తుల యెడల కాదు గాని వారి వ్యక్తిత్వము యెడల మొగ్గుచూపుతాడు. ఏలయనగా ప్రతివాడు తన ప్రవర్తనకు (వ్యక్తిత్వానికి) తానే బాధ్యుడు. కొందరు క్రైస్తవ ప్రవర్తన కలిగియుంటారు. కొందరుండరు. ఏలయనగా కొందరు క్రీస్తు సువార్తకు లోబడి యుంటారు. మిగతావారు లోబడియుండరు. ఒకని కులాన్ని బట్టి, ధనాన్ని బట్టి, విద్యను బట్టి దేవుడు పక్షపాతి కాడు, గాని ఎవడైతే ఆయనకు భయపడి, నీతిగా నడుచుకొనునో అట్టివానిని తప్పక ఆయన రక్షిస్తారు.

– జాన్ హేరిస్

# మనుష్యుల ప్రశ్నలు, దేవుని జవాబులు

## ("Man's Questions - God's Answers")

**నేను దేవునికి లెక్క చెప్పవలెనా?**

"పాపమువలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23). "ఏ భేదమును లేదు అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేకపోవు చున్నారు" (రోమా 3:23). "నా తోడు ప్రతి మోకాలును నా యెదుట వంగును, ప్రతి నాలుకయు దేవునిస్తుతించును అని వ్రాయబడియున్నది. గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను" (రోమా 14:11-12).

"ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డ వైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10).

**నన్ను గురించి దేవునికి అంతా తెలుసా?**

"ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియులేదు. మన మెవనికి లెక్క యొప్ప చెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా యున్నది" (హెబ్రీ 4:13).

**దేవుడు పాపముకు శిక్ష విధించునా?**

"ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడా పరలోకము నుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతి దండన చేయును" (2 థెస్స 1:7-9).

**దేవునికి లోబడకపోతే నేను నశించెదనా?**

"కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింప వలెనని యిచ్ఛయింపక అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు" (2 పేతురు 3:9).


**ఆయన పాపినైన నన్ను రక్షించునా ?**

"పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగి నదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైన దియునై యున్నది. అట్టి వారిలో నేను ప్రధాను డను" (I తిమో 1:15). "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" తన్ను గూర్చి యేసు క్రీస్తు చెప్పెను (లూకా 19:10).

# I పేతురులో దేవుని యొక్క కృప

## ( I Peter and the Grace of God )

*- William Woodson*



దేవుని సేవలో పేతురు జీవితం ఆదర్శ ప్రాయం, ప్రోత్సాహకజనికం. యేసు యొక్క పరిచర్య ఆరంభం నుండి (యోహాను 1:40-42) అప్పుడప్పుడు తడబడినా(మత్త 26:33-35) అతడు ధైర్యముతోను, పట్టుదలతోను పని చేసాడు. పెంతెకొస్తునాడు అతడు గంభీర ప్రసంగీకుడు (అపొ.కా. 2:14,37). అన్య జాతీయుడైన కొర్నేలిని అతనియింటివారిని క్రీస్తులోనికి నడిపింది అతడే (అపొ.కా 11: 13,14, 10:44-48).

తదుపరి అంతకంటె ఎక్కువగా I పేతురులో ఆత్మావేశముచే అతడులిఖించిన మాటలు దేవుని ప్రజల హృదయాలను, మనసులను కదిలింపజేస్తాయి. (I పేతురు 5:12). దేవుని యొక్క అమితమైన, వాడబారని కృపయే ఈ పత్రిక యొక్క ముఖ్య ఉద్దేశ్యము. దానిని మన ఆత్మీయ క్షేమము కొరకు దేవుడను గ్రహించును.

దేవుడు సర్వకృపను అనుగ్రహించు నని పేతురు చెప్పుచున్నాడు. "తన నిత్యమహిమకు క్రీస్తునందు మిమ్మును పిలిచిన సర్వకృపానిధియగు దేవుడు, కొంచెము కాలము మీరు శ్రమపడిన పిమ్మట, తానే మిమ్మును పూర్ణులనుగా చేసి స్థిరపరచి బలపరచును" (I పేతురు 5:10). దేవుని వాక్య విద్యార్థి కొరకు ఈ కృప యొక్క పరిమాణములు నాలుగు వచనాల్లో వివరించబడినవి.

**క్రీస్తు యొక్క రక్షణ సంకల్పమును కృపయే బయలుపరచెను.** (I పేతురు 1:10) ఈ రక్షణ సంకల్పమును గూర్చి ప్రవక్తలు ప్రవచించిరి. అది క్రీస్తు మరణములో సాధ్యమాయెను. సువార్త ఈ సత్యములను బయలుపరచు చున్నది. ఒకడు ఆత్మ ద్వారా సత్యమునకు లోబడును మరియు దేవుని వాక్యమూలముగా తిరిగి జన్మించును. (I పేతురు 1:22,23), పెంతెకొస్తు నాటి సందర్భము, కొర్నేలి మార్పుజెందుట విశదముగానే యున్నాయి.

**కృపవలన దేవుని ప్రజలు బాధ్యతగల పరిచర్యకు నడిపించబడుదురు.** "దేవుని నానావిధ కృప విషయమై మంచి గృహనిర్వాహకులై యుండి యొక్కొక్కడు కృపావరము పొందిన కొలది యొకనికొకడు ఉపచారము చేయుడి "(I పేతురు 4:10). పరిచర్య బాధ్యత గల వారై దేవుని ప్రజలు ఆయన వాక్యము చెప్పునట్లు చెప్పుదురు, చేయుదురు. తద్వారా దేవుని మహిమ పరచుదురు (I పేతురు 4:11).

**కృపవలన నమ్మకముగా యున్నవారు సత్యములో నిలకడగా యుందురు (I పేతురు 5:12).** ఈ సత్యము లేఖనములవలనను, నమ్మకమైన వాక్యోపదేశకుల వలనను నేర్చుకొనబడును. అందువలన దినములు మారుచున్నను ఒకడు దేవునిలో బలముగా యుండవీలగును.

**యేసు క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ వలన నిత్య రక్షణ సాధ్యమగును.** "కాబట్టి మీ మనస్సు అను నడుము కట్టుకొని నిబ్బరమైన బుద్ధి గలవారై యేసు క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు తేబడు కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగియుండుడి" (I పేతురు 1:13). అందువలన మనం పరిశుద్ధులముగా యుండాలి, విధేయులగు పిల్లలవలె యుండాలి. మనలను పిలిచినవాడు పరిశుద్ధుడై యున్న ప్రకారము మనమును పరిశుద్ధులముగా యుండాలి (I పేతురు 1:14-16).

పేతురు ఒక రాయివలె, బండవలె స్థిరముగా యుండునని యేసు గుర్తించారు. పేతురు యొక్క జీవితం నమ్మకత్వం, దేవుని కృపా సత్యములపై అతడు నడిపించబడిన విధానం మనకు విలువైన ఆదర్శము.

**- విలియం వుడ్సన్**

# దేవుని వాక్య ప్రయోజనము

*S.R. Tirugulla*

1 ఆయన వాక్యము మనకు బోధించును (2 తిమోతి 3:16, 17).

2 ఆయన వాక్యము మనకు నేర్పును (2 తిమోతి 3:16, 17 ద్వితియో 6:1-9, కీర్తనలు 119:1-6).

3 ఆయన వాక్యము మనకు జీవము నిచ్చును (మత్తయి 4:4).

4 ఆయన వాక్యము మనకు రూపాంతరం కలిగించును. (కీర్తనలు 119:59, 60 రోమా 12:2).

5 ఆయున వాక్యము మనలను పరిపక్వము చేయును (ఎఫెసీ 4:15 అపో.కా. 20:32).

6 ఆయున వాక్యము మనకు నిత్య బహుమానమునిచ్చును. (అపో.కా. 20:32:1 పేతురు 1:3-12).

7 ఆయన వాక్యము మనలను నడిపించును (కీర్తనలు 119:105).

8 ఆయన వాక్యము మనలను దిద్దును (2 తిమోతి 3:16, 17 హెబ్రీ 4:12, 13).

9 ఆయన వాక్యము మనలను పవిత్ర పరచును. (1 పేతురు 1:22)

10 ఆయున వాక్యము మనలను విడిపించును. (యోహాను 8:31, 32)

11 ఆయన వాక్యము మనలను రక్షించును (రోమా 1:16).

12 ఆయన వాక్యము మనలను దేవుని పోలికగా రూపొందించును. (1 పేతురు 1:23, 24)

13 ఆయన వాక్యము మనలను పరిశుద్ధ పరచును. (యోహాను 17:17)

14 ఆయున వాక్యము మనలను ఆదరించును. (కీర్తనలు 119:50,76 1థెస్స 4:16, 18)

15 ఆయన వాక్యము మనలను కాపాడును. (ఎఫెసీ 6:17)

16 ఆయన వాక్యము మనము తప్పినపుడు గద్దించును. (2 తిమోతి 3:16, 17, 4:2, 3)

17 ఆయన వాక్యము మనలను దేవుని యెదుట సిగ్గు పడకుండా చేయును. (2 తిమోతి 2:15)


18 ఆయన వాక్యము మన వృద్ధికి నమ్మకం కలిగించును. (1 పేతురు 2:2;2 పేతురు 3:18).

**S.R. తిరుగుళ్ల**

# ఆదర్శవంతుడైన యేసు

## (Jesus, the Man of Vision)

*- David Chadwell*



ఆశ్చర్యకరుడైన యేసు ఒక వ్యక్తిని చూడగానే వానిలో దాగియున్న శక్తి సామర్థ్యములను పసిగట్టగలరు. తొందరపడి మాటలాడే పేతురులో దేవుని రాజ్య ద్వారములు తెరువ గలిగే బండలాంటి దృఢమైన వ్యక్తిని ఆయన చూచారు. దయ్యములచే బాధింప బడుచున్న మగ్దలేనే మరియలో ఆయన అమిత ప్రేమ మూర్తిని, దృఢ సంకల్పముగలిగిన వ్యక్తిని చూచారు. హంతకుని వలె కనబడు తార్సు వాడైన సౌలులో ఆయన మత సంబంధ చరిత్రను మార్చగలిగే క్రైస్తవ వాదిని చూచారు. వ్యభిచారములో జీవిస్తున్న సమరయ స్త్రీలో ఆయన జీవజలములనాస్వాదించే వ్యక్తిని, ఇతరులను వాటి దగ్గరకు నడిపించ గలిగే వ్యక్తిని చూచారు.

అసాధారణమైన వ్యక్తులలో అసాధారణ మైన సంగతులను యేసు చూచేవారు. ఈ లోకమునకంతటికీ సిలువ వేయబడి పున రుత్థానుడైన దేవునికుమారుని వర్తమానమును తెలియజేయగలిగే శక్తిని ఆయన పదకొండు మందిలో చూచారు. వారు కూడ ఎంత అసాధారణమైన వారో! వారు జాలరులు, ద్వేషించబడిన సుంకరి, రాజకీయ మతోన్మాది, పల్లెల నుండి ఎంచుకొనబడిన మరి కొందరు.

వారికున్న అసాధారణమైన సామర్థ్యమును బట్టి, తలాంతులను బట్టి, వివేక విశిష్టతలను బట్టి యేసు వారిని ఎంచుకోలేదు. వారిలో ఎవరూ పెద్దగా చదువుకొన్నవారు కాదు, అనుభవజ్ఞులు కాదు, అంతగా ప్రయాణాలు చేసిన వారుకాదు. గాని ప్రతి వారి సందర్భము లోను యేసు వారిలో కనుగొన్నది ఒకే ఒక్కటి. దేవునియందు వారికున్న నమ్మకమే!

యేసు వారిలో చూచిన లక్షణాలను వారేమీ ఎరుగరు. సరిగదా వారు చేపలు పడుతు, దయ్యములతో పీడింప బడుతూ, వ్యభిచారంలో కొనసాగుతూ, పన్నులు వసూలు చేస్తూ, క్రైస్తవులను హింసిస్తూ, మతోన్మాదివలె జీవిస్తుయుండే వారే. అయినను దేవుని చేతిలో వారు శక్తివంతమైన పరికరములుగా మార్చ బడగల శక్తి గలవారు. వారు ప్రేమను, కృపను అంగీకరించ గలవారు గనుక, క్షమాపణను అంగీకరించగలరు. గనుక, నిత్యసంకల్పము కొరకు జీవించగలరు గనుక, యేసు వారిని గూర్చి యేమి తలాంచారో అట్లు తయారయ్యారు.

దేవుడు వారిని ఎంత శక్తివంతముగా వినియోగించబోవుచున్నరో వారిలో బహుశ ఎవరు ఎరిగియుండరు. అన్యజనులకు సువార్తను బోధించుటకు యెరూషలేములోని సంఘనాయకులు పేతురును ఎన్నుకొన్నపుడు, పౌలు చెరసాలలో యుంటూ తిమోతిని తన స్థానంలో వినియోగించుచున్నప్పుడు, ఘోర మైనహింసవలన శిష్యుల సంఖ్య పల్చబడుట అపొస్తలులు చూచినప్పుడు, రెండు వేల సంవత్సరముల తరువాత దేవుడు వారిని మాదిరిగా వినియోగించునని వారెవరు ఎరిగియుండరు.

వారిలో యున్న శక్తిని యేసు ఎట్లు గమనించారో నీలోయున్న శక్తిని కూడా ఆయన గమనించుచున్నారు. ఆ శక్తి నీకున్న గొప్ప సామర్థ్యము, జ్ఞానము, తలాంతులపై ఆధారపడిలేదు. అది దేవుని యందు నీకున్న విశ్వాసముపైన, రేపటికొరకు నిత్యత్వము కొరకు జీవించుటకు నీకున్న ఆసక్తిపైన ఆధారపడియున్నది. నీకు యేసు యొక్క ఆదర్శములో నమ్మిక యున్న యెడల, నీ జీవితంలో పరిపూర్ణ శక్తిని ప్రదర్శించగల యేసు శక్తిలో నీవు నమ్మిన యెడల నీవు ఊహించలేనంత విధముగా యేసు నీ జీవితమును ఉపయోగించగలరు. అట్టి శక్తి నీలో కాదు గాని, యేసులో ఉన్నది!

– దేవిడ్ చాడ్వెల్

# సాటిలేని యేసు మాటలు

## (Matchless words of Jesus)

*Joshua Gootam*



యేసు అద్భుతకార్యములు, సూచక క్రియలు చేయుచు బహిరంగముగా ప్రజలకు దేవుని గూర్చి బోధించుచుండగా యూదుల ప్రధాన యాజకులును, పరిసయ్యులును ఒక నాడు ఆయనను పట్టుకొనుటకు బంట్రోతులను పంపిరి. ఆ బంట్రోతులు వచ్చి యేసు జీవజలములను గూర్చి బోధించుటవినిరి. యేసు ఇట్లు బోధించెను. "ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులో నుండి జీవజల నదులు పారును" (యోహాను 7:37,38). "ఆ బంట్రోతులు ప్రధాన యాజకుల యొద్దకును పరిసయ్యుల యొద్దకును వచ్చినప్పుడు వారు – ఎందుకు మీరాయనను తీసికొనిరాలేదని అడుగగా, ఆ బంట్రోతులు – ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదనిరి" (యోహాను 7:45, 46). అవును, యేసు బోధించిన విధముగ బోధించిన వాడు ఆయనకు ముందుగాని, ఆయన వెనుక గాని ఎన్నడు ఉద్భవింపలేదు. యేసు బోధలో యున్న ప్రత్యేకతను ఈ రోజు మనము కొంత గమనింతము.

### అధికార యుక్తమైన మాటలు

యేసుక్రీస్తు బోధించినపుడు అధికారముగలవానిగా బోధించెను. మున్నెన్నడు ఏ మనుష్యుడు అట్టి అధికారముతో బోధింపనేలేదు. కొండమీద ఆయన చేసిన ప్రసంగములో "ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల వచనములనైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు.

నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు" అని ఆయన బోధించెను (మత్త 5:17). తరువాత ఒకడు నీతిమంతునిగా తీర్చబడవలెనన్న ధర్మశాస్త్రము కంటె మిన్న యైన ఆయన ఆజ్ఞలకు లోబడవలెనని యేసు బోధించెను. ధర్మశాస్త్రములోని కొన్ని ఆజ్ఞల నెత్తి చూపించి, నీతిమంతునిగా తీర్చబడ గోరువాడు వాటికంటె ఎక్కువ చేయవలెనని ఆయన బోధించెను. వాటిలో కొన్ని ఇప్పుడు మనము చూచుకొందము.

"నరహత్య చేయవద్దు. నరహత్య చేయు వాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరువిన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా - తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును.తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును. ద్రోహి అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును" (మత్త 5:21, 23). ధర్మశాస్త్ర ప్రకారము నరహత్య చేయువాడే విమర్శింప బడేవాడు గాని క్రీస్తు చట్టప్రకారమయితే తన హృదయములో తన సహోదరుని ద్వేషించువాడు నరకాగ్నికి లోనగును. మోషే ధర్మశాస్త్రము ఒకని బాహ్య ప్రవర్తననుబట్టి విమర్శించునట్టిదిగాని, క్రీస్తు చట్టమయితే ఒకని హృదయ తలంపులను బట్టి విమర్శించు నది. ఇందులో ఏది శ్రేష్ఠమైనది?

"వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా నేను మీతో చెప్పున దేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయ మందు ఆమెతో వ్యభిచారము చేసిన వాడగును" అని యేసుక్రీస్తు బోధించెను (మత్త 5:27). "తన భార్యను విడనాడు వాడు ఆమెకు పరిత్యాగ పత్రిక యియ్యవలెనని చెప్పబడి యున్నదికదా, నేను మీతో చెప్పున దేమనగా వ్యభిచార కారణమును బట్టిగాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు. విడనాడబడిన దానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు" (మత్తయి 5:31-32).

"మరియు- నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింప వలెనని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా - ఎంత మాత్రము ఒట్టు పెట్టుకొనవద్దు - మీ మాట అవునంటే అవును, కాదంటే కాదు అనియుండవలెను. వీటికి మించునది దుష్టుని నుండి పుట్టునది" (మత్తయి 5:33-37).

"కంటికి కన్ను, పంటికి పన్ను అని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక నిన్ను కుడిచెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము. ఎవడైన నీమీద వ్యాజ్యము వేసి నీ అంగీ తీసికొన గోరిన యెడల వానికి నీపై వస్త్రము కూడ ఇచ్చి వేయుము. ఒకడు మైలు దూరము రమ్మని

బలవంతము చేసిన యెడల, వానితో కూడ రెండు మైళ్ళు వెళ్ళుము. నిన్ను అడుగువాని కిమ్ము, నిన్ను అప్పు అడుగ గోరువాని నుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు" (మత్తయి 5:38–42).

"నీ పొరుగువాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి" యని యేసు అధికారముతో బోధించెను. (మత్తయి 5:43, 44).

యేసు ధర్మశాస్త్రము నుండి యెత్తి చూపించిన ఆరు సంగతులను ఇప్పటి వరకు మనము గమనించితిమి. ప్రతి సందర్భము లోను యేసు ఆ సంగతిని చెప్పి, అది అట్లున్నట్టు మీరు విన్నారు గదా, అయితే నేను మీతో చెప్పునదేమనగా అని చెబుతు ధర్మ శాస్త్రము విధించిన దానికంటే మరింత శ్రేష్టమైన విధులను క్రీస్తు బోధించెను. నేను చెప్పునదేమనగా యని ఆయన బోధించుటలో మోషే కంటె శ్రేష్టుడైన వాడని, ధర్మశాస్త్రమును మించిన యాజ్ఞలను ఆజ్ఞాపించు అధికారము గలవాడని క్రీస్తు నిరూపించుకొనెను. అందుకే "యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడు చుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవాని వలె వారికి బోధించెను" (మత్తయి 7:28).

## మృదువైన మాటలు


అంతేకాదు, యేసు పలికినంత మృదువుగా ఏ మానవుడు ఎన్నడు పలుకలేదు. ఆయన ఇట్లనుచున్నారు, "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగ జేతును. నేను సాత్వికుడను, దీన మనస్సు గలవాడను గనుక మీమీద నాకాడిఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి, అప్పుడు మీ ప్రాణము లకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నాకాడి సుళువుగాను, నా భారము తేలికగాను ఉన్నవి" (మత్త 11:28–30).

యేసు బోధించినంత ప్రేమతోను, కరుణ తోను ఏ మానవుడు ఎన్నడు బోధించి యుండలేదు. "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీరొకరిని నొకడు ప్రేమించ వలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితుల కొరకు ప్రాణము పెట్టువానికంటే ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు. నేను మీకాజ్ఞా పించు వాటిని చేసిన యెడల మీరును నా స్నేహితులై యుందురు" (యోహాను 9:13–14). దేవుని ప్రేమను మానవులకు చాటుటకు యేసు ఈ లోకమునకు వచ్చెను. ఆ ప్రేమను ఆయన తన జీవితములో మున్నెన్నడు ఎవడు నిరూపించని రీతిగ నిరూపించెను.

## ఆదరణ కలిగించే మాటలు

యేసు బోధించిన రీతిగ నిరీక్షణ గలిగిన మాటలను ఏ మానవుడు ఎన్నడు బోధింప లేదు. "మీ హృదయమును కలవరపడ నీయకుడి, దేవుని యందు విశ్వాసముంచు చున్నారు. నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల నేను మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్దనుండుటకు మిమ్మును తీసికొని పోవుదును "అని యేసు బోధించెను" (యోహాను 14:1-3). మరల, "పునరుత్థాన మును జీవమును నేనే, నాయందు విశ్వాస ముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతి వాడును ఎన్నటికిని చనిపోడు" అని సమాధి యనంతరము నిరీక్షణ మనము కలిగి యుండునట్లు యేసు బోధించెను (యోహాను 11:25, 26).

యేసు చేసిన వాగ్దానములను ఏ మాన వుడు ఎన్నడు చేయలేదు. మార్కు 16:16, నమ్మి బాప్తిస్మము పొందిన వానికి ఆయన రక్షణను వాగ్దానము చేసెను. తన శిష్యులు సర్వజనులను శిష్యులనుగా చేయవలెను. వారికి సువార్త బోధించి తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మని



యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు ఆయన ఆజ్ఞాపించిన సంగతు లన్నియు వారు గైకొనవలెనని బోధించినపుడు ఆయన యుగసమాప్తి వరకు సదాకాలము వారితో ఉందునని వాగ్దానము చేసెను (మత్తయి 28:19-20).

మనకు పాప క్షమాపణను, రక్షణను దయ చేయువాడు యేసుక్రీస్తే. ఆయన గొప్ప రక్షకుడు. ఆయన తప్ప మనుష్యులను తమ పాపముల నుండి విడిపించువాడు మరొకడు లేడు. నీవు యేసుక్రీస్తు నందు విశ్వాసివా? అయితే సాటిలేని యేసు మాటలను బట్టి నీ పాపముల విషయమై మారుమనస్సును, ఈనాడే క్రీస్తులోనికి బాప్తిస్మమును పొందుము!!

- జాషువాగూటం

# యేసు క్రీస్తు

యేసు క్రీస్తు తరచు కన్నీళ్లు విడిచేవారు (యోహా 11:35), గాని ఆయనే మన కన్నీళ్లు తుడుచును (ప్రక 7:17, 21:4). ఆయన ఒక బానిస యొక్క మూల్యమునకు అమ్మివేయబడ్డారు (నిర్గమ 21:32, మత్త 26:5) గాని ఆయనే మానవుని పాపముల క్రయధనము నిచ్చి మనలను విమోచించారు (పేతురు 1:18-19). ఆయన వధకు తేబడిన గొర్రెపిల్ల (అపొ.కా. 8:32), గాని ఆయన మన మంచికాపరి (యోహాను 10:11). "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:21).

# నిజమైన జ్ఞానము
## (True Wisdom)

*- Cecil May Jr.*

"మీలో జ్ఞాన వివేకములు గల వాడెవడు? వాడు జ్ఞానముతో కూడిన సాత్వికము గలవాడై తన యోగ్య ప్రవర్తన వలన తన క్రియలను కనుపరచవలెను. అయితే మీ హృదయము లలో సహింపనలవి కాని మత్సరమును వివాదమును ఉంచుకొనిన వారైతే అతిశయ పడవద్దు. సత్యమునకు విరోధముగా అబద్ధ మాడవద్దు. ఈ జ్ఞానము పైనుండి వచ్చునది గాక భూ సంబంధమైనదియు ప్రకృతి సంబంధమై నదియు దయ్యముల జ్ఞానము వంటిదియునై యున్నది. ఏలయనగా మత్సర మును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతినీచకార్యమును ఉండును. అయితే పై నుండి వచ్చు జ్ఞానము మొట్ట మొదట పవిత్రమైనది, తరువాత సమాధాన కరమైనది, మృదువైనది, సులభముగా లోబడు నది. కనికరముతోను మంచి ఫలములతోను నిండుకొనినది. పక్షపాతమైనను వేషధారణ యైనను లేనిదియునై యున్నది. నీతిఫలము సమాధానము చేయువారికి సమాధానమందు విత్తబడును" (యాకోబు 3:13-18).

అహంకారముగలవాడు, సమస్తమును ఎరిగినవాడననుకొనేవాడు జ్ఞానయుక్తముగా దేనిని గూర్చి మాటలాడ లేదు, లేదా తానే జ్ఞానినను కొంటే అట్టివానిది దయ్యముల సంబంధమైనది, భూ సంబంధ మైనది. అహంకారము తండ్రి వద్ద నుండి వచ్చు జ్ఞాన లక్షణము కాదు.

"అట్టివాడు ఎల్లప్పుడు తప్పే, సంశయము ఏమిలేదు", "అది నాకు తెలియదని అత దెన్నడు అన్నట్లు నేను వినలేదు" అని అతని గూర్చి జ్ఞానులు చెప్పుకొందురు.

నిజంగా జ్ఞానియైనవాడు ఎల్లవేళలా శాంతి సమాధానములను వెదుకుతాడు, మృదువుగా యుంటాడు. తాను చెప్పేదేదో డాంబికంగా చెప్పడు.

నిజంగా జ్ఞానియైనవాడు తన పరిమితు లను ఎరిగినవాడు. ఎవడైనా తప్పు చేయ వచ్చు. ఏదో దాని గూర్చి ప్రతివారు ఎప్పుడో తప్పుచేసి యుంటారు. అయితే ఆ తప్పులను ఎవరు సరిదిద్దకూడదని దాని అర్థం కాదు. తప్పులను సరిదిద్దేవారు కూడా వినడానికి మనస్కరించాలని దాని యుద్దేశ్యము. మనం సాదువుగా మృదువుగా చెబితే యితరులు తప్పక వింటారు. నిజంగా జ్ఞానియైనవాడు తాను చెప్పేది జీవితంలో జీవించి చూపిస్తాడు.

– సీసెల్ మే

# క్రీస్తు లేపబడి యుండక పోతే ...?

## (If Christ has not been Raised?)

*- Harvey Porter*



"క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నా డని ప్రకటింపబడుచుండగా మీలో కొందరు – మృతుల పునరుత్థానము లేదని యెట్లు చెప్పు చున్నారు? మృతుల పునరుత్థానము లేని యెడల క్రీస్తు కూడ లేపబడి యుండలేదు. మరియు క్రీస్తు లేపబడియుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాస మును వ్యర్థమే" (I కొరింథీ 15:12-14).

కొరింథులోని క్రైస్తవులు మృతుల పునరుత్థానమును గూర్చి అలజడి జెంది యున్నారు. I కొరింథీ 15వ అధ్యాయములో అపొ. పౌలు వారికి చాకచక్యముగా పున రుత్థానమును గూర్చి విశ్లేషణ యిచ్చాడు. క్రీస్తు పునరుత్థానము, మానవులందరి పునరుత్థా నము అతడు వక్కాణించాడు. దేవతార్చన చేయు మతములు మరణానంతరం జీవమును గూర్చి యేమీ చెప్పవు. క్రైస్తవ్యము ఒక్కటి మాత్రమే మరణానంతరం జీవాన్ని గూర్చి నిరీక్షణ యిచ్చుచున్నది.

పౌలు యిట్లు వ్రాసాడు "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున తిరిగిలేచెను" (I కొరి 15:3-4). క్రీస్తు యొక్క మరణం, సమాధి, పునరుత్థానములే సువార్త సారము. బైబిలు వర్తమానమునంతటికీ యిదేమూలము. క్రీస్తు మరణము లేఖనముల ప్రకారము జరిగెనని పౌలు వక్కాణించాడు. ఆయన మూడవ దినమున మృతులలో నుండి లేఖనముల ప్రకారము తిరిగి లేచెను. ఈ వాస్తవములు దేవుడు అనాదికాలములో సంకల్పించిన రక్షణ సంకల్పమే. పాపు లందరినీ రక్షించుటకు దేవుడు చేసిన ఏర్పాటు యిది. అది అదుపుతప్పిన మానవ

సందర్భము యేమీ కాదు.

యేసు మృతులలోనుండి లేచెనుగాని మరెవరు లేవరని కొరింథీయులు తలంచు చున్నట్లగుపడుచున్నది. అయితే మృతులందరు లేపబడకపోతే, యేసు ప్రభువు కూడ లేచి యుండకపోను అని పౌలు వాదించాడు. నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడని అతడు చెప్పెను. ప్రథమ ఫలమని చెప్పుటలో తదుపరి లేపబడబోవు చున్నవారిని గూర్చి అతడు చెప్పాడు.

తరువాత, క్రీస్తు గనుక లేపబడి యుండకపోతే సంఘము బోధించుచున్న వర్తమానము వ్యర్థమేయని పౌలు వాదించాడు. ఆదిమ సంఘము క్రీస్తు పునరుత్థానమును బోధించెనని దానియర్థము. సువార్త యొక్క ముఖ్యాంశమే అది. ఈ లోకం వినదగిన శుభ వర్తమానము యిది. వృద్ధులు, యౌవనులు ప్రతి గంటలోను మరణించు చున్నారు. అయితే వారు తిరిగి జీవిస్తారు అనేది శుభవర్తమానం. ఇంకా యేమంటే మనందరి పాపముల కొరకు మృతి చెందిన రక్షకుని సమక్షంలో ఈ నిత్యజీవితాన్ని గడుపుతాం అనేది శ్రేష్టమైన వాక్యం. ఈ గొప్ప సత్యాన్ని లోకం ఎందుకు నిరాకరించు చున్నదో గ్రహించుకొనుట కష్టం. క్రైస్తవ్యమును స్వీకరించనివారు కూడ అంతా ఈ లోకమే యన్నట్లు బ్రతుకుచుండుట కూడ ఆశ్చర్యమే. వారిలో కొందరు ఆరాధనలకు వెళ్లరు, వాక్యమును చదువరు, ప్రార్థించరు, దేవునికి కానుకలనీయరు. ఎన్నడు నిత్యత్వాన్ని గూర్చి మాట్లాడరు. ఇవన్నీ ప్రాముఖ్యమని వారెరుగుదురు.

అపోస్తలులు బోధించుచున్న క్రీస్తు యొక్క పునరుత్థానము అసత్యమయితే, వారి విశ్వాసము కూడ వ్యర్థమేయని పౌలు బోధించాడు. ప్రకటించబడిన వర్తమానముపై విశ్వాసము ఆధారపడియున్నది. రోమీయులకు వ్రాస్తూ "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" అని పౌలు వ్రాసాడు (రోమా 10:17). మన జీవితం అంతా విశ్వాసము వలన నడిపించబడ్తాది, ఆదరిస్తాది, కొనసాగింపబడ్తాది. మన జీవిత యాత్ర ఈ లోకంలో ముగిసిన తరువాత మరల జీవిస్తామని నిత్యము జీవిస్తామనేది ఆ విశ్వాసము యొక్క ముఖ్యాంశము. ఈ వాస్తవాన్ని పునరుత్థాన బోధలో యేసు కూడ బయలుపరచారు. దేవుని ప్రేమతో ఆయన యదార్థతను, శిక్షతో బహుమతిని కూడా స్వీకరించాలి.

"ఈ జీవిత కాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించు వారమైన యెడల మనుష్యులకంటె దౌర్భాగ్యులమైయుందుము" అని పౌలు వాదించాడు (I కొరి 15:19). అవిశ్వాసులకు నిరీక్షణ యేమీలేదు. యేసు క్రీస్తు సజీవుడైయున్నాడు గనుక మన నిరీక్షణ యదార్థమే!

– హార్వే పోర్టర్

# విశ్వసించుట ఒక క్రియ
## (Believing is a work)

*Jimmy Jividen*

క్రియలు లేకుండా నాకు విశ్వాసమున్నదని చెప్పేవానిది మృత విశ్వాసము. "క్రియలు లేని విశ్వాసము మృతము" అని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 2:17). యేసు యిచ్చు ఆజ్ఞలకు లోబడకుండా ఆయన యందు విశ్వాసము గలవానినని చెప్పుకొనువానికి కలిగే మేలు ఏదీలేదు. చెప్పేది చేయక పోవడం స్వవిరుద్ధమే.

యేసు క్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుట ఒకని యిచ్ఛ పూర్వకమైనపని. లేఖనములు అనుగ్రహించు రుజువులను అంగీకరించుటకో, నిరాకరించుటకో ప్రతివాడు నిశ్చయించుకొనును. దేవుని దగ్గరనుండి అద్భుతరీతిగా మానవునికి విశ్వాసమురాదు, మానవుని ఎంపిక శక్తిని దేవుడు నిరాకరించడు. విశ్వసించడానికి మనం ఎంచుకొంటాము. దేవుని అమితమైన ప్రేమను బట్టియు, లేఖనములలో యున్న రుజువులను బట్టియు మనం విశ్వసించడానికి ఎంచుకొంటాము. ఆ ఎంపిక వ్యక్తిగతమైనదే. అది యిచ్ఛాపూర్వక ఒక క్రియ.

విశ్వాసము ఆజ్ఞాపింపబడవచ్చునని బైబిలు చెప్పుచున్నది. "ఆయన ఆజ్ఞయేదనగా, ఆయన కుమారుడైన యేసు క్రీస్తు నామమును నమ్ముకొని, ఆయన మనకు ఆజ్ఞ నిచ్చిన ప్రకారముగా ఒకనినొకడు ప్రేమింప వలెనను నదియే" (యోహాను 3:23).

విశ్వాసము ఒకని వ్యక్తిగత నిశ్చయమని బైబిలు చెప్పుచున్నది. యేసు స్వస్థపరచిన గ్రుడ్డివాడు ప్రభువా నేను నమ్ముచున్నానని చెప్పెను. యేసు తన్ను తాను అతనికి ప్రత్యక్ష పరచుకొనెను (యోహాను 9:36-38). అతని విశ్వాసము వ్యక్తిగతమైనది. దేవుని కుమారుని గూర్చిన రుజువులను గ్రహించి అతడు విశ్వసించెను. "ఆయన పంపిన వాని యందు విశ్వాసముంచుటయే దేవుని క్రియయని" యేసు చెప్పెను (యోహాను 6:28-29).

నీవొక అద్భుతము చూసేవరకు, లేదా వేదాంతి ఎవరో నీకు రుజువులిచ్చేవరకు కనిపెట్టవద్దు. దేవుడు తన లేఖనముల యందు యేమి బయలుపరచెనో దానిని విశ్వసించుటకు నిశ్చయించుకొనుము. అది నీ నిశ్చయతే.

– జిమ్మీ జివిడెన్

# సర్వసమానత్వము
## (EGALITARIAN)

*- Owen Consgrove*

సర్వసమానత్వము అనే మాట ఈరోజుల్లో తరుచు వాడబడుచున్నది. మానవులందరు సమానులేయనే భావం దానిలో యున్నది. అమెరికా దేశ స్వాతంత్ర ప్రకటనలో మానవులందరు సమానముగానే సృజింపబడ్డారనే వాస్తవం వక్కాణించబడింది. "ఇందులో యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు, యేసు క్రీస్తు నందు మీరందరును ఏకముగా యున్నారని" క్రొత్త నిబంధన బోధించుచున్నది (గలతీ 3:28).

మానవుల వ్యక్తిగత ప్రాథమిక హక్కులను గూర్చి, వారి సామర్థ్యమును గూర్చి చెప్పబడిన ఘన సంగతులు యివి. మానవులందరు అన్ని విషయాల్లో ఖచ్చితంగా సమానులేయని అవి చెప్పవు. చెప్పాలంటే తాము జీవించే విధానాన్ని బట్టి, దేవుని చిత్తానికి స్పందించే విధానాన్ని బట్టి మానవులు అసమానులు. ఒక తరగతిలో యున్న విద్యార్థులందరు సమానులు కారు. క్రీడాస్థలములో క్రీడాకారులందరు సమానులు కారు. కర్మాగారములలో యున్న కార్మికులందరు సమానులు కారు. మరియు తీర్పు దినమున మానవులందరు సమానులు కారు. మానవుల నైతిక విలువలలోను, ప్రవర్తనలోను, తలంపులలోను గొప్ప వ్యత్యాసమున్నది.

సాంఘిక సమానత్వము కొరకు కొన్ని ప్రభుత్వముల వారు ధనికులకు భారభరితమైన పన్ను వేసి పేదలకు పంచుటకు ప్రయత్నిస్తారు. అయితే "ఎవడైనను పని చేయని యెడల వాడు భోజనము చేయకూడదని" దేవుని వాక్యము చెప్పుచున్నది (2 థెస్స 3:10).

ఎన్ని పాపములు చేసినా, మానవులందరు పరలోకమునకు వెళ్తారని కొందరు చెబుతు యుంటారు. గాని గొర్రెలనుండి మేకలను వేరుచేయునట్లు దేవుడు నీతిమంతులను, భక్తిహీనులను వేరుచేయునని బైబిలు బోధించుచున్నది (మత్తయి 25:32). అన్ని సిద్ధాంతములు సరియైనవికావు. అందరు సరిగా విధేయత చూపరు. అన్ని మతాలు, మతశాఖలు పరలోకానిక చేరవు. మరియు "ప్రభువా, ప్రభువా అన్ని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకములో ప్రవేశింపడుగాని, పరలోకమందున్న నా తండ్రి చిత్తము చేయువాడే ప్రవేశించును" అని యేసు చెప్పారు (మత్తయి 7:21).

"కీడు మేలనియు, మేలు కీడనియు చెప్పుకొని చీకటి వెలుగనియు వెలుగు చీకటనియు ఎంచుకొను వారికి శ్రమ. చేదు తీపి అనియు తీపి చేదనియు ఎంచుకొను వారికి శ్రమ" (యెషయా 5:20). మంచి చెడుల విచక్షణ కలిగియుండుట ఆత్మీయ ఎదుగుదలకు లక్షణము (హెబ్రీ 5:14).


ప్రాథమిక సమానత్వాన్ని, నిరీక్షణను గొప్పగా ప్రోత్సహించేది క్రొత్త నిబంధన గ్రంథమే. సర్వసమానతరుణాలను అసమాన స్పందనను కూడ అది చూపించుచున్నది. నమ్మకమైనవారికే జీవ కిరీటం. దేవుని చిత్తాన్ని వ్యతిరేకించువారు దాని పర్యవసనాన్ని ఎదుర్కొంటారు. నీతికి అవినీతికి, పరలోకానికీ నరకానికి వున్న వ్యత్యాసం గొప్పది.

– ఓవెన్ కాస్‌గ్రోవ్



# కష్టమైన వారితో జీవించుట
## (Living wiht difficult People)

*- Ancil Jenkins*



"వారు తనతోకూడ యుండునట్లును దయ్యములను వెళ్లగొట్టు అధికారము గలవారై సువార్త ప్రకటించుటకును వారిని పంపవలెనని ఆయన పండ్రెండుమందిని నియమిం చెను" (మార్కు 3:14-15).

యేసు యొక్క పండ్రెండు మంది అపొస్తలులు ఒక్కొక్కరి నుండి వేరుగా యున్న వ్యక్తులు. వారి యొక్క వ్యక్తిత్వములోను మనస్తత్వములోను యున్న తారతమ్యాన్ని గమనించు.

**పేతురు యోహానులు** భిన్నమైనవారు. పేతురు తొందరపాటు గలవాడు. వెంటనే మాట్లాడేస్తాడు. యోహాను నెమ్మది పరుడు, బహుళ ప్రార్ధనాపరుడు. అతడు "యేసు ప్రేమించిన శిష్యుడు". గాని నిజానికి అతడు కోపిష్టుడు, పగతీర్చుకొనే స్వభావము గల వాడు (లూకా 9:54). క్రీస్తు రాజ్యములో ప్రధమస్థానమునభ్యర్ధించి అతడు, యాకోబు కూడ మిగతా వారికి కోపము పుట్టించారు.

**నతనియేలు, తోమాలలో** కూడా కొన్ని వ్యత్యాసములున్నాయి. నమ్మడానికి నతని యేలుకు యేమి కష్టము కాలేదు (యోహాను

1:45-49). సందేహించు తోమా నిజానికి సందేహించలేదు గాని ఇంకా ఎక్కువ రుజువు కొరకు కాంక్షించాడు (యోహాను 20:25-28).

**మత్తయి సీమోనుల** కంటె భిన్నమైన వారుండరు. మత్తయి ద్వేషింపబడిన సుంకరి, పన్నులు వసూలు చేసేవాడు. రోమీయుల ఉద్యోగి. సీమోను జెలోతేలకు చెందినవాడు. రోమా ప్రభుత్వాన్ని వారి సేవకులను పడద్రోయడానికి పని చేసేవారు జెలోతేలు. నిజానికి ఈ జెలోతే ఉగ్రవాదులు పన్ను వసూలు చేసే ప్రతివానిని చంపబూనుకొన్న వారు. యేసు సమక్షములో కాకుండా ఇంకో సందర్భములో సీమోను మత్తయిని కలసి కొన్నట్లయితే, బహుశ అతనిని కత్తితో పొడిచి చంపేసేవాడే.

ఈ మనుష్యులలో యున్న వ్యత్యాస మెంతయున్నదో! వీరు అంతకన్నా వ్యత్యాసం గల ఇంకో ఆరుగురితో జతకూర్చబడ్డారు. వారిలో ఎవ్వడు పరిపూర్ణుడు కాదు. గాని ప్రతివాడు తన సమస్యలను, కష్టాలను తనతో కూడ తెచ్చుకొన్నాడు. ఈ 12 మందిని గుమి గూడ్చితే వారు ఒండొరుల యెడల అనుమానం, అసూయకలిగినవారు.

ఇట్టివారిని యేసు ప్రభువు మలిచి ఆయన ఆజ్ఞకు లోబడి ఆయన వాగ్దానమును నెర వేర్చు గుంపుగా తయారు చేసారు. వారు సర్వలోకానికి వెళ్లి సువార్త ప్రకటించాలని ఆయన ఆజ్ఞ యిచ్చారు. ఆయన చేసిన వాగ్దానము "ఇదిగో యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో యుందును" (మత్తయి 28:18-20). ఈ ఆజ్ఞానుసార ముగా, ఆయన వాగ్దానమును బట్టి వారా యన పనిని విజయవంతముగా కొనసాగిం చారు (కొలస్స 1:23).

యేసు యొక్క ఆజ్ఞను విన్న తరువాత ఆ పండ్రెండు మంది యెరూషలేములో కూడు కొని ప్రపంచములో ఒక్కొక్కడు ఒక భాగము నకు సువార్త చాటాలని నిశ్చయించుకొన్నారని యూసిబియస్ అను చరిత్రకారుడు వ్రాసాడు. నిజానికి వారిలో ప్రతివాడు తనది కాని దేశములో హతసాక్షులై మరణించారు.

అట్టి భిన్నమైన ప్రజలలో ఐక్యత, ఏకాగ్రత యేసు కలుగ జేయగలిగితే, మనకు నిరీక్షణా లేదా? యూదులను అన్యజనులను ఒకటిగా ఆయన చేయగలిగితే, మనకు అట్లు ఆయన చేయలేరా? (ఎఫెసీ 2:13-15). సహోదరుల మధ్య భిన్నాభిప్రాయములు, అపోహలు మనలను విడదీయనీయ కూడదు. మనం మానవమాత్రులం, వ్యత్యాసాలు గల వారం అని మనం గ్రహించుకోవాలి. భిన్నాభిప్రాయ ముల వలన సంఘము కలతచెందకూడదు. వాటిని ఎట్లు పరిష్కరించుకోవాలో యేసు మనకు తెలియజేసారు (మత్త 5:22-24 18:15-17). మన వ్యత్యాసములను బట్టి ఆయన రాజ్యములో ఉపయుక్తములైన పనిముట్లుగా మనలను తయారు చేయగల ఆయన శక్తియందు నమ్మిక యుంచుదాము. భిన్న స్వభావము గల వ్యక్తులను ఆయన ఏకం చేసారు. ఇప్పుడు చేయగలరు!

– ఏన్సిల్ జెంకిన్స్

# నేనేమి బోధించగలను?
## (What Could I Preach?)

*- Basil Overton*

"క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23).

క్రీస్తును గూర్చి బోధింపదలచి ఆయన సంఘమును గూర్చి చెప్పకుండా యుంటే యేమి బోధించగలను?

నేను క్రీస్తు యొక్క నాయకత్వమును గూర్చి బోధించితే ఆయన దేనికి శిరస్సై యున్నాడో ఆ సంఘమును గూర్చి తప్పక చెప్పాలి (కొలస్స 1:18).

ఆయనే మన రక్షకుడని బోధించితే, ఆయన దేనికి రక్షకుడై యున్నాడో ఆ శరీరమును గూర్చి బోధించాలి (ఎఫెసీ 1:22, 23).

నేనాయన రక్తమును గూర్చి బోధించితే ఆ రక్తముతో ఆయన కొనిన తన సంఘమును గూర్చి బోధించాలి (అపో.కా. 20:28).

యిచ్చే ఆయన స్వభావమును గూర్చి బోధింపదలచితే ఆయన ఎల్లవేళలా యిచ్చు చున్న వాటిని గూర్చి బోధించాలి. మరియు పుచ్చుకొనుటకంటే ఇచ్చుట మేలని ఆయన చెప్పినట్లు చెప్పాలి. చివరిగా ఆయన తన సంఘము కొరకు తన్నుతాను అర్పించు కొన్నారని బోధించాలి.

క్రీస్తుకు లోబడియుండుటను గూర్చి బోధించితే సంఘమే ఆయనకు లోబడి యుండాలని బోధించాలి (ఎఫెసీ 5:24).

యేసు యొక్క ప్రేమను గూర్చి నేను బోధింపదలచితే ఆయన సంఘమును ప్రేమించి దాని కొరకు తన్నుతాను అప్పగించు కొన్నారని బోధించాలి (ఎఫెసీ 5:25).

పరిశుద్ధపరచి ప్రత్యేక పరచే ఆయన శక్తిని గూర్చి బోధింపదలచితే, క్రీస్తు వాక్యముతో ఉదక స్నానము చేత సంఘమును పవిత్ర పరచి, పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెనని బోధించాలి (ఎఫెసీ 5:26).

పోషించి సంరక్షించే క్రీస్తు యొక్క శక్తిని గూర్చి నేను బోధింప దలచితే క్రీస్తు సంఘమును పోషించి సంరక్షించుచున్నాడని బోధించాలి (ఎఫెసీ 5:29).


ఎవరైనా క్రీస్తును గూర్చి బోధింపదలచితే ఆయన సంఘమును గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో దానిని చెప్పకుండా యుండలేదు.

**- బేసిల్ ఓవర్టన్**

# ఆరాధనలో దేవుని మహిమ పర్చుట

## (Glorifying God in Worship)

*- Max Patterson*



ఆరాధనలో క్రైస్తవులు దేవుని మహిమ పర్చాలి. దాన్ని జరిగించుటకు గాను ఆరాధనలో ఏమేమి ఇమిడియున్నాయో తెలిసికోవాలి. దేవుడిచ్చిన ఆరాధన క్రమమునుండి తొలగి పోకుండా చూచుకోవాలి.

ఆరాధనయనగా పూజించుట, గౌరవించుట, ఘనపరచుట యని అర్థము. క్రీస్తుకు సర్వాధికారము ఇయ్యబడినందున ఆయన ఆరాధనీయుడు, ఆరాధన స్వీకరించువాడు.

అక్రమ ఆరాధన యొక్క ఉదాహరణలు బైబిలులో అనేకములున్నాయి.


1. యాజకులు ప్రతిష్ఠితమైన వాటికిని సాధారణమైన దానికిని భేదమెంచక దేవుని ఆరాధనను అక్రమం చేసారు (యెహెజ్కేలు 22:26).

2. నాదాబు అబీహులు దేవుడు వారికాజ్ఞాపింపని వేరొక అగ్నిని తెచ్చి ధూపద్రవ్యము వేయబూనుకొన్నారు (లేవీ 10:1-2).

3. యేసు కాలమునాటి ప్రజలు వ్యర్థారాధన చేసారు. వారు మానవులు కల్పించు పద్ధతులు దైవోపదేశములని బోధించారు (మత్తయి 15:7-9).

4. ఏథెన్సు పురప్రజలు అజ్ఞానము వలన విగ్రహములనారాధించారు. వారికి తెలియబడని దేవునికి సయితము ఒక బలిపీఠము నిర్మించారు (అపో.కా. 17:23).

పాతనిబంధనలో యూదుల కియ్యబడిన పది ఆజ్ఞలలో ఒకటి విశ్రాంతి దినమును



పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచు కొనుము అనునది (అపో.కా. 20:7).

యూదుల యొక్క ఆరాధనలో యెరూష లేము కేంద్ర స్థానమై యుండెను (నిర్గమ 25:8,9,22). నేడు క్రైస్తవ్యములో మనం ఎక్కడకు యాత్రలకు వెళ్లనవసరం లేదు గాని ఎక్కడ వున్నను అక్కడ దేవుని ఆరాధించ వచ్చును. (యోహాను 4:20-26 మార్కు 16:15-16).

పాతనిబంధన ప్రకారము ఆరాధనలో అనేక ఆచార కర్మలుండేవియని లేవీ కాండము తెలియజేయుచున్నది. గాని క్రైస్తవ్యములో దేవుడు ఆత్మతోను సత్యము తోను ఆరాధింపబడాలి (యోహా 4:24). సత్యారాధనలో దిగువ పేర్కొనిన ఆరాధన క్రియలుండాలి.

1. మొదట వాద్యములు లేకుండా పాటలు, కీర్తనలు పాడాలి (కొలస్స 3:16 ఎఫెసీ 5:19).

2. ప్రార్థన చేయాలి. దేవుని బిడ్డలు ఎల్లప్పుడు తమ పరలోక తండ్రికి ప్రార్థన చేయాలి (యోహాను 14:13-14; కొలస్స 3:17).

3. వాక్యోపదేశము చేయాలి (మత్త 28: 18-20 అపో.కా. 2:42).

4. ప్రభు రాత్రి భోజనం జరిపించాలి. యిది ప్రతి ఆదివారమున జరిపించాలి. (అపో.కా. 20:7; I కొరింథీ 11:23,24).

5. కానుకలనీయాలి (I కొరింథీ 9:6-7).

మనం దేవుని ఆరాధనను మార్పు చేస్తే తండ్రిని కలిగియుండము. సరిగదా క్రీస్తును కూడ కలిగయుండము (2 యోహాను 9-11). దేవుడు చెప్పినట్లు మనం ఆరాధిస్తే దేవుడు మహిమ పర్చబడ్తాడు. మీరేమి చేసినను తండ్రియైన దేవుని మహిమార్థమై చేయుడి (I కొరంథీ 10:31).

– మేక్స్ పేటర్సన్

# శక్తివంతమైన ఆరాధన

## (Dynamic Worship)

*- Clarence DeLoach*



శక్తివంతమైన ఆరాధన అంటే మన ఉద్దేశ్యం యేమిటి? చురుకైన ఆరాధన, దేవుని కేంద్రీకృతం చేసిన ఆరాధన. ఆయనకు మహిమ, ఘనత, ప్రభావము ఆరోపించే ఆరాధన. ఆయన శక్తినుండి మనకు బలము ప్రసాదించే ఆరాధన. ఆరాధన అంతా దేవునికిచ్చేదే అయితే దాని నుండి మనం ఆశీర్వాదములు పొందుతాము.


ఆరాధననుండి నేనేమీ పొందలేదని చెప్పే వారుంటారు. అలాగన్నప్పుడు ఆరాధనలో కాదుగాని ఆరాధించే వానిలోనే లోపం వున్నదని గ్రహింపవచ్చును. నీ ఆరాధన భావసహితంగా యుండులాగున దిగువ సలహాలను గమనించుము.

ప్రతి ఆదివారం ఆరాధించుటకు ప్రాధాన్యత నీయుము. వారం అంతలోను నీవు చేసే ముఖ్యమైన పని అది. నీవు దేవున్ని ఆరాధనలో కలసికొంటావు.

మిగిలిపోయినవి దేవునికి తేవద్దు. దేవు డెల్లప్పుడు ప్రథమ ఫలాన్నే కోరారు. మిగిలిన ముక్కలతో దేవుని సంతృప్తి పరచలేవు. శనివారం రాత్రి ప్రశాంతముగా నిద్రపోయి ఆదివారం ఉదయాన్నే నిర్మల మనస్సుతో దేవుని ఆరాధించు.

సమయానికి ఆరాధనకు రమ్ము. ఆలస్యంగా వస్తే నీవు ఆరాధనలో కొన్ని సంగతులను కోల్పోతావు. యితరులకు భంగం కలిగిస్తావు.

నీ బైబిలు కూడ తెచ్చుకో. ఆయుధం లేకుండా యుద్ధానికి వెళ్లుట ఎట్లో బైబిలు లేకుండా ఆరాధనకు వచ్చుట కూడ అంతే.



నీ గొంతెత్తి సంఘంముతో కలిసి పాటలు పాడు. అదొక ఆజ్ఞ. పాడకుండా యుంటే దేవుని ఆజ్ఞను ఉల్లంఘించినట్లే.

స్నేహభావము కలిగి యుండు. కుటుంబ సమేతముగా ఆరాధించి నప్పుడు ఆరాధన రక్తికట్టును. కుటుంబ సభ్యులు ఒండొరులను ప్రేమించాలి. తెలిసికోవాలి. సంఘం అంతాదేవుని కుటుంబమే.

వాక్యాన్ని జాగ్రత్తగా ఆలకించు. నోట్సు వ్రాసికో గలిగితే మంచిదే. బైబిలు తెరచి పరీక్షించు. వర్తమానమును జాగ్రత్తగా ఆలకించు. గ్రహించుకో. అది నీకు సహాయ పడ్తాది. ప్రసంగీకునికి ప్రోత్సాహము కలిగిస్తాది. అతడింకా మంచి వర్తమానము బోధించడానికి సహాయపడ్తాది. క్రైస్తవేతరులు కూడ నిన్ను చూచి ఆసక్తి కనుబరుస్తారు.


నీ ఆరాధనకు కేంద్రం దేవుడే గాని మానవుడు కాదు. ఆరాధన ముఖ్యంగా సమర్పించుకొనే సమయం. మొదటిగా మనకు మనమే దేవునికి సమర్పించుకొంటాము. మనం సమర్పించకపోతే మనకు యేదీ సమర్పించబడదు. అందుకే పుచ్చుకొనుట కంటే యిచ్చుట మేలు. నీవు యిచ్చేకొలదీ ఆశీర్వదించబడ్తావు.

— క్లేరన్స్ డిలోచ్

# ఆదివారం ఆరాధన దినం

## (The case for Sunday Worship)

*- Dalton Key*



సమాజముగా కూడుట మానరాదని క్రొత్త నిబంధన హెచ్చరించుచున్నది (హెబ్రీ 10:25). కొరింధులోనున్న ఆదిమ సంఘము ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనేవారు. మీరు ఆరాధనకు కూడి వచ్చినప్పుడు... అని పౌలువారికి వ్రాసాడు (I కొరింధీ 11:18). ఈ అపొస్తలుడు త్రోయలో ఏడు దినములు గడిపి, ప్రభువు దినమున అక్కడనున్న పరిశుద్ధులతో ఆరాధనలో గడిపాడు (అపొ.కా. 20:7).

ఆదివారమున క్రమముగా జరుగు ఆరాధనలు శిష్యులకు ప్రాముఖ్యము. పరలోకాధికారమును బొంది వారు ఆరాధనలో క్రైస్తవులు పాటలు పాడిరి (ఎఫెసీ 5:19, కొలస్స 3:16), ప్రార్థన చేసిరి (అపొ.కా. 2:42, 6:4-6, 13:3), వాక్యమును బోధించిరి (అపొ.కా. 2:42, 20:7), ప్రభురాత్రి భోజనములో పాలుపొందిరి (I కొరింధీ 11:23-29) మరియు కానుకలిచ్చిరి (I కొరి 16:1-2, 2 కొరి 9:6,7). ఈ క్రైస్తవారాధన క్రియలు దైవానుమతిబడసినవి గనుక వాటికి కలుపకూడదు, మార్చకూడదు.

ఆదిమ క్రైస్తవారాధన విధానమును మొదటి శతాబ్ధపు చరిత్రకారులు కూడ తమ వ్రాతలలో రుజువు పరచిరి. పొంతు, బితునియ ప్రదేశముల అధిపతియగు ప్లేని యగు నతడు మొదటి శతాబ్ధపు చివరి భాగంలో జీవించెను. అతడు క్రైస్తవులను గూర్చియు వారి ఆరాధన విధానమును గూర్చియు ట్రాజన్ చక్రవర్తికి ఒక లేఖను



వ్రాసెను. అతడిట్లు వ్రాసెను. "వారు (క్రైస్తవులు) ఒక ప్రత్యేక దినమందు కూడుకొనే అలవాటు కలిగియుండేవారు. వారు క్రీస్తును గూర్చి కీర్తనలు పాడేవారు. దేవుని గూర్చి పాడేవారు". రెండో శతాబ్ధారంభములోయున్న జస్టిన్ మార్టిర్ అనునతడు, "ప్రతి ఆదివార మున పట్టణములలోను పల్లెలలోను యున్న వారందరికీ ఒక కూటము ఏర్పాటుచేయ బడేది. వారందరు నిలబడి ప్రార్థనచేసేవారు" అని వ్రాసెను. వారు ప్రభురాత్రి భోజనమును కూడ ఆచరించేవారని అతడు వ్రాసెను.

సంఘుపితరుడగు తెర్తుల్లు రెండో శతాబ్ధ ములో ఇట్లు వ్రాసెను "మేము ప్రతి ఆదివార మున కలసి సంఘుముగా సమాజముగా కూడుకొని ప్రార్థించేవారము. మా ప్రార్థనల బలము వలన దేవుని సన్నిధిని పొందేవారము. పరిశుద్ధ లేఖనముల నుండి చదువుకొనే వారము, ఆ పరిశుద్ధ వాక్యము ద్వారా మేము విశ్వాసములో పోషింపబడేవారము. ప్రతి వాడు తాను తెచ్చిన సొమ్మును చందాపెట్టెలో కానుకల నిచ్చేవారము."

ఇప్పుడు మనం ప్రతి ఆదివారమున చేయు ఆరాధనలు మానవ కల్పితము కాదు. అవి ఆధునిక పద్ధతుల ప్రతిఫలము కాదు. మనం ఆదివారమున కూడుకొనుట మొదటి శతాబ్ధపు క్రైస్తవుల నుండి, అపొస్తలుల కాలము నుండి జరుగుచున్నదే.

- డాల్టన్ కీ

# "ఆరాధనకు ఆహ్వానము"


## (Invitation to Worship)

*Maxie Boren*

సంఘారాధన ముఖ్యముగా దేవుని ఘనపరచుటకు ఉద్దేశించబడినది. ఆయన ప్రజలు కూడుకొని యెహోవాదేవుడు తమ సృష్టి కర్తయని గుర్తించుదురు. ఆయన ఎల్ల వేళల యుండువాడని, గతంలోను, ప్రస్తుతం లోను, భవిష్యత్తులోను యుండువాడని గుర్తించుచు తమ తలలు ఆయన సన్నిధిని వంచుదుము. ఆయన సర్వశక్తిమంతుడని ఈ విశ్వమంతటికీ కర్తయని వారు గ్రహింతురు.

మనం పాడు పాటలు, చేయు ప్రార్థనలు, విన్పించు దేవుని వాక్యము, ప్రభురాత్రి భోజనం, కానుకలు వగైరా ఇవన్నీ ఆయన యెడల మనకున్న ప్రగాఢ ప్రేమను ప్రకటించుటకు ఉద్దేశించబడినవి. ఇంకోమాటలో మనం ఆరాధనకు కూడుకొను ప్రతిసారి మనం విశ్వాసులమని, మన సృష్టికర్త గొప్పవాడని ఆయనను కొనియాడ్తాము, స్తుతి చెల్లిస్తాము. మన హృదయాలు ప్రేమతో, కృతజ్ఞతతో నిండియుంటాయి. తన బిడ్డలు దేవుని ఆరాధించాలనీ, వారాయనను ఆరాధింప కోరిక గలవారనీ పదే పదే బైబిలులో మనకగుపడ్తాది.

దేవుని ఆరాధించుటకు క్రైస్తవులు కూడు కొనునప్పుడెల్లా ఏకాత్మ ఏక అభిప్రాయ ములు గల వారికి శక్తిని ప్రోత్సాహమును ఇచ్చునని మనం గ్రహించాలి. దేవుని భక్తితో ఆరాధించునపుడు ఒండొరులతో మన ప్రగాఢ సహవాసాన్ని పంచుకొంటాము, విశ్వాసములో బలపడ్తాము. ఆయనకు స్తుతి గానములు పాడుటలో మన స్నేహ సుహృద్భావములు ఒండొరులతో బలపడ్తాయి.




ఒకరినొకరు హెచ్చరించుకొంటాము, ప్రోత్సహించుకొంటాము. దేవుని కుటుంబానికి చెందిన వారమనే భావం కలుగుతాది. దేవుని సింహాసనము యెదుట సోదరసోదరీలవలె కలిసి ఆరాధించుటలో ఈ గొప్ప ఆత్మీయ బంధుత్వం మరింత శక్తివంతమౌతుంది.

మనకు సమయం దొరికినప్పుడెల్లా తోటి సోదర సోదరీలతో కలిసి మనం ఆరాధన చేయుదము గాక. "యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" యని దావీదు చెప్పినట్లు మనం కూడ చెప్పుదుము గాక (కీర్తన 122:1). క్రీస్తు సంఘమే దేవుని మందిరమని మనం ఎరుగుదుము (I తిమోతి 3:15). అందువలన దేవుని కుటుంబము ఆయన నారాధించుటకు ఎల్లవేళలా సంతసించును గాక !

– మేక్సీ బోరెన్

# సంతోషము
## ("Happiness")

*- Salvador B. Cariaga*



“మునెన్నడులేనంత ధనము ప్రజలకు నేడున్నది గాని వారు సంతోషముగా లేరు. జీవన ఆర్థిక స్థాయి ఇదివరకెన్నడులేనంతగా అభివృద్ధి జెందినదిగాని ప్రజల జీవిత నైతిక స్థాయి పతనమైపోయింది. సమృద్ధిగల దేశంలో జీవిస్తు సంతోషంగా జీవించుట మనం నేర్చుకోలేకపోయాము” అని ఒకాయన వ్యాఖ్యానించారు.

సంతోషంగా యుండాలంటే మూడు రహస్యాలున్నాయని ఎవరో చెప్పారు. అవి డబ్బు డబ్బు డబ్బు! పైకి యిది నిజం అనిపిస్తుంది. గాని అది పైపై మాటయే. అది అసలైన పరిష్కారానికి, అంతర్భాగంలోనికి వెళ్లదు. అభివృద్ధి జెందియున్న దేశాలను ఒకసారి పరిశీలించు. వాటిలో జరిగే నేరాలు ఎక్కువ, ఆత్మహత్యలు ఎక్కువ, విడాకులు ఎక్కువ. డబ్బు సంతోషానికి, మనశ్శాంతికి నిదర్శనం కాదు. అందువలన మనం నిజమైన సంతోషాన్ని ఎట్లు కలిగి యుండగలము?

సర్వకాల సర్వావస్థలయందు హెచ్చుగా అమ్ముడగుచున్న గ్రంథము, రెండు వేలకు పైగా భాషలలోనికి తర్జుమా చేయబడిన గ్రంథము

దిగువ జవాబులను మనకిచ్చుచున్నది.

మొదటిగా బైబిలు దేవునిపై ఆధారపడ వలెనని బోధించుచున్నది. మనం ఎంత మందిని ఎరిగినా, మానవులు నమ్మతగిన వారుకారు. వారు ఒక్కోసారి మనలను కృంగ దీస్తారు. మనం సంపాద్యముపై నమ్మక ముంచరాదు కూడ. అవి తాత్కాలికం, వ్యర్థం, ప్రమాదకరం కూడ. అయితే నీవు దేవునిపై ఆధారపడవచ్చు. ఆయన నిత్యము ఉండు వాడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞాని. ఆయన ఆదియు, అంతమునై యున్నాడు. స్థిరమైన బండ, తుఫానులలో ఆశ్రయము (కీర్తన 23, ఫిలిప్పీ 4:6,7 2 కొరింథీ 4:8-9,16,17 మత్త 11:28).

రెండవదిగా, నీవేమైయున్నావో, నీకేమి యున్నదో అంగీకరించు. నటించుట విసర్జిం చుము! బాధలను, హింసను, శోధనను, నిరుత్సాహాన్ని, దుఖాన్ని అంగీకరించు, నీ జీవితంలో ముందుకు సాగు, "నేనే స్థితిలో యున్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొనియున్నాను. దీనస్థితిలో ఉండనే నెరుగుదును, సంపన్న స్థితిలో ఉండనెరు గుదును. ప్రతి విషయములోను అన్ని కార్యములలోను కడుపునిండి యుండుటకును ఆకలిగొని యుండుటకును నేర్చుకొని యున్నాను" అని పౌలు చెప్పెను (ఫిలిప్పీ 4:11-12, I కొరింథీ 7:24, I పేతురు 5:7) కూడ చదువుము.

మూడవదిగా గతంలోకాక ప్రస్తుతంలో జీవించు: "నిన్నటి దినము గతించిపోయింది. అది మరలరాదు, రేపు రాక పోవచ్చును గాని నీకు నేడున్నది. దాన్ని వినియోగించు, పోనీయకు, అనుభవించు, ఆనందించు. నేటి వలె మరొకటి ఉండదు. అది గతించిపోతే, ఎన్నటికీ గతించి పోయినట్లే" యని ఒకాయన వ్రాసారు. (మత్తయి 6:25-34, ఫిలిప్పీ 4:4-13, 2 తిమోతి 6:6-10 చదువుము).

చివరిగా ప్రయోజనకరమైన లక్ష్యాన్ని ఎంచుకో. మొదటి సంగతులు మొదటే. అన్నిటి కంటే ముందు దేవుని వాక్యాన్ని ఉంచుకో, ఈ లోకాన్ని కాదు. మనం మొదట దేవుని రాజ్యాన్ని ఆయన నీతిని వెదకాలని యేసు చెప్పారు (మత్త 6:33). "పై నున్న వాటి మీదనే గాని, భూ సంబంధమైన వాటి మీద మనస్సు పెట్టుకొనకుడి" యని పౌలు చెప్పాడు (కొలస్స 3:2), డబ్బు కొరకు, అధికా రము కొరకు, ప్రఖ్యాతి కొరకు పాడుపడు వారు చివరకు కొదువలో యుంటారు.

చివరకు పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "మెట్టుకు సహోదరులారా, యే యోగ్యత యైనను, మెప్పైనను ఉండిన యెడల ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతి గలవో వాటిమీద ధ్యానముంచుకొనుడి" (ఫిలిప్పీ 4:8).

– సాల్వడోర్ కరియాగ

# మిత్రుల వలన ఆశీర్వాదములు

## (The Blessings of Friends)

*- Demar Elam*

ప్రతివాని జీవితంలోను మంచి మిత్రులుంటారు. ఏ మనుష్యుడు ఒంటరిగా జీవించలేడు. "నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు సహోదరుడుగానుండును" (సామెతలు 17:17). ఇవ్విధమైన స్నేహితులు అరుదు. గాని స్నేహాన్ని మనం పెంపొందించుకోవాలి. సంపూర్తిగా నమ్మదగిన మిత్రులు నీకు కావాలంటే, నీవే యితరులకు అట్టివాడవు కావాలి.

**ప్రతివానికి మిత్రులు అవసరం.** ఈ జీవితం అంతా కష్టాలతోను, నిరుత్సాహముతోను నిండియున్నది. అందువలన సుఖ దుఃఖాలలో మనతో యుండే మిత్రులు అవసరం. అట్టి మిత్రులున్నారా? అవును ప్రతివారు అట్టి మిత్రులను కలిగియుండగలరు. అయితే నిజమైన మిత్రులు ఒక్క రోజులో తయారైపోరు. మిత్రులను కలిగియుండే అర్హత ఒకడు కలిగియుండాలి. నీకు నిజమైన మిత్రులు ఎందుకు లేరోయని ఆలోచిస్తుయుంటే సామెతలు 18:4 చదువుము. "బహుమంది చెలికాండ్రు గలవాడు నష్టపడును. సహోదరునికంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు'' మనందరికీ ఇట్టి మిత్రులు అవసరం.

"తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమ గలవాడెవడునులేడు" (యోహాను 15:13). మనందరికీ యున్న గొప్పమిత్రుడు యేసు క్రీస్తు. ఆయన దేవుని కుమారుడు. "ప్రీతి గల మన యేసు ఎంతో గొప్పమిత్రుడు, మితిలేని దయచేత హత్తుచు ప్రేమించును" అనే పాట మనం తరుచు పాడుచుయుంటాము. గాని ఆ పాట యొక్క భావాన్ని గ్రహించుకొనుటలో విఫలులమవుతాము. క్రీస్తుతో స్నేహం కలిగియుంటే కలిగే ఆశీర్వాదములు అసంఖ్యాకములు. మనకొరకు ఆయన ఇప్పటికీ మృతిజెందారు. అంతగొప్ప మిత్రుని మనం కనుగొనగలమా?

మనం క్రీస్తుతో స్నేహాన్ని అంగీకరిస్తే, ఆశ్చర్యం యేమంటే ఆయభిషిక్తునితో ఇంతకు ముందే స్నేహం కలిగిన అసంఖ్యాకమైన వారు మన మిత్రులవుతారు. ప్రతి క్రైస్తవుడు తనలాంటి క్రైస్తవులతో స్నేహాన్ని కలిగియుండి ఆనందిస్తుయుంటాడు. యేసు యొక్క మిత్రులతో కలిసియుండే ఆనందం, ఆశీర్వాదం ఎంతగొప్పదోగదా! అయితే మనం యితరులకు కూడ అట్టి మిత్రులముగా యున్నామో లేదో అంచనా వేసుకోవాలి. నీవు సహోదరుని



కంటె హత్తుకొని యుండే మిత్రుడవా? మనం యితరులకు ఇచ్చుటకు ఇష్టపడకపోతే పుచ్చుకొనుటకు ఆశించకూడదు కదా. మనం ఎట్టి మిత్రులను కోరుచున్నామో అట్టి మిత్రులముగా యుండాలి.

ప్రతి క్రైస్తవుడు క్రీస్తు వలె యుండుటకు కోరుకోవాలి. మనం క్రీస్తు వంటి వారముగ యుండాలి. అంటే క్రీస్తు యొక్క కార్బన్ కాపీ వలె యుండాలి. మనం క్రీస్తు వలె గొప్ప వారము కాలేము. గాని ఆయన వలె యుండుటకు అన్ని విషయాల్లో ప్రయత్నం చేయాలి.

"యేసు ఏడ్చెను" అని యోహాను 11:35లో వ్రాయబడియున్నది. యేసు ఎందుకు ఏడ్చారు? ఆయన సహోదరునికంటె ఎక్కువగా హత్తుకొని యున్న లాజరు యొక్క మిత్రుడు! అది చూచి యూదులు ఆయన అతనిని ఏలాగు ప్రేమించెనో చూడుడి యని చెప్పుకొన్నారు.


అవును యేసుతోను, ఆయన మిత్రులతోను స్నేహం కలిగియుంటే కలిగే ఆశీర్వాదములు అసంఖ్యాకములు!

– డీమర్ ఈలమ్

# అన్నిటికన్నా శ్రేష్టమైన బహుమానము

## (The Greatest Gift of All)

*Glenn Colley*



ఆయన రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు అని పిలువబడ్డారు. ఆయన మెస్సీయా, ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త, సమాధాన కర్త యగు అధిపతి, ఈ లోక రక్షకుడు. అభిషిక్తునికి అనేక నామకరణములున్నాయి. ఆయనే యేసు క్రీస్తు. ఆయన ఒక బహుమానము అని కూడ వర్ణింపబడుట ఆశ్చర్యం.

ఆయన నిజంగా ఒక బహుమానమే. యోహాను 3:16 లో యున్న బంగారు వాక్యము మనకు ప్రేమతో నిండియున్న

సృష్టికర్తను చూపుచున్నది. ఈ రీతిగా ప్రేమ ఇంతకు ముందెన్నడు అందియ్యబడలేదు, అందియ్యబడదు కూడ. న్యాయాధిపతియైన దేవుడు మనయతి క్రమముల పరిహార మూల్యము మన యొద్ద లేదని ఎరిగి యున్నాడు. గనుక ఆయనేమన కొరకా మూల్యమును చెల్లించారు. పాపములేని తన కుమారుని ఆయన మన కొరకు బలి యిచ్చారు. చెప్పనశక్యమైన ఈ గొప్ప బహు మానము కొరకు దేవునికి వందనములు.

ఈ బహుమానము ప్రయోజనాత్మక మైనది. అది పరిపూర్ణమైనది. "కాబట్టి తీర్పు ఒక్క అపరాధ మూలమున వచ్చినదై మనుష్యుల కందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో, అలాగే ఒక్క పుణ్య కార్యము వలన కృపాదానము మనుష్యుల కందరికిని జీవప్రదమైన నీతి విధింప బడుటకు కారణ మాయెను" (రోమా 5:18). యేసు ద్వారా మనదైనందిన అవసరములు తీర్చబడుచున్నవి (మత్తయి 6:33). చెప్పనశక్యమైన ఆయన గొప్ప బహుమానముకై దేవునికి వందనములు.

ఈ బహుమానము నిలుచునది. సమరయ స్త్రీతో యేసు మాట్లాడినప్పుడు ఆమె యొక్క హృదయం, జీవితం ఆయన ఎరుగును. ఆయన "నీవు దేవుని వరమును నాకు దాహమున కిమ్మని నిన్ను అడుగుచున్న వాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు. ఆయన నీకు జీవ జలము నిచ్చునని" ఆమెతో చెప్పెను (యోహా 4:10).

పాపమువలన, దాని భారము వలన కలుగు ఆత్మీయ దాహము దేవుడిచ్చే దానిని బట్టియే తీరును. క్రీస్తులోయుంటే ఎన్నడు ఆరిపోని కృపాధారల యొద్ద మనం ఆత్మీయ దాహాన్ని తీర్చుకొంటాము. "నేనిచ్చు నీళ్లు త్రాగు వాడెప్పుడును దప్పిగొనడు, నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని" యేసు ఆమెతో చెప్పెను (యోహాను 4:14). దేవుని గొప్ప బహుమానము కొరకై ఆయనకు వందనములు.

ఈ గొప్ప బహుమానమును అనుభవిస్తు యితరులకు కూడ దానిని అందియ్యవలెను. అందుకే యేసు "మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయండి. తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారిని బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించి తినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని" చెప్పారు (మత్తయి 28:18, 20).

విచారం యేమంటే అనేకమంది క్రైస్తవులు ఈ ఆజ్ఞను ఉల్లంఘించుచున్నారు. వారు తమ రాజును గూర్చి యితరులకు చెప్పరు. దేవుడిచ్చిన గొప్ప బహుమానము అందరికీ అవసరమే.

– గ్లెన్ కాలీ

# "ఆ పని చాలా గొప్పదా?"

## (Is the task too great?)

*Charles E. Cobb*

ప్రపంచమంతటా సువార్త చాటాలనే హెచ్చరిక ప్రతి స్థానిక సంఘములోను తరుచు చేయబడుతుయుంటాది. "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించుడి" యని యేసు తన శిష్యుల కాజ్ఞాపించారు (మార్కు 16:15). అయితే ఈ పని చాలా గొప్పదని, ఈ లోకం చాల పెద్దదని మనం చాల తక్కువగా యున్నామని అనేక మంది క్రైస్తవులు తలస్తారు.

మొదటిగా, ఒకే స్థానిక సంఘము ఈ పనినంతా సాధించలేదని మనం గ్రహించాలి. అయితే మిగతా సోదరులను తమ బాధ్యతల నుండి యిది తొలగించదు. కొన్ని బలహీన సంఘాలు కష్టపడి తమ ప్రాంతములోనే సువార్త చెప్పుటకు ప్రయత్నించుచున్నారు. అట్టివారికి బలమైన సంఘాలు సహాయ సహకారాలు అందియ్యాలి.

యితరదేశాలకు, ప్రాంతాలకు వెళ్లి సువార్త చాటుటకు యిష్టపడి సిద్ధముగా యున్న అనేక మంది సువార్తికులున్నారు. గాని వారక్కడికి వెళ్లడానికి, కొంతకాలం వుండడానికి వారికి నిధులు లేవు. అట్టివారికి కొన్ని స్థానిక సంఘాలు ఆర్థిక చేయూత నియ్యాలి.



ఏ పని చేయక చేతులు ముడుచుకొని కూర్చుంటే విశ్వాస రాహిత్యనికది సూచనగా యుండును. ఆ పని అంతా మనం చేయలేము

గనుక యేమీ చేయము అని అనుకొనుట గొప్ప పొరపాటు. మనం చేయగలిగినదంతా చేయాలని దేవుడు కోరుచున్నారు.

ఈ లోకం చాల పెద్దది. జన సంఖ్య దినదినము పెరుగుచూయున్నది. రక్షించు సువార్త యొక్క అవసరం చాల గొప్పది. పాపములోబడి రక్షింపబడగోరుచున్న వారి సంఖ్య చాల గొప్పది. సువార్తను విని దానికి లోబడిన మనం, సువార్తను వినలేని, రక్షింప బడలేని వారి యెడల బాధ్యత కలిగి యున్నాము. మన విశ్వాసాన్ని, వాక్యానుభవాన్ని వారితో పంచుకొనుట అత్యవసరము.

ఇశ్రాయేలీయులు వాగ్దానము చేయబడిన దేశమును స్వతంత్రించుకొనడం వారి శక్తికి మించినదని తలంచారు. దేవుడు వారితో యుందునని పలుమార్లు వారికి చూపించి నను, ఆ పని చాల గొప్పదని వారు తలం చారు. మనం అదే నిత్య సత్యదేవుని సేవించు చున్నాము. దేవునికి అసాధ్యమైనది ఏదైనా కలదా? దేవుని ప్రజలకు ఏ పనియైనా అసాధ్యమా?

సర్వలోకానికి సువార్త చెప్పే బాధ్యత 12 మందికి అప్పగింపబడినది. వారు ఆ పనిలో ప్రవేశించారు. దానిని సాధించారు. వారి బాధ్యత గొప్పది. గాని అసాధ్యమైనదికాదు. దేవుడు వారికితోడైయున్నారు.


క్రీస్తు సంఘ సభ్యులు కరపత్రికలను, బైబిలు పాఠాలను యితరులకు అందియ్య గలరు. రేడియో కార్యక్రమాలను గూర్చి యితరు లకు చెప్పగలరు. ఈ రోజుల్లో టెలివిజన్ కూడ విరివిగా వాడబడుచున్నది. ఇరుగు పొరుగు వారితో బైబిలు స్టడీ చేయవచ్చును. దాని ప్రభావము చాల గొప్పది. రక్షించుటకు దేవుని శక్తియైన సువార్తను ప్రతివాడు వినే లాగున ప్రతి తరుణాన్ని మనం వినియోగించాలి.

ఈ పని చాల గొప్పదా? "నిన్ను ఏ మాత్రము విడువను, నిన్నువెన్నడును ఎడబా యను" అని చెప్పిన దేవుని యందు మనం విశ్వాస ముంచితే అదిగొప్పదికాదు (హెబ్రీ 13:5). ఆయన ఇట్లు చెప్పారు "వర్షమును హిమమును ఆకాశము నుండి వచ్చి అక్కడికి ఏలాగు మరలక భూమినితడిపి విత్తువానికి విత్తనమును భుజించువానికి ఆహారమును కలుగుటకై అదిచిగిర్చి వర్ధిల్లునట్లు చేయునో ఆలాగే నానోట నుండి వచ్చు వచనమును ఉండును. నిష్ఫలముగా నా యొద్దకు మరలక అది నాకు అనుకూలమైన దాని నెరవేర్చును. నేను పంపిన కార్యమును సఫ లము చేయును" (యెషయా 55:10-11). మనం ప్రయత్నము చేస్తు యుండాలి!

**- చార్లెస్ కాబ్**

# అన్నిటి కంటే గొప్పధనము
## (The greatest Treasure)


*- O.P. Baird*



ఈ లోకంలో అనేకులు ధనవంతులుగా యుండాలనుకొంటారు. వాళ్ల సమయం, ఆలోచనలు వగాయిరా అన్నీ ధనార్జన కొరకే వెచ్చిస్తారు. ధనాన్ని సంపాదించుకొంటే వారి జీవితం సార్థకమవుతాదని, సంతృప్తిజెందు తారని వారు తలస్తారు. గాని అట్టి ధనం మోసకరం, అసంతృప్తికరం. అది సంతోషాన్ని ప్రసాదించదు. విత్తువాని ఉపమానములో యేసు ధన మోహమును గూర్చి చెప్పారు (మత్త 13:22). ఈ ధన మోహము వలన వాక్యము అణచివేయబడ్తాది. "మీరు ఏ విధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్త పడుడి, ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదని" యేసు చెప్పారు (లూకా 12:15).

ధనాపేక్షను గూర్చి అపొ.పౌలు హెచ్చ రించాడు. "ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (I తిమోతి 6:10).

"సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభ సాధనమై యున్నది. మనమీ లోకములోనికి యేమీ తేలేదు. దీనిలోనుండి ఏమియు తీసికొనిపోలేము. కాగా అన్న వస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తి పొంది యుందము. ధనవంతులగుటకు అపేక్షించు వారు శోధనలోను ఉరిలోను అవివేకయుక్తము



లును హానికరములునైన అనేక దురాశల లోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచి వేయును" అని అతడు హెచ్చరించాడు (I తిమో 6:6-9).

భౌతిక సంబంధమైన ధనము కంటె గొప్పదైన ఆత్మీయధనము కలదు, అది దేవుడిచ్చు ధనము. అది పరలోక రాజ్య ధనము. అపొ.పౌలు ఇట్లు వ్రాసాడు. "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున పరలోకములో ప్రధాను లకును, అధికారులకును సంఘము ద్వారా తన యొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి శోధింప శక్యము కాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలము నుండి మరుగై యున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికిని తేటపరచుటకును పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు ఈ కృప అనుగ్రహించెను" (ఎఫెసీ 3:8-11).

క్రీస్తుయొక్క ఐశ్వర్యము ప్రకటించ బడింది. గనుక విశ్వాసము ద్వారా ఆ ప్రకటనను అంగీకరించినవారు విధేయులై శోధింప శక్యము కాని ఐశ్వర్యమును పొందియున్నారు. పరలోక రాజ్యము యొక్క తత్వాన్ని వర్ణించుటకు యేసు ఉపమానము లనుపయోగించారు. "పరలోక రాజ్యము పొలములో దాచబడిన ధనమును పోలి యున్నది. ఒక మనుష్యుడు దానిని కనుగొని

దాచిపెట్టి అది దొరికిన సంతోషముతో వెళ్లి తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమును కొనును" అని యేసు చెప్పారు (మత్తయి 13: 44). పరలోక రాజ్యము దానియందలి ఆశీర్వాదము లన్నిటితో కలిసి గొప్పధనమై యున్నది.

ఈ గొప్ప ఐశ్వర్యము దేవుని కృప వలన కలిగిన వరము. ఈ ఐశ్వర్యాన్ని మనకిచ్చుటకు యేసు వచ్చారు. అపొ.పౌలు కొరింధు లోని క్రైస్తవుల కిట్లు వ్రాసాడు "మీరు మన ప్రభువైన యేసు క్రీస్తు కృపను ఎరుగుదురుగదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింధీ 8:9). యేసు పరలోకములో యున్నప్పుడా యన ఎంత ధనవంతుడో మనం ఊహించ గలమా? ఆయన దేవునితోయుండెను, దేవుడైయుండెను (యెహాను 1:1). ఆయన పరలోక ఐశ్వర్యమును మన కొరకు తాత్కాలి కముగా విసర్జించి మన పాపపరిహార్థా బలిగా ఈ లోకమునకు వచ్చెను. తద్వారా మనలను ఆయనతో నిత్యము వుండుటకు పరలోక ఐశ్వర్యమును అనుభవించుటకు సంకల్పించెను. ఆయన మనలను దేవునికి వారసులు గాను, క్రీస్తు తోడి వారసులుగాను చేసెను (రోమా 8:16-17). ఫిలిప్పీ 2:5-22 కూడ చూడుము.


విమోచింపబడిన దేవుని బిడ్డలు పరలోక ఐశ్వర్యమును అనుభవించుటే కాకుండ, ఆయన కృప వలన ఆయన వారిని ఇప్పుడు ధనవంతులుగ చేయును. "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7).

దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు (ఎఫెసీ 2:4) ఆ కృప మనకనుగ్రహించబడి మనలను సంపన్నులనుజేయును. "ఎందు కనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గు పరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది" (రోమా 5:5). దేవుని ప్రేమ తన హృదయములో కలిగి యున్నవాడెవడైనను ఈ గొప్ప ఐశ్వర్యమును కలిగియున్నాడు.

క్రీస్తులో మనకు పాపక్షమాపణ, ఆత్మీయాశీర్వాదములన్నియు కలిగియున్నాము. "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక, ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము మనకనుగ్రహించెను" (ఎఫెసీ 1:3). "చెప్పనశక్యకాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము!" (2 కొరంథీ 9:15).

– ఓ.పి. బైర్డ్

# ఈ లోకాన్ని మార్చిన యుద్ధము
## (The Battle that has changed the World)



దేవునికి సాతనుకు మధ్య యుద్ధము మొదలిడి వేలకొలది సంవత్సరములయ్యింది. అది సత్యానికి అసత్యానికి మధ్య యుద్ధము. ఈ యుద్ధము ఏ క్షణాన్నయినా ముగియ వచ్చును గాని దాని ఆరంభాన్ని గూర్చి, దానిలో జయం పొందిన వానిని గూర్చి ప్రశ్నలు ఉండిపోయాయి. ఈ ప్రశ్నలకు బైబిలు సూటిగా జవాబిచ్చుచున్నది. దేవునికి సాతానుకు యున్న యుద్ధారంభమును గూర్చి తెలుసుకొందాము.

భూమి సృజింపకమునుపు దేవుడు పరలోకాన్ని, దూతలను సృజించారు (ఆదికా 1:1, యోబు 38:3-7). దేవదూతలలో సెరాపులు, కెరూబులు, ప్రధాన దూతలు,

పరలోక సైన్యము ఇమిడియుండెను. ఈ గొప్ప దూత గణములలో ఒక దూతకు గొప్ప అధికారమీయబడెను. అతడు దేవునిపై తిరుగుబాటు చేసి తన పక్షముగా అనేక దూతలను ఈడ్చుకొనిపోయెను (యెషయా 14:12-15; మత్త 25:41). అతడు వారిని దేవునిపై యుద్ధము చేయుటకు నడిపించెను. అట్లు తిరుగుబాటు చేసిన దూతలు పాతాళ లోకమందలి కటిక చీకటిగల బిలములలోనికి త్రోయబడి తీర్పువరకు బంధింపబడి యున్నారు (2 పేతురు 2:4, యూదా :6).

అయితే తిరుగుబాటుచేసిన ప్రధాన దూత, సాతానుడు పరలోకము నుండి పడద్రోయ బడగా భూమిపై అతడు ఎవని మ్రింగుదునా అని గర్జించు సింహము వలె వెదకుచు తిరుగుచున్నాడు (I పేతురు 5:8). మోసము, పాపము అను వలను అతడు మానవులపై తెలివిగా విసరి వారిని పట్టుకొని యుండుట చేత మానవ జాతి తమ పాపములలోనే మరణించు చున్నారు (రోమా 6:23, యోహాను 3:8).

దేవుడు ప్రవక్తలను తన దూతలను భూమి పైకి పంపెను గాని ప్రజలు దుష్టునియందే జీవించుచున్నారు. సాతాను యొక్క ఉరిలో నుండి మానవులను విడిపించి, పాపముల నుండి వారిని రక్షించుటకు రెండు వేల సంవత్సరముల క్రితము దేవుడే మానవావ తారిగా భూమికి వేంచేసెను. క్రీస్తు తన జీవిత మంతటిని మానవుని రక్షణార్థము వినియోగించెను. ఆయన ప్రజలకు బోధించెను, స్వస్థపరచెను, వారికొరకు మృతి బొందెను.

కల్వరిలో దేవునికి సాతానుకు మధ్య రెండవ యుద్ధము సంభవించెను. ఈ యుద్ధము సమస్తాన్ని మార్చివేసెను. దాని పర్యవసానము వర్ణనాతీతమైనంత గొప్పది - పరలోకములో మానవుడు నిత్యజీవితం అనుభవించుట. ఆ విజయం యేసు క్రీస్తు ప్రాణం అర్పించుట వలన సాధ్యమయినది. ఆయన ద్వారా మనం సాతానును జయించు నిమిత్తము ఆయన మానవుల పాపము నిమిత్తము తన్నుతానే అర్పించుకొనెను. అంతయు సమాప్తమాయెనని చెబుతు ఆయన ప్రాణము విడిచెను. ఆయన పనిని ముగించారు, మూల్యాన్ని చెల్లించారు, విజేయుడయ్యారు!

సాతానుడు యుద్ధంలో ఓడిపోయాడు. సమస్తాన్ని కోల్పోయాడు. నేడు సిలువపై క్రీస్తు యొక్క బలి యాగాన్ని అంగీకరించు వాడెవడైనను నిత్యజీవమును పొంది, దేవుని బిడ్డగా కాగలడు (యోహాను 3:14-18, 1:12). ఈ యుద్ధం ప్రపంచాన్ని మార్చి వేసింది. విజేయుడైన వానిని నీ జీవితం లోనికి ఆహ్వానిస్తే నీ జీవితం కూడ మార్చి వేయబడును (ప్రక 3:20-21). యేసు "నేనే ద్వారమును, నా ద్వారా ఎవడైనను లోపల ప్రవేశించిన యెడల రక్షింపబడును" అని చెప్పెను (యోహాను 10:9).

- పేట్రిక్ బోయ్‌నెస్

# న్యాయమైన ప్రతిఫలము

## ("The Recompense of Reward")

*- John Thiesen*

"విశ్వాము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను" అని హెబ్రీ 11:6 లో వ్రాయబడి యున్నది.


దీనినిబట్టి దేవుని యందు విశ్వాసముంచుటలో  విశ్వాసమును బట్టి ఆయన ఫలము దయ చేయువాడని కూడ నమ్మవలెను. బహుమానము, ప్రతిఫలము అనునది శక్తివంతమైన మాట. మనకు జీతము లభ్యమగునని ఉద్యోగం చేస్తాము. లాభము కలుగునని మనుష్యులు వ్యాపారం చేస్తారు. ఒలింపిక్ క్రీడాకారులు బంగారు పతకాల కొరకు పోటీలో పాల్గొంటారు. కొందరు కళాకారులు గొప్ప ధనవంతులమవుదుమని  కష్టపడతారు. బంగారం దొరుకుతాదని గనులు త్రవ్వుతారు.

అదే రీతిగా ఆయనకు సేవచేయు వారికి దేవుడు ప్రతిఫలమిస్తారు. దేవుని తెలిసికొనుట వలననే మనకు అనేక మేళ్లు కలుగుతాయి. అయినను మనం ఆయనకు నమ్మకముగా సేవచేస్తే దేవుడు  అత్యంత విలువైన బహుమానములనిస్తారు.



**దేవుడు ఎల్లవేళలా బహుమానములనిచ్చారు.**

బైబిలు చరిత్రను బట్టి దేవుడు తన్ను వెంబడించు వారికి ఎల్లవేళలా బహుమానములనిచ్చారు. నోవహుభయ భక్తులు గలవాడై తనయింటి వారి రక్షణ కొరకు  ఓడను



సిద్ధము చేసెను గనుక జల ప్రళయం నుండి అతనికి రక్షణ అనుగ్రహింపబడెను (హెబ్రీ 11:7). అబ్రహాము పిలువబడినప్పుడు ఎక్కడికి వెళ్లవలెనో ఎరుగకయే విశ్వాసమును బట్టి బయలు వెళ్లెను గనుక తనకు తన కుటుంబానికి కానానును స్వాస్థ్యముగా పొందెను (హెబ్రీ 11:8) మరియు అతడు దేవుడు దేనికి శిల్పియు నిర్మాణాకుడునై యున్నాడో ఆ పట్టణమునకు వాగ్దానము పొందెను (10 వ). మోషే ఫరో రాజు యొక్క ధనము కంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని ఫరో కుమార్తె యొక్క కుమారుడనని పించుకొనుటకు ఒప్పుకొనలేదు. ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు గొప్ప బహుమానము నందు దృష్టి యుంచెను (హెబ్రీ 11:26).

## నేడు దేవుని యొక్క బహుమానము

నేడు క్రీస్తుకు తమ్మును తాము అప్పగించుకొను వారికి, దేవుడు గొప్ప సంగతులు వాగ్దానము చేసారు. అవి పాపముల క్షమాపణ, మనశ్శాంతి, మనలో నివసించు పరిశుద్ధాత్మ, మృతుల పునరుత్థానము, మరణాంతర జీవము, పరలోకము, నిత్యజీవితము క్రీస్తు నందు నమ్మకముగా యున్న వారికి వాగ్దానము చేయబడినవి. ఇంతకంటే మనం ఇంకేమి అడుగగలము? ఈ వాగ్దానములు ఆయనను శ్రద్ధగా వెదకువారికి చేయబడెను. వాటిని సంపాదించుకొనుట కొరకు ఎంతైనా మనం త్యాగం చేయవచ్చును. మిత్రులారా, దేవుడు మన కొరకు తన కృప చొప్పున అనుగ్రహించిన వాగ్దానములను పొందుటకు ప్రయత్నించెదముగాక!

– జాన్ థీసన్

# బాప్తిస్మము పొందినపుడు విశ్వాసము ద్వారా ఒకడు రక్షింపబడును

## (One is saved by Faith at Baptism)

*Jerry Jenkins*



అపొ.పౌలు ఎఫెసీయులకు చెప్పినట్లు ఒకే ఒక్క బాప్తిస్మము వున్నది. "శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కడే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మ మొక్కటే. అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికిపైగా ఉన్న వాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫెసీ 4:4-7). ఈ ఒకే బాప్తిస్మము నీటి బాప్తిస్మము. దిగువ వాస్తవములను గమనించుము.

పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎన్నడు ఆజ్ఞాపింపబడలేదు గాని నీటి బాప్తిస్మము ఒక ఆజ్ఞ. "మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్లకు ఆటంకము చేయగలడా అని చెప్పి యేసు క్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని పేతురు వారికి ఆజ్ఞాపించెను. తరువాత కొన్ని దినములు తమ యొద్ద ఉండుమని వారతని వేడుకొనిరి" (అపొ.కా. 10:47-48).

యేసుక్రీస్తు ఇచ్చిన గొప్ప ఆజ్ఞలో గల బాప్తిస్మము మనుష్యుని ద్వారా ఇయ్యబడవలెను. "కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులు ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19-20).

రోమాలో యున్న సంఘములో కొందరు, మనము కృప వలన రక్షింపబడుదుము గనుక, మనము పాపము చేసే కొలదీ కృప విస్తరించును. అందువలన, పాపము చేస్తూ యుంటే కృప విస్తరిస్తూయుంటాదని తలంచే వారు. "కృప విస్తరించవలెనని పాప మందు నిలిచి యుందుమా? అట్లనరాదు" అని పౌలు జవాబిచ్చాడు. (రోమా 6:1) భౌతికంగా ఒకడు మరణిస్తే అతడు గతంలో జీవించిన, జీవితం అంతమగును. ఇంకోమాటలో పాపి తన పాప జీవితం విషయం మరణిస్తాడు. తనను గూర్చి యితరులను గూర్చి కూడ యిది వాస్తవం అని పౌలు ఉద్ఘాటించాడు. "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను. ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నా యందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీర మందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి నా కొరకు తన్నుతాను అప్పగించు కొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2:20).

ఈ సోదరులు పాపము విషయమై మృతి జెందారు గనుక వారు పాతి పెట్టబడుట సహజమే. పాపపు జీవితము యొక్క అంతము ఆ క్రియ సూచించును. బైబిలు బాప్తిస్మము నీటిలో ముంచుటయే. యోహాను యోర్దాను నదిలో బాప్తిస్మమిచ్చెను (మార్కు 1:9). "సలీము దగ్గర ఐనోనను స్థలమున నీళ్లు విస్తారముగా ఉండెను గనుక యోహాను అక్కడ బాప్తిస్మమిచ్చుచు ఉండెను" (యోహాను 3:23). ఫిలిప్పును ఐతియొ పీయ ఘనుడును ఇద్దరును నీళ్లలోనికి దిగిరి, అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను (అపొ.కా. 8:38). అందుకే పౌలు మనం బాప్తిస్మము పొంది నప్పుడు ఆయనతో కూడ పాతిపెట్ట బడితిమని చెప్పాడు.

తరువాత దేవుని శక్తివలన మనం నూతన జీవితం కలిగియుండుటకు లేపబడితిమని పౌలు చెప్పాడు. ఈ నూతన జీవితం బాప్తిస్మము యొక్క అనంతరం ఆరంభిస్తాదని గమనిం చాలి. అందువలన పౌలు కృతజ్ఞత చెల్లిం చాడు. "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడిన వారై పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము" (రోమా 6:17-18).

ఈ వచనమును బట్టి ఒకడు ఎప్పుడు రక్షింపబడునో తెలియనగును. హృదయ పూర్వకముగా సత్యమునకు లోబడినప్పుడు! ఆ ఉపదేశ క్రమము మరణము, సమాధి, పునరుత్థానము. సువార్త సత్యములకు రోమీయులు లోబడిరి. వారు బాప్తిస్మము ద్వారా క్రీస్తులోనికి ప్రవేశించిరి. రక్షింపబడిరి. వారి జీవితాలు నూతన పరచబడ్డాయి. క్రైస్తవ జీవితం జీవించుటకారంభించిరి.

- జెర్రీ జెంకిన్స్

# పిల్ల తనపు రాజు
## (A Childrish King)

*- Betty Tucker*

మొదటి రాజులు 16:28 లో మనకు రాజైన ఆహాబు పరిచయం చేయబడ్డాడు. అతడు ఉత్తరభాగమునున్న ఇశ్రాయేలు రాజ్యము యొక్క 7వ రాజు. అతడు తన స్థానాన్ని తండ్రి యొద్దనుండి స్వాస్థ్యముగా పొందాడు. శక్తివంతమైన రాజకీయశక్తిగా అయ్యాడు.

అతడు ధనాన్ని ప్రేమించాడు. పలు సందర్భాల్లో దాన్ని ప్రదర్శించి ఆనందించేవాడు. అతడు తన రాజభవనమును దంతముతో అలంకరించాడు.

ఆహాబు దేవతార్చన చేసేవాడు. బయలు దేవతను సేవించాడు. "ఆహాబు తన పూర్వికులందరిని మించునంతగా యెహోవా దృష్టికి చెడుతనము చేసెను" (I రాజులు 16:30). అతడు సీదోనీయులకు రాజైన ఎత్బయలు కుమార్తెయైన యెజెబెలును వివాహము చేసికొని బయలు దేవతను పూజించుచు వానికి మ్రొక్కుచుండెను.

**పొరుగువాని ద్రాక్షతోట**

ఈ నిరంకుశ రాజు యొక్క నగరును ఆనుకొని మరి యొకని ద్రాక్షతోట యుండెను. అతడు దానిని తన వశము చేసికొనబూను కొనెను. దాని యజమానుడైన నాబోతుతో ఒప్పందము చేసికొన తలంచెను.

ఆ ద్రాక్ష తోట నాబోతు యొక్క పిత్రార్జితము గనుక రాజు యొక్క కోరికను అతడు తిరస్కరించెను. తనకున్నదంతా అది ఒక్కటే గనుక దానిని రాజునకు అమ్ముటకు నాబోతు తిరస్కరించెను. అందునుబట్టి ఆహాబు పిల్లవానివలె మూతిముడుచు కొనినవాడై కోపముతో తన నగరునకు పోయెను. అతడు మంచము మీద పరుండి ఎవనితోను మాట్లడకయు, భోజనము చేయకయుండెను (I రాజులు 21:4).

దుర్మార్గురాలైన రాణియగు యెజెబెలు నాబోతు దేవదూషణ చేసెనని నిందింపజేసి అతని చంపించెను. అతని పైకి అబద్ధపు సాక్షులను నిలబెట్టి అతని రాళ్లతో చావగొట్టిరి.

**శాప వచనములు**

దేవుడు ప్రవక్తయైన ఏలియాను ఆహాబు నొద్దకు పంపి అతడు అక్రమముగా సంపాదించిన ద్రాక్షతోట ఫలమునను భవించుటకు బ్రదుకడని ప్రకటించెను. "యెహోవా సెలవిచ్చున దేమనగా – ఏ స్థలమందు కుక్కలు నాబోతు రక్తమును నాకెనో ఆ స్థలమందే

కుక్కలు నీ రక్తమును నిజముగా నాకునని" ఏలియా అతనితో చెప్పెను (I రాజులు 21:19). ఈ ప్రవచనము 22వ అధ్యాయము 35-38 వచనములలో నెరవేరెను. ఆహాబు యుద్ధములో మరణించగా యెహోవా మాటచొప్పున కుక్కలు వచ్చి అతని రక్తమును నాకెను.

**ఆహాబు నుండి పాఠము**

మనము దేవుని చిత్తమును తెలిసికొనునట్లు తన గ్రంథాన్ని లిఖించియిచ్చారు. ఈ బలహీనమైన రాజు క్రైస్తవ జీవితంలో మనకు కొన్ని పాఠములను నేర్పుచున్నాడు.

1. ఆహాబు యెజెబెలును వివాహమాడినప్పుడు దేవుని నుండి తొలగిపోవుట కారంభించాడు.

2. మనం వయస్కులమైనప్పుడు బాధ్యతలను స్వీకరించాలి. తగిన రీతిగా ప్రవర్తించాలి. ఆహాబురాజు మూతి ముడుచుకొని, ఎవరితో మాట్లాడక పిన్న వయస్కుని వలె ప్రవర్తించుట వలన అతనికి కలిసివచ్చినది యేమీలేదు. దుర్మార్గురాలైన తన భార్య నాబోతును అక్రమముగా చంపించినప్పుడు పరోక్షముగా దాని బాధ్యత అతనిదే.

3. ఆనందదాయక జీవితం మోసపుచ్చుట వలన కలుగదు. తమ లక్ష్య సాధన కొరకు కష్టపడి కృషిచేయువారు సంతోషముతో జీవిస్తారు. మనము "సణుగుట గొణుగుట, సంశయమువాని సమస్త కార్యములు చేయవలెనని" ఫిలిప్పీ 2:14 చెప్పుచున్నది.

4. మన పొరుగువానిదేదీ మనం ఆశించకూడదు. ఆహాబుకు ఈలోక సంపద ఎంతో యుండెను. అయినను తన పొరుగువాని ద్రాక్షతోటను ఆశించెను. తద్వారా పాపపు లోయలో తన ప్రయాణము నారంభించి నాశనమయ్యెను.

– బెట్టీ టక్కర్



# అతడు తన ప్రజలను దేవుని యొద్దకు మరలించెను

## (He turned his people back to God)



నీవు 25 సంవత్సరకాల వయస్సులో రాజువై నీ ప్రజలను విగ్రహారాధన నుండి నిజదేవుని వైపు మళ్లించే బాధ్యత కలిగియుంటే యేమి చేస్తావు? నీ ప్రజలవలె నీవు దూరపు బంధుత్వదేశ ప్రజలు కూడ అదే పాపములో యుండి నాశనమవుచున్నారని తెలిస్తే నీకు ఎంత ఒత్తిడి యుంటాది? నీకు ముందున్న రాజైన నీ తండ్రియే దేవునికి అపనమ్మకముగా యుండి, నీ ప్రజల పాప జీవితానికి బాధ్యుడని గ్రహిస్తే నీ పని ఇంకెంత కష్టమవుతాది?

అట్టి పరిస్థితుల్లో యున్న రాజు హిజ్కియా. అతడు ఉత్తర దిక్కున నున్న ఇశ్రాయేలు శ్రమకాలములో యుదాకు రాజాయెను. తన స్వంత ప్రజలే పలుమారులు దేవుని నిబంధనను ఉల్లంఘించి కనానీయుల దేవుండ్లను సేవించి అపరాధము చేసిరి. మోషే ద్వారా దేవుడిచ్చిన ఖచ్చితమైన ఆజ్ఞలను ఉల్లంఘించి వారు యూదా కొండలలో దేవతార్చన చేసిరి. హిజ్కియా తండ్రియైన ఆహాజు దమస్కులో దేవుని బలిపీఠమునకు బదులు దేవాతాస్థంభమును నిలబెట్టి పాపము చేసెను. అరణ్యములో దేవుడు మోషే ద్వారా చేయించిన ఇత్తడి సర్పమును ప్రజలు ఆరాధించిరి.

యూదా దేశము అష్షూరు, ఫిలిష్తీయ దేశముల వలన బాధింపబడుచుయుండెను.


అయితే తన యెదుట నున్న పనికి హిజ్కియా సరియైనవాడని లేఖనములు చెప్పు చున్నవి. అతని పాలనారంభములోనే గొప్ప ధైర్యముతో సంగతులనతడు సరిజేయబూను కొనెను. అతడు "ఉన్నత స్థలములను కొట్టివేసి విగ్రహములను పగులగొట్టి దేవతాస్తంభము లను పడగొట్టి మోషే చేసిన యిత్తడి సర్పమును ఛిన్నాభిన్నములుగా చేసెను. దానికి ఇశ్రా యేలీయులు నెహుష్టానను పేరుపెట్టి దానికి ధూపము వేయుచువచ్చిరి" (2 రాజులు 18:3-4). అతడు అష్షూరు రాజును ఎదిరించి ఇక మీదట పన్ను చెల్లించుటకు నిరాకరించెను. హిజ్కియా ఏలుబడిలో యూదాదేశము చివరిగా ఫిలిష్తీయులను ఓడించెను.

యువకుడైన ఈ రాజుపై యున్న ఒత్తిడి ఎంతో నీవు గమనించగలవా? అతడు బయలు యొక్కయు అష్తారోతు యొక్కయు దేవతా స్థంభములను పడగొట్టుచుండగా అతని ప్రజలు సంతోషించారని నేననుకోనను. యిత్తడి సర్పమునతడు ముక్కలు ముక్కలుగా చేసినప్పుడు కూడ వారు సంతోషించలేదు. అష్షూరీయులను అతడు ఎదిరించగా అతని వారే కొంతమంది దానిని వ్యతిరేకించి యుండవచ్చు. అంతశక్తివంతమైన దేశాన్ని ఎదిరిస్తే పర్యవసానం బాగుండదని వారు తలంచి యుండవచ్చును. అయినను తన ప్రజలను నిజదేవుని వైపు త్రిప్పుటకు హిజ్కియా వెనుకాడలేదు.

ఇందులో నేడు మనకు పనికి వచ్చేది ఏమైనా యున్నదా? తప్పకుండా వున్నది! నీవు తల్లివైనా, తండ్రివైనా, నాయకుడవైనా, సంఘపెద్దవయినా, హిజ్కియా యొక్క పనినే నీవును నేడు కలిగియున్నావు. ఈ దేశము, కొన్ని సందర్భాలలో సంఘము అవినీతితోను, విగ్రహారాధనతోను నిండియున్నది. పాపపు జీవితం ఒక అలవాటుగా మారిపోయింది. నిజంగా దేవుని నామమున ప్రార్థించువారు నేడు తక్కువైపోయారు. క్రైస్తవులు ఆ పేరుకు తగిన రీతిగా జీవించకపోవుట వలన క్రైస్తవ్యము హేళన చేయుబడుచున్నది. హిజ్కియాలాంటివారు నేడు మనకు కావాలి. మనం ఎదుర్కొను చున్న సవాళ్లకు దీటుగా జవాబిచ్చువారు కావాలి.

హిజ్కియా యొక్క విజయములో రెండు ప్రాముఖ్యాంశములున్నాయి. సాతాను శక్తులను ఎదిరించుటకు అవి మనకవసరం. మొదటిగా హిజ్కియా, దేవునికి తన ప్రజలకు మధ్య వచ్చిన వాటిని నిర్మూలించాడు. అతడు దేవతార్చన చేయుబలిపీఠములను, విగ్రహము లను, స్తంభములను విరుగగొట్టాడు. యిత్తడి సర్పమును ముక్కముక్కలు చేసాడు. నేడు మనం కూడ అదే చెయ్యాలి. మనలో చాల మంది మానవ కల్పితమైన దురాశ, దనాశ, మోహము, వినోదము మొదలగు బలిపీఠము లను నిర్మించుకొనియున్నాము. దేవునికి

మానవునికి మధ్య అడ్డుగా వచ్చేది ఏదైనా విగ్రహమే. దానిని పడగొట్టాలని దేవుడు కోరుచున్నారు. ఈ బాధ్యత తలిదండ్రులమీద ఎక్కువ యున్నది. తమ పిల్లలకు మంచిచెడు లను, సత్యాన్ని వారు బోధించాలి. భక్తి మార్గములో నడిపించాలి.



రెండవది, హిజ్కియా "ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యందు విశ్వాసముంచిన వాడు. అతని తరువాత వచ్చిన యూదా రాజులలోను, అతని పూర్వికులైన రాజుల లోను అతనితో సమానమైన వాడు ఒకడును లేదు. అతడు యెహోవాతో హత్తుకొని, ఆయనను వెంబడించుటలో వెనుక తీయక ఆయన మోషేకు ఆజ్ఞాపించిన ఆజ్ఞలన్నిటిని గైకొనుచుండెను" (2 రాజులు 18:5-6). హిజ్కియా దేవుని యందు నమ్మకముంచెను! ప్రోత్సాహము కొరకు మానవులముగా దేవుని వైపుగాక మానవుల వైపే మనం చూస్తాము. ఒక్కోసారి మన బలహీనతలను బట్టి మనం గొప్ప మార్పు తీసికొని రాలేమని అను కొంటాము. గాని హిజ్కియా దేవుని వైపు చూచాడు. అతడు విగ్రహాలను పడగొట్టినా, వారి బలిపీఠములను నాశనం చేసినా, మిగతా రాజులను ఎదిరించినా హిజ్కియా దేవుని వైపు చూచాడు. ఆయన సహాయం చేయునని నమ్మాడు. "కావున యెహోవా అతనికి తోడుగా ఉండెను. తాను వెళ్లిన చోటనెల్ల అతడు జయము పొందెను" (2 రాజులు 18:7).

మనం నైతిక విలువలు కలిగి నడుచు కొనేవారుగ యుందాము. గొప్ప ధైర్య సాహసములుగల వారిగయుందాము. యూదా రాజైన హిజ్కియావలె గొప్ప పాఠము లను నేర్చుకొందాము. మన కుటుంబాలను, సంఘాలను, దేశాన్ని నీతి మార్గములోనికి మరల నడిపించుదాము.

**– బాబీ వీట్**

# విలాప వాక్యములు

## (Lamentations)

*Todd O' Donnell*



"జనభరితమైన పట్టణాలు ఎట్లు ఏకాకియై దుఃఖా క్రాంత మాయెను? అది విధవరాలి వంటిదాయెను. అన్యజనులలో ఘనతకెక్కినది సంస్థానములలో రాచకుమార్తెయైనది ఎట్లు పన్ను చెల్లించునదై పోయెను?".

"యూదా బాధనొంది దాసురాలై చెరలోనికి పోయియున్నది. అన్యజనులలో నివసించు చున్నది. విశ్రాంతి నొందకపోయెను. దాని తరుము వారందరు ఇరుకుచోట్ల దాని కలిసికొందురు".

"యెరూషలేము ఘోరమైన పాపము చేసెను. అందుచేతను అది అపవిత్రురా లాయెను. దాని ఘనపరచిన వారందరు దాని మానమును చూచి దాని తృణీకరించుదురు. అది నిట్టూర్పు విడుచుచు వెనుకకు తిరుగు చున్నది" (విలాప1:1, 3,8).

విలాప వాక్యములు అను గ్రంథాన్ని

యిర్మీయా వ్రాసినట్లు అందరు అంగీకరింతురు. ప్రవక్తయైన యిర్మీయా దక్షిణ రాజ్యమైన యూదా జనాంగము తమ మార్గములను, మనస్సులను మార్చుకోవాలని బోధించాడు. వారి దుష్టత్వాన్ని దేవుడు ఎక్కువ కాలము సహించడని అతడెరుగును. అయితే ప్రజలు తమ జీవితాన్ని మార్చుకోలేదు, దేవుని వైపు తిరుగలేదు. అందువలనవారు ఆనాడున్న బబులోను ద్వారా శిక్షించబడ్డారు.

యెరూషలేము నాశనం చేయబడిన తరువాత అతడు విలాప వాక్యములను వ్రాసాడు. ఆ వినాశనమునకు అతడు ప్రత్యక్ష సాక్షియైనట్లు అతడు వ్రాసాడు. వారికి కలిగిన శిక్ష తగినదని న్యాయమైనదని యిర్మీయా తలంచినను దుఖకరమైన పరిస్థితులను చూచి అతని హృదయము ప్రలాపించెను. తన జనాంగమును తిరిగి పునరుద్ధరించు సమయం కొరకు అతడు ఎదురుచూచాడు.

ప్రజలపై పాపము యొక్క ప్రభావమును ఈ చిరు గ్రంధము మనకు బోధించుచున్నది. నీతి జనాంగమునకు గౌరవ కారణమని బైబిలు బోధించుచున్నది. అయితే పాపము జనులకు నాశనము. పాపము చేయునప్పుడు ప్రజలు దేవునినుండి దూరమై పోవుటయేగాక, దానివలన పలుదురలవాట్లు, దుష్టస్వభావము, కుటుంబ కలతలు, సమాజము యొక్కయు దేశము యొక్కయు వినాశము సంభవించును. పాపము యొక్క పర్యవసానము పాపము చేయువానితోనే అంతమొందదుగాని దానివలన పలువురు బాధలకు, దుఃఖానికి గురియగుదురు.

పాపము నవ్వులాటకాదని విలాప వాక్యములు బోధించుచున్నది. పాపమును గూర్చి మనం యేడ్వాలి. అది మనకు బాధ కలిగించాలి. మారు మనస్సు పొందునంతగా దుఖించాలి. పాపము వేళాకోలము కాదు. కొందరు అదొకసరదా అనుకొంటారు. పాపాన్ని గూర్చి కొందరు ఇప్పుడు నవ్వుకోవచ్చునుగాని, ఒకానొక దినం వచ్చుచున్నది. అప్పుడనేకులు ఏడుస్తారు. దుఃఖిస్తారు. పాపం చేసిన దినాన్ని గూర్చి ప్రలాపిస్తారు.

మనలో ప్రతివాడు ఏదోరీతిగా పాపంచేసినవారమే. అది బాధ కలిగించేదే, పురుషులు ఏడ్వకూడదని సాధారణంగా చెబుతారు. యేసు పురుషులందరి కంటే గొప్పవాడు అయినను ఆయన ఏడ్చారు. మన పాపములను గూర్చి ఏడ్చుటకు యిర్మీయా, యేసులనుండి మనం నేర్చుకోవాలి. నీవు తప్పు చేసావని ఒప్పుకోవడం బలహీనత కాదు. నిన్నెరిగిన వారికది ఒక బలమైన క్రియ. దేవుడు చివరకు శేషించిన ఇశ్రాయేలీయులను యెరూషలేముకు తరలించి ఆ పట్టణాన్ని తిరిగి నిర్మించారు. విలాప వాక్యములు గ్రంధము సుఖాంతమయ్యింది!

– టాడ్ ఓడోనెల్

# గొప్ప ఆహ్వానము

## (The Great Invitation)

*- Ken Tyler*

**ఉద్దేశ్యము** : రక్షణ నిమిత్తము యేసు నొద్దకు వచ్చుటకు గల ప్రాముఖ్యమును చూపించుట కొరకు.

**'ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు'** :

ఆత్మ అనగా పరిశుద్ధాత్మ.

వాక్యము ఆయన వలన ఈయబడెను (2 పేతురు 1:2,3, మార్కు 12:36, I కొరింథీ 2:13).

మనం క్రీస్తునొద్దకు వచ్చి రక్షణ పొందాలని పరిశుద్ధాత్మ కాంక్షించుచున్నాడు.

పెండ్లికుమార్తె అనగా సంఘము. రోమా 7:1-4, ఎఫెసీ 5:25 సంఘము యొక్క పని - ఇతరులను క్రీస్తులోనికి ఆహ్వానించుటయే (మార్కు 16:15-16).

**"వినువాడును రమ్ము అని చెప్పవలెను"**:

మనము ఏ రీతిగా వినుచున్నాము?

మనము వినే విధానమును గూర్చి బైబిలు వక్కాణించుచున్నది. (ద్వితీ 6:3-5, ప్రక 2:7, 11,17,29, ప్రక 3:6,13,22, హెబ్రీ 5:11).

వినువాడును రమ్ము అని ఇతరులను ఆహ్వానించవలెను.

**"దప్పిగొనిన వానిని రానిమ్ము"** :

మనం ఎంత మట్టుకు దప్పిక గొనియున్నాము?

"నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు వారు తృప్తి పరచబడుదురు" (మత్తయి 5:6).

కీర్తనలు 42:1,2; 63:1 కూడ చూడుడు.

మన సమాజం దేవుని కొరకు తృష్ణగొనాలి.

**"ఇచ్ఛయించు వానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము"** :

నేడు మన యిచ్ఛ ఎక్కడున్నది ? (యెష 1:19,20, లూకా 9:23).

యోహాను 4:5-14 చదువుము.

ఇష్టపడువానికి జీవజలములు ఉచితమే.

మనకు కావాలంటే, జీవము లభ్యము గానే యున్నది.

**ముగింపు** :


మనందరం రక్షింపబడాలనే దేవుడు కోరుచున్నాడు. మనలో ఎవడునశించాలని ఆయన కోరుట లేదు. ప్రశ్నయేమంటే మనం రక్షింపబడాలని కోరుకొనుచున్నామా?

- కెన్ టైలర్

# ఈ యేసు ఎవరు ?

## ( Who is this Jesus )

*- Jim Kelly*



ప్రతిదినం మనం వేసుకొనే తేదీ యేసు క్రీస్తు జననము నుండి లెక్కింపబడు చున్నది. యేసు యొక్క జననం ఎంత ముఖ్యమైనదంటే అది ఈ భూలోక సమయాన్ని క్రీస్తు పూర్వమని గాని, క్రీస్తు శకము అని గాని విభజించినది. ఈ అద్భుత ఘంట్టమును బట్టి కాలము లెక్కింపబడుచున్నది. గనుక నిజానికి చరిత్ర గతిని, కాల పరిజ్ఞానాన్ని మార్చివేసిన ఈ యేసు ఎవరు ?

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గ్రంథాలయము లలోనికి వెళ్లితే యేసుక్రీస్తును గూర్చిన గ్రంథాలు అందు అనేకములుంటాయి. ఈ యేసును గూర్చి గత 2000 సంవత్సరము లలో కంటే గత 20 సంవత్సరాలలో ఎక్కువ గ్రంథాలు వ్రాయబడినట్లు అంచనా. గనుక ఈ యేసు ఎవరు ?

లౌకిక గ్రంథకర్తలు యేసు రాజకీయ విప్లవకారుడని, మగ్ద లేనేమరియను వివాహ మాడిన గారడీవాడని, గలలీయుడైన ఆకర్షణ కర్తయని, పల్లెటూరి రబ్బీయని రకరకాలుగా వర్ణించారు. ఆయన యూదా మత విమర్శకుడని మరొకడు చెప్పాడు. ఆయన పరిసయ్యుడని కొందరు, పరిసయ్యుల వ్యతిరేకియని కొందరు వర్ణించారు. ఆయన ఒక ప్రవక్తయని, యూదా మత హిప్పీయని, వింత దర్శనములు చూసే గుంపు వారి నాయకుడని కొందరు వర్ణించారు. ఇంతకీ

ఈ యేసు ఎవరు ?

లౌకిక చరిత్ర ఆయనను గూర్చి బహు స్వల్ప సమాచారమే అందించుచున్నది. ఈ పుడమిపై ఉద్భవించిన వారందరికంటే మానవ చరిత్రను మార్చివేసిన ఈయన తన కాలము నాటి విద్యావేత్తల యొక్కయు, చరిత్రకారుల యొక్కయు దృష్టిని ఆకర్షించక పోవడం ఆశ్చర్యమే. క్రొత్త నిబంధనలో యున్న నాలుగు సువార్తలలో తప్ప మొదటి శతాబ్ధపు వ్రాతలలో ఆయనను గూర్చి బహు స్వల్పమే వ్రాయబడియున్నది. యూదా చరిత్రకారుడైన జోసిఫస్, రోమా చరిత్రకారుడగు టేసిటస్ రోమా యువరాజైన ట్రాజన్‌కు, రోమా గవర్నరు ప్లేనీ క్రైస్తవులను హింసించుటకు చేసిన సిఫారస్సును మినహాయించి యేసును గూర్చి పెద్దగా వ్రాయబడలేదు.

ఆయన ఆకృతి ఎట్లుండెనో ఎవరు ఎరుగరు. అక్కడక్కడా కనబడు చిత్రాలు ఒకదానికొకటి భిన్నముగాయుంటాయి. ఆయన కాలములో కెమెరాలు లేవు, డిజిటల్ కెమెరాలు అంతకు ముందే లేవు ! ఈ యేసు ఎవరు ? గ్రీకులు ఆయనను ఉన్నత పాలకుడని చిత్రీకరించారు, సిలువను భరించుటలో ఆయన సహనాన్ని విధేయతను ప్రదర్శించినట్లు చిత్రీకరించారు. 8వ శతాబ్ధములో రూసో యనునతడు ఫ్రెంచి విప్లవము కొరకు ముందే జన్మించిన వ్యక్తియని చెప్పాడు. విక్టోరియా కాలము నాటి ఇంగ్లాండులో ఆయన ఒక చిన్న పడవలోను, మట్టి రోడ్‌లోను యుండుటకంటే ఒక గదిలో యుండి బోధించుచున్నవానివలె చిత్రీకరించారు. ఈ యేసు ఎవరు ?

క్రైస్తవ సంఘాలలో, చిన్నపిల్లల తరగతులలో ఒక కొండ ప్రక్కన కూర్చుని యేసుక్రీస్తు బోధించుచున్న చిత్రాలు వారికి చూపించబడ్డాయి. ఆయన చిన్న పిల్లల మిత్రుడని, వారితో కలిసి మాట్లాడుతారని, ఆడలాడుతారని వారికి బోధించబడ్డాది. మనం ఏజాతి వారమయినా, ఏ భాషవారమైన యేసు ప్రేమిస్తారనే పాటలు నేర్పించబడ్డాయి. ఆయన రాజులకు రాజని, యూదా కొదమ సింహమని నేర్పించడ్డాది. ఈ యేసు ఎవరు?

ఆయన ఎవరో తెలిసికోవాలంటే ఆయన యేమి బోధించారో తెలిసికోవాలి. ఆయన చేసిన ఉపదేశములను బట్టి ఆయనను గూర్చి మనం ఎంతో తెలిసికోవచ్చును. ఆయనతో కలిసి నడిచి, సంభాషించిన వారి సాక్ష్యములను బట్టి కూడ ఆయన ఎట్టివాడో మనం తెలిసికోవచ్చును. ఆయనను గూర్చిన ప్రశ్నలకు వారు తప్పక మనకు జవాబులు నీయగలరు.

క్రొత్త నిబంధనలో మొదటి నాలుగు సువార్తలలో ఆయనను గూర్చి మనం తెలిసికోవాలనే సమాచారం అంతా మనకు కనబడదు. ఆయన జీవించిన కాలములో పది వంతులలో తొమ్మిది వంతులు గూర్చిన సమాచారం బహు స్వల్పమే. ఆ లేఖకులకు ఆ సమాచారవిలువ స్వల్పం. ఫస్కా పండుగ

నాడు ఆయన తన కుటుంబముతో కలిసి 12వ యేట యెరూషలేముకు వెళ్ళిన సందర్భాన్ని లూకా వ్రాసాడు. గాని ఆయన బాల్య దశను గూర్చి ఇంకేమీ వ్రాయలేదు. గాని ఆయన గలిలయ ప్రాంతములో కష్టించి పనిచేసే ఒక వడ్రంగి కుటుంబములో జన్మించిన జ్యేష్టుడని మాత్రము వారు తెలియజేసారు.

ఆయన శరీరాకృతి ఎట్లుండెనో మనకు యేమీ తెలియదు. పొడగిరా ? పొట్టివాడా? నలుపా ? తెలుపా ? చామన ఛాయా ? మనకు యేమీ తెలియదు. ఆయన లావుపాటివాడా ? సన్నగా యుండెనా ? కళ్లు నలుపా ? తెలుపా ? ఒక్క మాట కూడా తెలియదు. గాని ఆయనను గూర్చి కొన్ని వందల సంవత్సరములకు ముందే ప్రవక్త ద్వారా చెప్పబడిన మాట ఒక్కటే మనకున్నది. "వ్యసనాక్రాంతుడు గాను, వ్యాధిననుభవించిన వాడుగాను మనుష్యులు చూడనొల్లని వానిగాను ఉండెను" (యెషయా 53:2). ఈ యేసు ఎవరు ? ఆయన ఎట్లుండెనో తెలిసికొనుట బహుశ మనకు అనవుసరము. అందువలన ఆయన దానిని మనకు బయలుపరచలేదు.

నాలుగు సువార్తల లేఖకులు వివిధ కోణముల నుండి భిన్నమైన దృక్పథాలతో వ్రాశారు. వారు సమాజములో భిన్నమైన భావములు, ఆర్థిక స్థాయి, వివిధ పరిస్థితు లలోనుండి వచ్చినవారు. ప్రతి లేఖకుడు ఒక ప్రత్యేక లక్షణాన్ని, దాన్ని గూర్చిన సరియైన వివరణను యిచ్చాడు. తద్వారా ఈ యేసు ఎవరో అనే అంశముపై మనకు మంచి సమాచారం లభించుచున్నది.

ఆయన ప్రజలతో సంభాషించిన విధానాన్ని బట్టి ఈ యేసును గూర్చి మనం ఎంతో తెలిసికొనగలము. ఆయనను చూచిన వారు, ఆయన బోధలు, క్రియలకు చూచిన ప్రత్యక్ష సాక్షులు ఆశ్చర్యచకితులయ్యారు. ఒక సందర్భ ములో ఆయన కుటుంబ సభ్యులే ఆయనకు మతి చలించినదన్నారు. ఈయన ఎవరు ?

మార్కు 4:41 లో ఒక్క మాట చెప్పి ఆయన గాలిని సముద్రమును నిమ్మళించారు. "ఈయన ఎవరో గాలియు, సముద్రమును ఈయనకు లోబడుచున్నవని" ఆయన శిష్యులు ఒకనితో నొకడు చెప్పుకొన్నారు.

ముప్పది ఎనిమిది సంవత్సరముల నుండి వ్యాధి గల వానినొకని గూర్చి యోహాను 5వ అధ్యాయములో వ్రాయబడియున్నది. యేసు వాని యొద్దకు వచ్చి "నీవు లేచి నీ పరుపు నెత్తికొని నడువుమని వానితో చెప్పగా వెంటనే వాడు లేచి తన పరుపు నెత్తికొని నడిచెను" (యోహాను 5:8). ఆయన ఎవరో యని దానిని తిలకించినవారు ఆశ్చర్యచకితులైరి.

పరిసయ్యుడైన సీమోను యింట పాపపు స్త్రీ యొకతె తన కన్నీటితో ఆయన పాదములు కడిగి, అత్తరు పూసెను. అమ్మా నీ పాపములు క్షమింపబడియున్నవని ఆయన చెప్పెను. ఈ యేసు ఎవరు ? పాపములు క్షమించు

ఈయన ఎవరు ? అని అక్కడివారు తలంచారు.

యేసు యెరూషలేములో ప్రవేశించుటను గూర్చి మత్తయి సువార్త 21వ అధ్యాయములో వ్రాయబడెను. ఈ సమాధాన పట్టణములోనికి గాడిదపిల్ల నెక్కి ఆయన ప్రవేశించెను. అది కూడ సమాధానమునకు గురుతే. జన సమూహ ములు తమ బట్టలు, చెట్లకొమ్మలు నరికి దారిపొడుగున పరచిరి. పట్టణమంతయు ఇది చూచి ఈ యేసు ఎవరో యని కలవరపడిరి.

యేసును గూర్చి యోహాను పలికినది సత్యమే. ''యేసు చేసిన కార్యములు అనేకములు కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదు'' (యోహాను 21:25).

ఈ యేసు రోమీయుల ఆక్రమణను గూర్చి యేమీ ఆందోళన చేయలేదు గాని కొరడా తీసికొని దేవాలయములో క్రయ విక్రయములు చేయువారిని పారద్రోలెను.

మోషే ధర్మశాస్త్రముననుసరించాలని ప్రజలకు ఆయన బోధించెను, గాని తానే దానిని నెరవేర్చి కొట్టి వేయుటకు వచ్చితినని చెప్పెను. అన్యుని విషయమై ఆయన జాలితో కంపించెను గాని, తన శిష్యునితో సాతానా, నా వెనుకకు పొమ్ము అని గద్దించెను.

ధనవంతులను గూర్చియు, పాపములో జీవించు స్త్రీలను గూర్చియు నిశితముగా బోధించెను. గాని ఆయన వారి మిత్రుడని ఎంచబడెను. ఒకరోజు ఆయన అనేక అద్భుతములు చేసెను గాని రెండవ రోజున యేమీ చేయకపోయెను. సరిగదా అది వారి అవిశ్వాసమును గూర్చినదని వారిని గద్దించెను.

తన రెండవ రాకడను గూర్చి అనేక సంగతులు వివరించి చెప్పెను గాని ఆ సమయమైనను ఘడియయైనను తనకు తెలియదని చెప్పెను.

ఆయనను బంధించుటకు జనులు రాగా వారినుండి పోయెను గాని తదుపరి బంధింపబడుటకే ఆయన ముందుకు వెళ్లెను. సమాధానమును గూర్చి ఆయన ప్రసంగాలు చేసెను గాని, ఆయన శిష్యులు తమ కత్తులను ధరించుకోవాలని బోధించెను. ఆయన గొప్ప అద్భుతములు చేసెను గాని వాటిని చేసిన తరువాత ఎవరికీ చెప్పవద్దని ఆజ్ఞాపించెను.

యేసు ఏకైక వ్యక్తి, యదార్థజీవియని ఒక గ్రంథకర్త వ్రాసాడు. ఏలయనగా ఎవరు ఆ వ్యక్తిని కల్పించలేరు. ఆయన బోధలు కూడా విచిత్రమే.

"నీ ప్రాణమును దక్కించుకొన గోరితే దానిని పోగొట్టుకుంటావు".

"జనులు మిమ్మును హింసించి, నిందించి, మీమీద అబద్ధ సాక్ష్యము చెప్పునప్పుడెల్లా మీరు ధన్యులు."

"నీ శత్రువులను ప్రేమించుడి. ఒక చెంపమీద కొడితే, రెండవ చెంపకూడ

త్రిప్పుడి".

"మిమ్మును హింసించువారిని దీవించుడి, గాని శపించవద్దు".

"మీ ప్రార్థనలు బహిరంగముగా కనబడ వలెనని గాక, రహస్యమందు ప్రార్థించుడి."

"ఒట్టు పెట్టుకొనకుడి, అవునంటే అవును, కాదంటే కాదు అన్నట్లు మీ మాటలు ఉండాలి".

"నీ సహోదరునితో కోపపడి ఆరాధించ వద్దు. ఆరాధించాలంటే ముందు అతనితో సమాధానపడాలి".

"నీవు ఉపవాసముంటే, అది నీ దేవునికే తప్ప మరెవరికీ తెలియనక్కర్లేదు. మనుష్య లకు కనబడాలని ఉపవాసముండవద్దు."

"నీ ధనాన్ని గూర్చి చింతించవద్దు. దానిని పరలోకమందు కూర్చుకో."

"నీవు ఇద్దరు యజమానులకు సేవ చేయలేవు. ఇద్దరిలో ఒకరిని ఎంచుకోవాలి."

"పరిపూర్ణత కొరకు త్యాగం అత్యవసరం.

"ఇతరులకు నీవెట్టి తీర్పు తీర్చుదువో, నీకూ అట్లే తీర్పు తీర్చబడును.".

"దేనినైనా ఉంచుకోవాలంటే దాన్ని ఇతరులతో పంచుకో". ఈ యేసు ఎవరు ? ఆయన ఎవరు ? ఆయునను గూర్చి మనకు ఖచ్చితంగా ఏమి తెలుసు ?

ఆయన ఒక మానవునిగా జీవించారు. ఒక యూదుడు, గలిలయకు చెందినవాడు. ఆయున ఒక నిజమైన వ్యక్తి, పేరు కుటుంబము, మిత్రులు కలిగినవాడు. ఆయన అందరిలాగే కనబడేవాడుగాని ఆయనలో ఏదో తేడా యున్నది.

ఆయున చేసిన అద్భుతాలను తన కాలములో ఎవరు సవాలు చేయలేదని చరిత్ర చెప్పుచున్నది. ఆయన నీళ్లను ద్రాక్షరసముగా మార్చారు. నీళ్లమీద నడిచారు. గాలిని తుఫానును గద్దించి నిమ్మళించారు. ఆయన అన్ని రకాల వ్యాధులను,రోగాలను బాగుచేసారు. చెవిటివారు విన్నారు. గ్రుడ్డివారు చూచారు, కుంటివారు నడిచారు. కుష్ఠరోగులు శుద్ధులయ్యారు. చనిపోయిన వారిని ఆయున లేపగా ప్రత్యక్షసాక్షులు చూచారు. యేసు తన మిత్రులైన మరియ, మార్త, లాజరులను ప్రేమించారు. లాజరు చనిపోయాడు. యేసు అక్కడికి వచ్చేసరికి అతని శవం నాలుగు రోజులు సమాధిలో యున్నది. సమాధిలోనుండి కుళ్లు వాసన వచ్చుచుండెను. అయినను యేసు లాజరూ బయటికి రమ్మనగానే అతడు బ్రదికి బయటికి వచ్చాడు (యోహా 11:21-27) ఆశ్చర్యము!

అన్నిరికార్డులను బట్టి చూస్తే ఆయన పరిశుద్ధాత్మ వలన ఒక కన్యకు జన్మించారు.

"నేనెవరినని జనులు అనుకొనుచున్నారని" యేసు పేతురును, మిగతా శిష్యులను అడిగారు. నీవు మోషేవనియు, ఏలియావనియు, యిర్మియావనియు లేక ప్రవక్తలలో ఒకడవనియు జనులు తలంచుచున్నారని వారు జవాబిచ్చారు. "అయితే మీరేమనుకొను

చున్నారు ?" అని ఆయన తన శిష్యుల నడిగారు. "నీవు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తువు" అని పేతురు జవాబిచ్చాడు. పేతురూ, నీవు చెప్పింది నిజం. అయినను పరలోకమందలి దేవుడే ఈ సంగతి నీకు బయలుపరచెను గాని మనుష్యులు నీకు బయలుపరచలేని ఆయన చెప్పారు. (మత్తయి 16:13-16)

తదుపరి పేతురు తన పత్రికలో ఇట్లు వ్రాసాడు :"ఏలయనగా చమత్కారముగా కల్పించిన కథలననుసరించి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శక్తిని ఆయన రాకడను మేము మీకు తెలుపలేదు గాని ఆయన మహాత్మ్యమును మేము కన్నులారచూచిన వారమై తెలిపితిమి. ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహా దివ్యమహిమనుండి వచ్చినప్పుడు తండ్రియైన దేవుని వలన ఘనతయు మహిమయు ఆయన పొందగా మేము ఆ పరిశుద్ధ పర్వతము మీద ఆయనతో కూడ ఉండినవారమై ఆ శబ్దము ఆకాశము నుండి రాగా వింటిమి" (2 పేతురు 1:16-18). యేసుక్రీస్తు నిజమైన వ్యక్తి ! ఆయన కల్పిత వ్యక్తి కాదు. కట్టుకథ కాదు.

మరొక సాక్షియైన యోహాను ఆదిని గూర్చి వివరించుచు దానిలో యేసుయొక్క పాత్రను మనకు తెలియజేయుచున్నాడు. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడైయుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నదిగాని చీకటి దాని గ్రహింపకుండెను" (యోహాను 1:1-5). యోహాను యేసుతో నడిచాడు, మాటలాడాడు, ఆయనను సన్నిహితంగా గమనించాడు. గనుక ఈ యేసు ఎవరో చెప్పగలిగాడు.

అపొస్తలుడైన తోమా కూడ అంతే. యేసు పరిచర్య ఆరంభదినాల్లో తోమా యేసుతో కూడ యూదయకు వెళ్లుటకును, అవుసరమయితే ఆయన కొరకు ప్రాణాలు సయితం అర్పించుటకును సిద్ధపడ్డాడు. (యోహాను 11:16). గాని ఆయన సిలువ వేయబడిన తరువాత అతను నిరుత్సాహపడ్డాడు. బలహీనుడయ్యాడు. యేసు సమాధి నుండి లేచి తన శిష్యులకగుపడినప్పుడు తోమావారితో లేడు. తోమా వారి యొద్దకు రాగా "మేము ప్రభువును చూచితిమని" వారతనికి చెప్పగా "అతడు నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులలో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను" (యోహాను 20:19-25).

ఎనిమిది దినములైన తరువాత తోమా

కూడ శిష్యులతో యున్నప్పుడు యేసు వారి మధ్యను నిలిచి తోమాను చూచి "నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము. నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమని చెప్పెను. అందుకు తోమా ఆయనతో నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20:26-29).

యేసు మృతులలో నుండి పునరుత్థానుడైన సంఘటనను గూర్చి యున్నన్ని రుజువులు చరిత్రలో మరిదేనికిని లేవు. నలుబది దినములలో ఆయన పండ్రెండు మారులు వందలాది ప్రజలకు కనబడెను. ఒకసారి 500 మందికి పైగా ఆయన కనబడెను. ఇంతమంది ప్రత్యక్షసాక్షులున్న సంఘటన ప్రపంచములో మరి యేదీలేదు.

రుజువును చూడగానే తోమా విశ్వసించాడు. అందుకే యేసు అతనితో "నీవు నన్ను చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులని" చెప్పెను. ఆయన నిన్ను నన్ను ఆ జాబితాలో యుంచారు.

తోమా వలె ప్రభువు యొక్క శిష్యులు కూడా సందేహించారు. "ఆయన సహోదరులైనను ఆయన యందు విశ్వాసముంచలేదని" యోహాను 7:5లో వ్రాయబడియున్నది. గాని ఆయన పునరుత్థానము దానినంతా మార్చివేసింది. యాకోబు, యూదాలు ఇద్దరు యేసుయొక్క దాసులమని చెప్పుకొన్నారు (యాకోబు 1, యూదా 1)

ఈ యేసు ఎవరో దేవదూతలు మనకు తెలియజేసారు. ఆయన జననము గూర్చి చెబుతు గాబ్రియేలు దూత మరియతో "నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును... ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును". "ఆయన తన ప్రజలను వారి పాపము నుండి రక్షించును" అని చెప్పెను. (లూకా 1:31-33)

ఆయన జననమును గూర్చి దూతలు గొర్రెల కాపరులకు "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు" అని ప్రకటించిరి (లూకా 2:11)

ఆయన పునరుత్థానమును ప్రకటించుచు దూతలు "ఆయన ఇక్కడ లేడు; వారు ఆయనను ఉంచిన స్థలము చూడుడి" యని చెప్పారు (మార్కు 16:6). ఈ యేసు ఎవరో దూతలు మనకు చెప్పుచున్నారు.

ఆయన ఎవరో దేవుడు చెప్పారు. యేసు యోహానుచే బాప్తిస్మము పొందినప్పుడు, "ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నానని" తండ్రియైన దేవుడు సాక్ష్యమిచ్చారు (మత్తయి 3:17). తదుపరి పేతురు, యాకోబు యోహానులతో యున్నప్పుడు ఆయన రూపాంతర సందర్భములో దేవుడు అదే మాటలను పలికెను (మత్తయి 17:5)

పెంతెకోస్తునాడు పేతురు నిలిచి

"ఇశ్రాయేలు వారలారా, యీ మాటలు వినుడి, దేవుడు నజరేయుడగు యేసు చేత అద్భుతములను మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి ఆయనను తన వలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను. యిది మీరే ఎరుగుదురు" అని చెప్పెను (అపో.కా. 2:22). "మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. యిది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను (అపో.కా. 2:36).

ఆయన ఎవరో యేసే మనకు చెప్పారు. "అబ్రాహాము పుట్టక మునుపే నేనున్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని'' ఆయన చెప్పెను (యోహాను 8:58).

"పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును" అని ఆయన చెప్పెను (యోహాను 11:25).

"మీరు నన్ను ఎరిగియుంటే నా తండ్రిని ఎరిగియుందురు; ఇప్పటినుండి మీరాయనను ఎరుగుదురు, ఆయనను చూచి యున్నారని" యేసు మరల చెప్పెను (యోహాను 14:7).

గనుక ఈ యేసు ఎవరు ? ఆయనను గూర్చిన వాస్తవములు అనుక్షణం ప్రకటించుచునేయున్నాయి.

ఆయన పునరుత్థానము, జీవమును !

సమాధిపై ఆయనకు శక్తియున్నది !

పరలోకమందున్న దేవుని యొద్దకు వెళ్లే ఏకైక మార్గము ఆయనే ! నిత్యజీవమును గూర్చిన ఏకైక నిరీక్షణ ఆయనొక్కడే !

ఆయన ఘోరమైన మరణము నొందినను నేడు కూడ సజీవుడై యున్నారు !

ఆయన మనలను ఆహ్వానించుచున్నారు. నన్ను పరీక్షించండి, తెలిసికొనండి ! నేనెవరినని మీరనుకొనుచున్నారో మీరే నిశ్చయించుకొనండి ! నేనెవరినో మీ జీవితాలను బట్టి కొలవండి !

ఈ యేసు అభూతకల్పనకాదు. కట్టుకథ లోని వ్యక్తి కాదు, యేసు కన్యకు జన్మించారని, అద్భుతాలు చేసారని, సజీవుడైన దేవుని కుమారుడని నిరాకరిస్తే ఆయనను గూర్చిన ఋజువులను నిరాకరించినట్లే యగును. నీ ఊహల కనుగుణంగా ఆయనన మలచుటకు ప్రయత్నించకు. ఆయన ఆయనే !


నిజంగా ఆయన ఎవరో చూడు. యేసును ఎదుర్కొనినవాడెవడు మారకుండా యుండలేదు, ఈ యేసును నీవు కనుగొని నప్పుడు ఆయనవైపు అమితంగా ఆకర్షింప బడ్తావు. ఏలయనగా ఆయన కాలాన్ని మార్చివేసిన, నీ జీవితాన్ని మార్చగల మధ్యరేఖ! నా జీవితానికి నీ జీవితానికి మధ్య బింబము ఆయనే ! ఆయనను గూర్చిన నా తలంపులు, ఆయన యెడల నా స్పందనను బట్టి నా నిత్య నివాసము నిర్ణయింపబడును! నీది కూడ అట్లే యుండును !

– జిమ్ కెల్లీ

# క్రీస్తు యొక్క రెండవ రాకడ

## ( The Second Coming of Christ )

*- Perry B. Cotham*



క్రీస్తు మరల వచ్చును. క్రొత్తనిబంధనలో మూడు వందలకంటె పైగా నున్న వచనములు ఆ సంఘటనను గూర్చి చెప్పుచున్నవి లేక సూచించుచున్నవి. దురదృష్టముగా ఆయన రెండవ రాకడను గూర్చిన అనేక సిద్ధాంతములు, విభేదములుండుటచే క్రైస్తవులలో అనేకులు ఈ అంశమును సరిగ పరిశీలించ లేక పోవుచున్నారు.

### 1. ఆయన రాకడ ఖచ్చితము

క్రీస్తు యొక్క రెండవ రాకడ బైబిలు యొక్క ప్రశ్నింపతగని వాగ్దానము. యేసు ఆరోహణుడైనప్పుడు అపొస్తలులు ఆకాశమువైపు తేరి చూచుచుండగా దూతలు వారికి ఇట్లు చెప్పిరి: "గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు ? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే ఏరీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చును" (అపొ.కా. 1:11). మరల వత్తునని యేసే చెప్పెను. తన శిష్యులను విడిచిపెట్టకముందే యేసు వారితో ఇట్లనెను : "మీకు స్థలము సిద్ధపరచవెళ్లుచున్నాను; నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:2,3). క్రీస్తు మరల వచ్చునని అపొస్తలులు ప్రకటించిరి. "పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును" అని పౌలు చెప్పెను (1 థెస్స 4:16). హెబ్రీ పత్రిక లేఖకుడు ఆయన "రెండవసారి ప్రత్యక్షమగును" అని చెప్పెను (హెబ్రీ 9:28). "ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుము" అని యోహాను పలికెను (1 యోహాను 3:2).

మొదటి దినములలోవలెనే ఇప్పుడు కూడా ప్రభువు రాకడను శంకించువారు కొందరున్నారు. "అంత్య దినములలో అపహాసకులు అపహసించుచు వచ్చి తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొనుచు, ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను ? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్లే నిలిచియున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసికొనవలెను" (2 పేతురు 3:3,4). అవిశ్వాసులు సంశయించినను, అపహాసకులు పరిహసించినను క్రైస్తవులు బైబిలునందు విశ్వసించుదురు గనుక ఆయన రెండవసారి ప్రత్యక్షమగునని వారు నమ్ముదురు. ఈ వాగ్దాన నేరవేర్పును గూర్చి దేవునికి వెయ్యేండ్లు ఒక దినముగానున్నది (2 పేతురు 3:3,4). "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాదుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీయెడల దీర్ఘశాంతము కలవాడై యున్నాడు. అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును"

(2 పేతురు 3:10). ఈ లోకమును, ప్రస్తుత పరిస్థితులును అంతమగును. ఈ భూమి ఇకలేకుండ పోవును. యేసు మరల వచ్చును. అంతేగాకుండా, క్రీస్తు రెండవ రాకడ ఈ లోకాంతమందు వచ్చును. అప్పుడు కాలము గడిచిపోవును. అది ఆఖరి యుగములో ఆఖరిదినము.

## 2. ఆయన రాకడ కనబడునట్టిది

క్రీస్తు రాకడ వ్యక్తిగతమైనది, దృగ్గోచరమైనది, వినదగునది, మహిమగలది మరియు హఠాత్తుగా వచ్చునది. యేసు వచ్చునప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచును. దేవుని కుమారుని సిలువ వేసిన వారును ఆయనను చూతురు : "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు; ప్రతి నేత్రము ఆయనను చూచును. ఆయనను పొడిచిన వారును చూచెదరు; భూజను లందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు" (ప్రకటన 1:7). ప్రభువు వచ్చునప్పుడు ఆయనను చూచుటకు ఎవడును ఒక ప్రత్యేక స్థలమునకు వెళ్ళనవ సరములేదు. వారెక్కడ ఉన్నను భూజనాంగము లన్నియును ఆయన రాకను పరికింతురు : "మెరుపు తూర్పున పుట్టి పడమటి వరకు ఏలాగు కనబడునో అలాగే మనుష్యకుమారుని రాకడయుండును... అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమ తోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి భూమిమీదనున్న సకల గోత్రముల వారు రొమ్ము కొట్టుకొందురు'' (మత్తయి 24:27-30).

ఆయన మేఘారూఢుడై (అపో.కా. 1:9,11; మత్తయి 26:64) అగ్నిజ్వాలలలో (2 థెస్స 1:8), తన మహిమగల దూతల తోను (2 థెస్స 1:7; మత్తయి 16:27), తన వేవేల పరిశుద్ధుల పరివారముతోను (యూదా 14) ఆర్భాటముతోను ప్రధానదూత శబ్దము తోను, దేవుని బూరతోను దిగివచ్చును (1 థెస్స 1:16). నిస్సందేహముగా క్రీస్తు రాకడ గుప్తమైనది కాక. అగోచరమైనది కాక అది బట్టబయలుగా అందరికీ కనబడునట్టిది. అనుకొనని గడియలో హఠాత్తుగా ప్రభువు ప్రత్యక్షమగుట అవిశ్వాసులకు భయంకరమైన దృశ్యము కాని నీతిమంతులకు అదొక ఆశ్చర్యకరమైన దినము.

## 3. ఆ గడియ తెలియనిది

ఆయన రాకడయొక్క సమయము దేవుని మనస్సులో దాచబడియున్నది (ద్వితీయ 29:29). ఆ తేదీ ఏ మానవునికి దేవుడు బయలు పరచలేదు. ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు యేసు ఇట్లనెను: "ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగడు" (మార్కు 13:32). ఆయన రెండవ రాకడ మధ్యరాత్రిలో గాని లేక తెల్లవారుజామున గాని యుండవచ్చును; ఏ సమయము నందైనను ఆయన ప్రత్యక్షము

కావచ్చును; అది ఈరోజే కావచ్చును. అదెప్పుడు జరుగునో మానవుడెరుగడు. అయితే ఒకటి మాత్రము అతడెరుగును. అదేమంటే జలప్రళయమునకు ముందువలె ఈ లోకజీవనము యధావిధిగా యుండును; మరియు అనేకులు సిద్ధపడకయుందురు. "నోవహు దినములు ఏలాగుండెనో మనుష్య కుమారుని రాకడయును ఆలాగే యుండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసుకొనుచు, పెండికిచ్చుచునుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగక పోయిరి; అలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును" (మత్తయి 24:37-39).

క్రీస్తు రాకడ హఠాత్తుగా ముందు హెచ్చరిక లేకుండా యుండును. అనుకొనని రీతిగా, ఎవరికి చెప్పకుండ ఒక దొంగ వచ్చినట్లు ఆయన వచ్చును (2 పేతురు 3:10; 1 థెస్స 5:2). గనుకనే ఈ గంభీర హెచ్చరిక : "మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి (మత్తయి 24:44)

## ఎ) తేదీలు నిర్ణయించువారు మోసగించుచున్నారు

క్రీస్తురాకడ సమయమును ఎవరు ఎరుగరు గనుక ఆయన రాకడ గూర్చి తేదీలు నిర్ణయించుట జరుగుచున్నది. మరియు ఈ తేదీలు నిర్ణయించువారిని బట్టి మంచి మనస్సు గల వారనేకులు మోసగించబడు చున్నారు. ఉదాహరణకు : ఎడ్వంటిస్టు ఉద్యమమును స్థాపించిన విల్లియం మిల్లర్ అనునతడు క్రీస్తు 1843 లో అక్టోబరు నెలలో వచ్చునని జోస్యము చెప్పెను. అట్లు చెప్పి అనేకులను అతడు నమ్మించెను. తన అనుచరులు వారి ఆస్థులను అమ్మివేసి, తమ కొరకు తెల్లటి ఆరోహణ దుస్తులను తయారు చేసుకొని ప్రభువు ప్రత్యక్షత కొరకు ఆనందముతో కనిపెట్టిరి. ఆ తేదీ వచ్చెను గాని క్రీస్తు రాలేదు. నిరుత్సాహ పడినను మిల్లర్ ఓడిపోలేదు. గనుక తన ప్రవచన లెక్కలలో ఒక సంవత్సరమును గూర్చి పొరపాటు చేసితినని తన అనుచరులకు చెప్పి ప్రబువు ఆ మరుసటి సంవత్సరమున అతడు నిర్ణయించిన తేదీన వచ్చునని ప్రకటించెను. మరల ఆ తేదీ వచ్చెను గాని, 1884లో క్రీస్తు రాలేదు.

తరువాత, యెహోవా సాక్షులు అనే గుంపును స్థాపించిన చార్లెస్ టి. రస్సెల్ అనునతడు క్రీస్తు రాకడను గూర్చి వ్రాసెను. 1874లో అక్టోబరు నెలలో ప్రభువు వచ్చెను గాని కొంతమంది మాత్రమే అనగా అతని అనుచరులు మాత్రమే దానినెరుగుదురనియు మిగిలిన వారందరికి అది దృగ్గోచరము కాలేదనియు అతడు చెప్పెను. ఇంతకు ముందే మనము గమనించినదేమంటే ప్రభువు వచ్చినప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచును (ప్రకటన 1:7). ఆయన వ్యక్తిగత

ముగా వచ్చును. ఆయన రాకడను నీతి మంతులు, అనీతిమంతులు చూడగల్గుదురు.

'పాస్టర్ రస్సెల్' అని తరుచు పిలువబడు చున్న యతడు, క్రీస్తు రెండవ రాకడతో ఆరంభ మగు 'సువర్ణయుగమును' గూర్చి అనేక ప్రవచనములు చేసెను. అయితే ఈ విషయములో అతడు చేసిన ప్రవచనము లన్నియు అతడొక అబద్ధ ప్రవక్తయని నిరూపించెను. "ప్రవక్త యెహోవా నామమున చెప్పినప్పుడు ఆ మాట జరుగకపోయిన యెడలను ఎన్నడు నెరవేరకపోయిన యెడలను అది యెహోవా చెప్పిన మాట కాదు; ఆ ప్రవక్త అహంకారము చేతనే దానిని చెప్పెను గనుక దానికి భయపడవద్దు" (ద్వితీ 18:22).

1916 లో రస్సెల్ చనిపోగా, జడ్జి రూథర్‌ఫోర్డు అనునతడు అతని సింహాసనము నకు వారసుడాయెను. అతడు కూడ ప్రవచనములు పలికెను. 1920లో 'ఇప్పుడు జీవించుచున్న లక్షలాది ప్రజలు ఎన్నడు మృతిజెందరు' అనే చిన్న పుస్తకమును రూథర్‌ఫోర్డు ప్రచురించెను. 1925లో మృతి బొందిన నీతిమంతులు లేపబడుదురనియు, అప్పటికి సజీవులుగాయుండి విమోచనకర్తను అంగీకరించిన వృద్ధులందరు తమ యౌవన ప్రాయమును తిరిగిపొంది భూమిమీద నిత్యము జీవించుచు మరణమును ఎన్నడు చూడరనియు అతడు ఆ పుస్తకములో ప్రవచించెను. అంటే 1925లో చెక్కతో చేయబడిన కాళ్లు కలిగిన వృద్ధులందరికీ క్రొత్త అవయవములు లభించును. పళ్లు కట్టించుకొనిన వారికి క్రొత్తపళ్లు లభించును. మరియు బట్టతల కలిగిన వారందరికీ వెంట్రుకలు మొలకెత్తునని దీనియర్థము; అంతే కాకుండా అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, దావీదు మొదలగువారు మిగతా పాతనిబంధన వ్యక్తులతో సహా భూమి మీద జీవించెదరని, 1925 తరువాత వారు అందరికీ కనబడుదురని అతడు ప్రవచించెను. నిజముగా 1925 సువర్ణ యుగము యొక్క ఆరంభమగును. అయితే ఇదంతయు 1925 ముందు ప్రజలకు చాల చక్కగా కనబడెను. గాని 1925 వచ్చెను. రూథర్‌ఫోర్డు ప్రవచనములన్నియు విఫల మాయెను. 1925 తరువాత అతడు కూడ చనిపోయెను. 1925 రాగా జీవించుచున్న లక్షలాది ప్రజలలో అతడొకడు కాని అతడు చనిపోయెను. అతడు కూడ ఒక అబద్ధ ప్రవక్తయే.

1939లో క్రీస్తు వచ్చునని మరొకడు చెప్పెను. మరికొందరు దాని తరువాయి తేదీలను నిర్ణయించిరి. అయితే ఆ తేదీలలో ఆయన ప్రత్యక్షమాయెనా ? గనుక దేవుని వాక్యము నెరుగని వారిని ఈ తేదీలు నిర్ణయించువారు మోసగించుచునే యున్నారు.

మానవులచే నిర్ణయించబడిన ఏ తేదీల లోను క్రీస్తురాలేదు గనుక ఆ యంశమును గూర్చి మానవునికి ఇసుమంతయును తెలియ

దని నిర్ధారణ యగుచున్నది. ఈ వాస్తవము లను బట్టి చూచిన, క్రీస్తు రాకడ కొరకు తేదీలను కొందరు ఎందువలన నిర్ణయించు టకు పూనుకొన్నారు ? క్రీస్తు రాకడ కొరకు వీరొక తేదీని నిర్ణయించగా ఈ అబద్ధ ప్రవక్తలు దానిని బాగుగా యెరిగినవారని ప్రజలు వారినే ఎందుకు నమ్ముదురు ? ఆ తేదీ ఎవరికిని బయలు పరచబడలేదు.

## బి) సవరణ చేయబడిన తేదీలు నిర్ణయించువారు మోసగించుచున్నారు.

రక్షకుని రాకకొరకు కొందరు ఒక ప్రత్యేక తేదీని నిర్ణయించరు గాని ఆయన రాకడ సమీపముగా యున్నదని, అది "ఈ సంవత్సరములో" లేక "ఈ తరములో" జరుగునని నొక్కి చెప్పుదురు. ఇది సంభవమే కాని బైబిలు అట్లు బోధించుటలేదు. క్రీస్తు రాకడ బహు సమీపముగా నున్నదని మొదటి శతాబ్దములో లేఖనములు బోధించలేదు (2థెస్స 2:1-3); మరియు ప్రభువు యొక్క రెండవ రాకడ బహు ఆసన్నమైనదని అవి ఎప్పుడు బోధించుటలేదు. చరిత్రలో మున్నెన్నడు లేని విధముగా లోకాంతమును గూర్చి ప్రజలు ఆలోచించుచున్నారు. మిగులు క్షోభమును పుట్టించెడు బోధను బట్టియు, వ్రాతలను బట్టియు కొందరు లొంగిపోయినను మరికొందరు అబద్ధ ప్రవక్తల వలన ఆఖరి సంగతులను గూర్చి బైబిలును పఠించుటలో ఉదాసీనులైరి.

## సి) మత్తయి 24లోని అనేక సూచనలు సరిగ ఉపయోగింపబడుటలేదు

సూచనలు, ప్రవచన నెరవేర్పు, క్రీస్తు రాకడ ఆసన్నతను గూర్చి చెప్పువారు, వారి భావార్థములకు నిరూపణగా మత్తయి 24వ అధ్యాయము లోని మొదటి భాగము నుపయోగింతురు. అది చాల ప్రాముఖ్య అధ్యాయము గనుక దానిని చాల జాగ్రత్తగా చదువవలెను. ఈ లేఖన భాగమును గూర్చి ఇప్పుడు కొన్ని సంగతులను గమనించుము.

క్రీస్తు యొక్క ఆఖరి బహిరంగసభ తరువాత, సిలు వేయబడక ముందు ఆయన దేవాలయమును వీడి తన శిష్యులతో ఒలీవ కొండకు వెళ్లెను. వారు దేవాలయము నుండి బయలుదేరుచుండగా యేసు శిష్యులు ఆ దేవాలయపు కట్టడములు ఆయనకు చూపించిరి (1వ). అందుకాయన రాతి మీద రాయి యొకటియైనను అక్కడ నిలిచియుండ కుండ పడద్రోయబడునని వారితో అనెను (2వ). తరువాత ఆయన ఒలీవకొండ మీద కూర్చుండి యున్నప్పుడు శిష్యులాయన యొద్దకు ఏకాంతముగా వచ్చి-ఇవి ఎప్పుడు జరుగును ? నీరాకడకును ఈ యుగసమాప్తికి సూచనలేవి ? మాతో చెప్పుమనిరి (3వ). వారి ప్రశ్నలకు సమాధానమిస్తూ యేసు ఆ నలుగురు అపొస్తలులకు దేవాలయ నాశనమును గూర్చియు తన రెండవ రాకడను గూర్చియు ప్రవచనములనిచ్చెను. క్రీస్తు రెండు ప్రశ్నలకు సమాధానమిచ్చెనని జాగ్రత్తగా

గమనించుము; అవేవన : 1) ఇవి ఎప్పుడు జరుగును ? అంటే ఆయన ప్రవచించినట్లు యెరూషలేము దేవాలయ నాశనము ఎప్పుడు జరుగును ? అనునది; మరియు 2) నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? ఈ సంఘటనలన్నియు ఒకేసారి జరుగునని అపొస్తలులు తప్పుగా భావించిరి. వారు ఏ క్రమములో ప్రశ్నించిరో యేసు అదే క్రమములో వారికి జవాబిచ్చెను.

యేసు ఈ మాటలు చెప్పిన 40 సంవత్సరములలోపు గానే క్రీ॥శ॥ 70 లో యెరూషలేము రోమా చక్రవర్తియగు టైటస్ వలన నాశనము గావించబడెను. ఒకానొకప్పుడు దేవాలయమున్నచోట ఇప్పుడు ముస్లిముల మసీదు ఒకటి ఉన్నది. ఒలీవకొండపై నుండి క్రీస్తు చెప్పిన ప్రవచనము అక్షరాల నెరవేరెను. ఆ దేవాలయము రాతిమీద రాయి ఒకటియైనను నిలువబడకుండ పడద్రోయబడెను. యెరూషలేము నాశనము గూర్చి ఆదిమ శిష్యులు సంపూర్తిగ బోధింపబడి ఎంతవరకు హెచ్చరింపబడియున్నారంటే ఆ భయంకర సంఘటనలో క్రైస్తవుడొక్కడూ కూడ మరణించి నట్లు చరిత్రలో వ్రాయబడియుండ లేదు.

యేసు ముందుచెప్పిన ఇవన్నియు వారి తరములోనే జరుగునని ఆయన చెప్పిన దానిని మనము గమనించవలెను (34వ). గనుక సత్యవాక్యమును సరిగ విభజించలేని వారందరు, మత్తయి 24లో చెప్పబడిన సూచనలలో క్రీస్తు రెండవరాకడను గూర్చిన సూచన తప్ప మిగతావన్నియు నెరవేరెనని గ్రహించవలెను; అవన్నియు నెరవేరువరకు ఆ తరము గతింపలేదు. యెరూషలేము నాశనము గూర్చియు, యూదయ సామ్రాజ్యమును గూర్చియు యేసు చెప్పిన కొన్ని సంగతులు తీసికొని వాటిని ఆయన రెండవ రాకడకును, యుగసమాప్తికిని కొందరు ఉపయోగించుట దురదృష్టము (మత్తయి 24:4-28; ద్వితీ 28:48-58)

మత్తయి 24వ అధ్యాయమును ఎల్లప్పుడు మార్కు 13లోను, లూకా 21:5-28లోను వ్రాయబడిన సమానాంతర సంఘటనలతో సహా చదువవలెను. మత్తయి 24:15లో యున్న మాటలను లూకా 21:20 బహు విపులమైన పదములతో యెరూషలేము రోమా సామ్రాజ్య సైనికులచే చుట్టబడుటను గూర్చి చెప్పుచున్నది : "యెరూషలేము దండ్లచేత చుట్టబడుట మీరు చూచునప్పుడు దాని నాశనము సమీపమైయున్నదని తెలిసికొనుడి" (దానియేలు 9:24-29; మార్కు 13:14).

క్రీస్తు క్రీ॥శ॥ 30లో చెప్పినమాట అంటే "ఈరాజ్య సువార్త సకల జనులకు సాక్షార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటు తరువాత అంతము వచ్చును" (14వ; మార్కు 13:10) అను దానిని తీసుకొని కాలాంతము దగ్గరగా యున్నదని కొందరు వాదింతురు. కాని క్రీ॥శ॥ 70కి ముందే సువార్త భూలోక

మందంతటికిని, భూదిగంతముల వరకును ప్రకటింపబడెను అని పౌలు వ్రాసెను (రోమా 10:18). మరల ఆకాశము క్రిందనున్న సమస్త సృష్టికి సువార్త ప్రకటింపబడెనని అతడు వ్రాసెను (కొలస్స 1:23)

గనుక అబద్ధక్రీస్తులు (5వ), యుద్ధములు యుద్ధ సమాచారములు (6వ), అబద్ధ ప్రవక్తలు (11, 24), మరియు సకల జనులకు సువార్త ప్రకటింపబడుట ఇవన్నియు యెరూషలేము నాశనము కాకముందున్న సమయమును గూర్చి చెప్పబడినవి. మరల రోమా సైన్యము యూదయ జనాంగమున కంతయు కలుగజేసిన సంఘటన గొప్ప శ్రమ కాలమని జోసిఫన్ అను యూదా చరిత్రకారుడు వ్రాసెను (21వ). క్రీస్తు అనుచరులకొరకు దేవుని కరుణాకటాక్షములు లేనియెడల ఆనాడున్న యూదా జనాంగ మంతయును తుడిచివేయబడియుందురు; ఏ శరీరియు తప్పించుకొనలేకపోవును (22వ, దానియేలు 12:1; 1 థెస్స 2:16). గనుక కొందరు బైబిలువేత్తలు చెప్పు గొప్ప శ్రమ కాలము అది అప్పుడే జరిగిపోయినది, సంపూర్తిగ నెరవేర్చబడినది.

గనుక ఒలీవ కొండపై నుండి ప్రభువు చేసిన సంభాషణ శిష్యులకు ఆయన రెండవ రాకడను గూర్చిన సూచనలిచ్చుటకు కాదు గాని, ఆ తరములో యున్న విశ్వాసులకు రాబోవుచున్న యెరూషలేము నాశనము గూర్చి హెచ్చరించుటకు, తరువాత వారు ఆ పట్టణమునుండి సురక్షిత ప్రదేశములకు పారిపోవుటకు ఒక ఖచ్చితమైన సూచన లిచ్చుటకు మాత్రమేయని గ్రహించవలెను. యెరూషలేము చుట్టూ రోమా సైనికులను వారు చూచినప్పుడు (లూకా 21:20; మత్తయి 24:15), వారు యెరూషలేము నుండియు యూదయ నుండియు పారిపోవుఘడియ వచ్చినదని ఖచ్చితముగా యెరుగుదురు. అయితే యుద్ధములు, కరువులు, భూకంపములు మొదలగునవి ఆయన రెండవ రాకడ యొక్క సూచనలుగా గమనించరాదని యేసు విపులముగా చెప్పెను. ఇవి ఆయన రెండవ రాకడకు సూచనలు కావని యేసు చెప్పినను అవే ఆయన రాకడ యొక్క సూచనలని అనేకులు పదే పదే వల్లించుట ఆశ్చర్యముగాయున్నది. ఆ తరము గతించక ముందే ఈ సూచనలన్నియు నెరవేరినందున అవి క్రీస్తు రాకడను సూచించునట్టివి కావు. గాని యెరూషలేము నాశనమును గూర్చి ఆయన ముందు చెప్పిన దానిని సూచించుచున్నవి. ఆ సూచనలన్నియును ఆయన రెండవ రాకడను గూర్చినవని చెప్పిన యెడల, ఆయన రాకడను గూర్చిన సూచనలు గాని హెచ్చరిక గాని ఏదియు ఉండదని ఆయన చెప్పిన మాటలకు విరుద్ధముగా యుండును. (మార్కు 13:22).

ఆయన సంభాషణ నంతటిని జాగ్రత్తగా గమనించిన యెడల ప్రభువు భవిష్యత్తును రెండు ప్రత్యేక కాలములుగ విభజించెనని

తెలిసికొనగలము; దానిలో మొదటిది ఆయన సంభాషణ చేసినప్పటినుండి యెరూషలేము నాశనమయ్యే వరకు ఉన్నది; రెంవది ఆయన రెండవ రాకడ నుండి ఈ లోకాంతము వరకు ఉన్నది. మొదటి కాలమును గూర్చి యేసు "మీరు జాగ్రత్తగా ఉండుడి; ఇదిగో సమస్తమును మీతో ముందుగా చెప్పియున్నాను" అని చెప్పెను (మార్కు 13:23); గాని రెండవ కాలమును గూర్చి రాబోవు అంతమును గూర్చి ఒక సూచననిచ్చి తన ప్రజలను హెచ్చరించుటకు బదులు ఆయన కేవలము సామాన్య పదములతో మాటలాడెను. మరియు ఆయన రాకడ సమీపమై యున్నట్లు తన శిష్యులు తెలిసికొనకుండ ఏవిధమైన సూచనలు ఇయ్యబడవని ఆయన తెలియజేసెను. "ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగునుగాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైను, కుమారుడైనను ఎరుగరు" అని ఆయన చెప్పెను (మత్తయి 24:36). క్రీస్తు రెండవ రాకడ దినమును దేవుడొక్కడే యెరుగును (అపో.కా. 17:31).

గనుక క్రీస్తురాకడ యెరూషలేము ముట్టడించబడినప్పుడు గాని, లేదా అది నాశనము చేయబడినప్పుడు గాని సంభవించదు. గాని తరువాతనే సంభవించును. ఆ శ్రమకాలము అయిపోయిన ఎంతకాలము తరువాత ఆయన రాకడయు, కాలాంతమును జరుగునో క్రీస్తు చెప్పలేదు; మరియు బైబిలులో ఎక్కడ చెప్పబడలేదు. ఆయన రెండవ రాకడను గూర్చి యేసు చెప్పిన ఉపమానములు సిద్ధపాటును గూర్చి వక్కాణించినవి గాని ఆయన రాకడ సమయమును గూర్చి కాదు. యజమానుడు వచ్చినపుడు తన దాసుడు సిద్ధపడక యుండుట కంటే, యెల్లప్పుడు యజమానుని చిత్తమును జరిగించువాడై యుండవలెనని ఆయన బోధించెను (45-51వ). తరువాత అధ్యాయములో రెండు ఉపమానములను, పదికన్యకలు తలాంతులను గూర్చి ఆయన చెప్పెను. ఆ సంభాషణలో ఆయన వక్కాణించిన ఒకే అంశము ఏమంటే ఆయన శిష్యులు ఆయన రెండవ రాకకై ఎల్లప్పుడు కనిపెట్టుచు సిద్ధపడియుండవలెను.

24వ అధ్యాయములోఅంజూరపు చెట్టును గూర్చిన ఉపమానము యెరూషలేము నాశనము వర్ణించుటకు చెప్పబడెను. అంజూరపు చెట్టు చిగిరించునప్పుడు వసంతకాలము యెట్లు సమీపముగా యుండునో అట్లే యూదయలో రోమా సైనికులు యొక్క ఉనికి యెరూషలేము యొక్క నాశనమునకు ఖచ్చితమైన రుజువు అని ఆయన దాని ద్వారా వారికి తెలియజేసెను. అయితే ఆయన రెండవ రాకడయితే దానికి విరుద్ధముగా యుండును; దానికి ముందు ఏవిధమైన సూచనలు వుండవు. క్రీస్తు యొక్క ఈ మాటలనుబట్టి, బైబిలు నందున్న

ప్రవచనముల ఆధారముగా ప్రభువు తిరిగి వచ్చే సంవత్సరమును గూర్చి లెక్కలుకట్టుట అసాధ్యమని మనము తప్పక చూడగలము. అంతేకాకుండా ఏదో ఒక శ్రమకాలము తరువాత ప్రభువు బయలుపరచబడునను భావము ఎంత సత్యవిరుద్ధమో గమనించగలము.

ప్రభువు తన శిష్యులకిచ్చిన ఇంత చక్కని హెచ్చరికలున్నను, ఎవడైనా బోధకుడు "కాలాంత సూచనలను గూర్చి" తెలిసిన వానివలె చెప్పునప్పుడు నేటి భక్తిపరులు అతని గూర్చి ఉప్పొంగిపోవుదురు. ఈ యుద్ధము ఆ యుద్ధము లేక భూకంపము లేక గొప్ప కరువు వగయిరాలు ప్రవచన ప్రకారము క్రీస్తు రాకడ యొక్క ఖచ్చితమైన సూచనయని అతడు తన శ్రోతలకు తెలియజేయుటకు యత్నించును. అయితే ఆ దినమైనను ఆ గడియయైనను ఎవనికి తెలియదనియు ప్రజలు అనుకొనని సమయమందు అది జరుగుననియు యేసు వక్కాణించెను (మత్తయి 24:24). ఆ సమయము ఎప్పుడో తెలియదు గాని, క్రీస్తు వచ్చుట మాత్రము ఖచ్చితము.

### 4) యేసు వచ్చినప్పుడు భూమి కాలిపోవును, మృతులు లేపబడుదురు మరియు లోకమునకు తీర్పు జరుగును

క్రీస్తు రాకడలో జరుగు సంఘటనలు లేఖనములలో తేటగా చెప్పబడినవి. అవేవనగా :

1) భూమియు దానిమీదనున్న కృత్యములు కాలిపోవును. లోకాంతము సంభవించును : "అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువచేయబడినవై అదే వాక్యము వలన భద్రము చేయబడియున్నవి... అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును. పంచభూతములు మిక్కట మైన వేండ్రముతో లయమైపోవును. భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును" (2 పేతురు 3:7-11). (చాల అభూతకల్పనగా ఈ మాటలు చెప్పబడెనని ఒకప్పుడు భావించబడెను. గాని ఆటంబాంబులు హైడ్రోజన్ బాంబులు గల ఈ రోజులలో ఈ మాటలు ఎంత యధార్థమో మనము ఇట్టే గమనింపవచ్చును).

2) మానవులందరు, నీతిమంతులు అనీతిమంతులు ఒకేసారి లేపబడుదురు : "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28,29). "ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. ప్రతివాడును తన వరుసలోనే బ్రతికింపబడును; ప్రథమ

ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయన వారు బ్రతికింపబడుదురు. అప్పుడు అంతము వచ్చును. కడబూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడు దురు. మనము మార్పు పొందుదుము" (1 కొరింథీ 15:22-24, 52).

3) మానవులందరకు, నీటిమంతులకు అనీతిమంతులకు ఆఖరితీర్పు జరుగును: "తన మహిమతో మనుష్య కుమారుదును ఆయునతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జననములు ఆయన యెదుట పోగుచేయబడుదురు; గొల్లవాడు మేకలలో నుండి గొర్రెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచును'' (మత్తయి 25:31-32). "...సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు" (2 తిమో 4:1). "మరియు ధవళమైన మహా సింహాసనమును దానియందు ఆసీనుడై యున్న యొకనిని చూచితిని... మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని, అప్పుడు గ్రంధములు విప్పబడెను; ఆ గ్రంధములయందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:11,12).

లేఖనములు ఈ లోక అంతమును, మృతుల పునరుత్థానమును, ఆఖరి తీర్పును క్రీస్తు యొక్క రెండవ రాకడతో తేటగా కలుపుచున్నవి. ప్రభువు వచ్చే ఘడియను గూర్చి మానవునికి తెలియజేయబడకపోయి నను, ఆయన మృతులను అనగా నీతిమంతు లను అనీతిమంతులను లేపుటకు మానవ జాతికంతటికిని తీర్పు తీర్చుటకును ఆయన వచ్చుచున్నాడని నిర్ధారణ చేయబడెను.

ఎ) క్రీస్తు ఒక భూసామ్రాజ్యమును స్థాపించబోడు

క్రీస్తు మరల వచ్చునప్పుడొక భౌతిక రాజ్యమును స్థాపించి ఈ లోకమంతటిని పరిపాలింపబోవుటలేదు. క్రీస్తు ఇప్పుడు రాజై యున్నాడని బైబిలు బోధించుచున్నది. (1 తిమోతి 6:15); భూమిపై ఆయన రాజ్యమే సంఘము (మత్తయి 16:18,19), అయినను అది ఈలోకసంబంధమైనది కాదు (యోహాను 18:36). ఆదిమ క్రైస్తవులు అప్పుడే రాజ్యములో ప్రవేశించి యుండిరి (కొలస్స 1:13, 14; హెబ్రీ 12:28; ప్రక 1:9). మార్కు 9:1; అపొ.కా. 2:1-4 లను మనము పోల్చి చదివిన యెడల భూమిపై క్రీస్తు రాజ్యము పెంతెకొస్తు దినమున, యెరూషలేము పట్టణములో స్థాపించబడెనని గ్రహించగలము. క్రీస్తు మరల వచ్చునప్పుడు ఆయన తన పాలనను విరమించి రాజ్యమును తండ్రియైన దేవుని కప్పగించును (1 కొరింథీ 15:24-26; అపొ.కా. 2:29-36; జెకర్యా 6:12,13; హెబ్రీ 8:1,4). క్రీస్తు రాకముందు గాని, ఆయన వచ్చిన తరువాతగాని క్రీస్తు

ఒక భూసామ్రాజ్యమునేలును అని చెప్పే లేఖనము ఏదియు లేదు. క్రీస్తు యొక్క వెయ్యేండ్ల పాలన అని చెప్పబడునది అబద్ధమని తిరస్కరించవలెను. ఆ సిద్ధాంతము అలంకార రీతిగా అనేక గురుతులతో నిండియున్న ప్రకటన 20:1-7 పై ఆధారపడి చెప్పబడిన అసత్య భావార్ధము వలన ఉద్భవించెను. ఆ భావార్ధము లేఖనములలో అనేక చోట్ల తేటగా చెప్పబడిన వచనములకు విరుద్ధముగా యున్నది. అది ఈ దిగువ సంగతులను గూర్చి చెప్పుటలేదు. 1) క్రీస్తు రెండవ రాకడ 2) శరీర పునరుత్థానము 3) నీతిమంతులందరు 4) భూమిపై రాజ్యపాలన 5) భూమిపై క్రీస్తు 6) క్రీస్తు పాలన యొక్క సమయము మరియు 7) క్రీస్తు రాజు గాను యెరూషలేము ముఖ్యపట్టణముగాను.

యోహాను ఇట్లనెను : "యేసు విషయమై తామిచ్చిన సాక్ష్యము నిమిత్తము శిరచ్ఛేదనము చేయబడినవారి ఆత్మలను చూచితిని, వారు బ్రదికిన వారై వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి ఇదియే మొదటి పునరుత్థానము". 'భూమిమీద' అనే మాట ఈ వాక్యములో లేదు. నిజానికి ప్రభువు ఈ భూమిపై తన పాదములనెన్నడు మరల మోపడు. ఆయన వచ్చినప్పుడు ఈ భూమి కాలిపోవును (2 పేతురు 3:10); నీతిమంతులు ఆయనను మధ్యాకాశములో కలిసికొందురు (1 థెస్స 4:17). గనుక క్రీస్తు తన పాలనను పెంతెకొస్తునాడు ఆరంభించెనని లేఖనములు బోధించుచున్నవి. ఆయన వచ్చిన తరువాత కాలము అంతమగు వరకు ఆయన కొనసాగించును. అందువలన భూమిపై క్రీస్తు వెయ్యేండ్ల పాలన అసాధ్యమగుచున్నది. సువార్త యుగమే ఆఖరి యుగము (అపొ.కా. 2:17). ఇప్పటి క్రైస్తవ యుగాంతము తరువాత వచ్చే మరొక భూసంబంధమగు యుగము లేదు. 'వెయ్యేండ్ల పాలన' క్రీస్తు యొక్క రెండవరాకడకు యుగాంతమునకు ముందు రావలసియున్నది. గనుక మొదటి పునరుత్థానము ఆత్మీయమైనది (మలాకీ 4:6; మత్తయి 11:14; లూకా 1:17; యెహెజ్కేలు 37:1-14).

క్రీస్తు భూమి మీద నిజముగా వెయ్యేండ్లు పాలించుననను భావమునకు బైబిలు ఆధారమేమియు లేదు. యేసు మరల వచ్చునప్పుడు 1) కాలము అంతమగును 2) మృతులందరు ఒకే సమయమున లేపబడుదురు. 3) ఆఖరి తీర్పు జరుగును 4) నిత్యత్వము ఆరంభమగునని లేఖనములు బోధించుచున్నవి. ప్రకటన 20:1-6లో యున్న వర్ణన గురుతులతో కూడినట్టిది. గనుక క్రీస్తు రెండవరాకడను గూర్చియు, పునరుత్థానమును గూర్చియు, తీర్పును గూర్చియు బైబిలునందును మిగతా లేఖనములతో అది సమన్వయించబడవలెను. అయినను వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము లేఖనములలో తేటగాయున్న అనేక

వాక్యములకు విరుద్ధముగా యున్నది. ప్రకటన గ్రంధములోని సంగతులను ఉన్న పాటుననే అంగీకరించుట చాల తప్పు. ప్రకటన 20:1-6 లోని భాగము క్రైస్తవ్యము యొక్క పునరుజ్జీవమును, హింసింపబడిన క్రైస్తవుల విజయమును అలంకారరీతిగా వర్ణించుచున్నది. క్రీస్తు క్రైస్తవుల హృదయముల లోను, సంఘము మీదను పాలించుచున్నాడు గనుక, క్రైస్తవులు ఇప్పుడు ఆ 'వెయ్యేండ్ల పాలనలో' యున్నారు. అందువలన మొదటి పునరుత్థానము ఆత్మీయమైనది. పునరుత్థానమును గూర్చి అలంకారరీతిగాను, శరీర రీతిగాను బైబిలు చెప్పుచున్నది (యోహాను 5:25; రోమా 6:4; యెహెజ్కేలు 37:1-14; మలాకీ 4-5; మత్తయి 11:11-14; మార్కు 9:11-13, లూకా 1:17). వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము అసత్యము.

**బి) తీర్పు ఒక గొప్ప దినము**

క్రీస్తు రాకడలో మృతులందరు లేచిన తరువాత ప్రభువు మానవులందరికీ తీర్పు తీర్చును. వీరిలో ఆయన లేపినవారును, ఆయన రెండవ రాకడ సమయమునకు సజీవులైనవారును ఉందురు. తీర్పు దినము ఒకటి వచ్చుచున్నదని బైబిలు విశదముగా బోధించుచున్నది.

మిగతా అంశములకంటే క్రీస్తు రెండవ రాకడను గూర్చియు మానవులందరి పునరుత్థానమును గూర్చియు బహుకొద్ది ప్రసంగములు చేయబడుచున్నవి. అయితే ప్రవక్తలు, అపొస్తలులు, క్రీస్తు యొక్క పెదవులపైన కాలాంతము, ఆఖరి తీర్పు తరుచు కనబడు అంశములు. మనుష్యులందరు దానిని గూర్చి ఇప్పుడును తీవ్రమైన ఆసక్తిని కలిగియుండవలెను.

"నీ మనస్సులో అతి తీవ్రముగాయున్న ఆలోచన యేమిటి ?" యని డేనియల్ వెబ్‌స్టర్‌ను అడుగగా అతడు "దేవునికి నా వ్యక్తిగత బాధ్యత" యని జవాబిచ్చెను. ఇది ఎంత తీవ్రమైన ఆలోచనో! అందరికి తీర్పు జరుగుట తథ్యము. సంశయములతో ఇప్పటి జీవితము కప్పబడియున్నది. భావిలో ఏమి జరుగునో యెవనికి తెలియదు. అయితే ఒకటి మాత్రము ఖచ్చితము. "మనమందరము దేవుని న్యాయపీఠము యెదుట నిలుతుము... గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవుని లెక్క యొప్పగించవలెను... మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (రోమా 14:10,12; హెబ్రీ 9:27). ఆ నియమించబడిన దానినుండి ఎవడు తప్పించుకొనలేడు. అది ఎంత గొప్ప సంఘటనో !

అది ఎంత ఆశ్చర్యదృశ్యమో ! మానవ మాత్రులదరు అక్కడ ఉందురు ! జీవించుచున్న వారు, మృతుల సమూహము అక్కడ ఉందురు. ఆదాము నుండి ప్రభువు రాకడ వరకు ప్రతి చోట నుండి, ప్రతి యుగము

లోను ఉన్నవారందరు అక్కడ ఉందురు. కొద్దివారు, గొప్పవారు, సన్మార్గులు, దుర్మార్గులు, ధనవంతులు, ధనహీనులు, జ్ఞానులు, అజ్ఞానులు, అన్నిజాతుల వారు, అన్ని భాషలవారు, ఆ గొప్ప ధవళ సింహాసనము యెదుట ప్రత్యక్షమగుదురు. ఏలయనగా సజీవులేమి, మృతులైన వారేమి అన్ని జనాంగముల వారు క్రీస్తు న్యాయపీఠము ఎదుట నిలుతురు. అది ఎంత గొప్ప జనసమూహమో !

భవిష్యత్ తీర్పు అవుసరము. కొందరు నేరస్థులు అధికారుల నుండి, న్యాయ స్థానముల నుండి తప్పించుకొని యుండ వచ్చును. అయితే ఎవడును తప్పించుకొన లేని ఒక తీర్పు దినము వచ్చుచున్నది. ఒకరీతిగా చూచిన మానవులకు ఈ లోకములోనే తీర్పు జరుగుచున్నది. అయితే అది భావిలో జరుగబోయే తీర్పును నిరర్థకము చేయుటలేదు; సంపూర్ణ ఆఖరి తీర్పు కొరకు అది మరింత చేయూతనిచ్చుచున్నది. ఈ లోకములో అనేక కారణములను బట్టి న్యాయము సంపూర్ణమును ఖచ్చితమును కాకపోవచ్చును. 1) మానవ చట్టములు గుర్తించని కృతఘ్నత, ద్వేషము, హింసా కాండము, అబద్ధములు, దూషణలు, తల్లిదండ్రుల నవమానపరచుట మొదలగు అతిక్రమములు ఇక్కడ ఎన్నో యున్నవి. 2) మానవుల తీర్పులు అసంపూర్ణములు. అసంతృప్తి కరములు. న్యాయస్థానములో యున్న మానవ న్యాయాధిపతులకు ఏ నేరమునకు ఎట్టి శిక్షను సరిగ విధించవలెనో అనేకసారులు తెలియదు. నిజానికి ఒక్కోసారి దోషి జయించుట నిర్దోషి శిక్షింపబడుట జరుగును. 3) న్యాయసభలో పరిశీలించబడు చున్నవాడు దోషియో నిర్దోషియో యను దాని గూర్చి మానవ న్యాయాధిపతి అనేకసారులు సంశయించును. మానవతీర్పు దోషరహిత మైనదని నిజానికి ఎవడును ఆరోపించడు 4) ఒక్కోసారి నిర్దోషులు రక్షింపబడుచు, దోషులు శిక్షను తప్పించుకొనుట వలన ఈలోక అన్యాయాలను సరిజేయుటకు తీర్పు అవునరము. దోషులు శిక్షింపబడి, నీతిమంతులు రక్షింపబడుట మాత్రమే కాకుండ వారి జీవితములు విప్పబడి అందరికి ప్రకటింపబడవలెను. అందువలన నీతి తీర్పు ఒకటి తప్పక రావలెనని మనుష్య జ్ఞానము కోరుచున్నది.

### సి) ఈ లోకమునకు క్రీస్తుద్వారా దేవుడు తీర్పుతీర్చును

క్రీస్తే న్యాయాధిపతిగా యుండును. సజీవులకును, మృతులకును తీర్పు తీర్చే ఘనత క్రీస్తుకు ఈయబడెను; మరియు ఆయన న్యాయపీఠము యెదుట మానవు లందరు నిలబడవలెను (యోహాను 5:22,27; అపొ.కా. 17:31; మత్తయి 25:31,32). తానొక గొల్లవానిగా గొర్రెలను మేకలను వేరు చేయుచున్నట్లు వర్ణించుచు యేసు తీర్పు దృశ్యమును మనకు వర్ణించెను.

ఆయన "తన కుడివైపున ఉన్నవారిని చూచి నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి; లోకము మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించు కొనుడి... అప్పుడాయన యెడమవైపున ఉండువారిని చూచి, శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి... వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవము నకును పోవుదురు" (మత్తయి 25:33-46).

ఆయన మానవుల క్రియల యొక్కయు తలంపుల యొక్కయు పరిపూర్ణజ్ఞానము కలిగినవాడు గనుక ఈ లోక విమోచకుడు. భూలోక చరిత్ర ఆఖరి దినమున తీర్పరిగా యుండుటకు అర్హతగలవాడు. మానవునిలో యేమున్నదో క్రీస్తు యెరుగును (యోహాను 2:24,25); సమస్తమును చూచుచున్న ఆయన నేత్రముల నుండి యేమియు దాచబడి యుండలేదు (హెబ్రీ 4:13, సామె 15:3). ఆయన ఒకప్పుడు భూమిపై జీవించెను గనుక ఆయనకు జాలికూడ కలదు; పరిపూర్ణ న్యాయసత్యములను సమన్వయించి ఎంతవరకు దయచూపవలెనో అంతవరకు సంపూర్తిగా దయ చూపించును.

**డి) ప్రతివాడు తన జీవితపు లెక్క అప్పగించును**

మానవుని క్రియలు, మాటలు, తలంపులే తీర్పునకు ఆధారముగా యుండును. తీర్పులో ఒకని జీవితపు గ్రంధములు విప్పబడును. అతని క్రియలన్నియు బయలుపరచబడును. మరియు ప్రతివాడును తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి నిమిత్తము లెక్క అప్పగించును (2 కొరింథీ 5:10). "మనుష్యకుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును" (మత్తయి 16:27). ప్రతిక్రియయు విమర్శకు తేబడును; రహస్యముగా దాచబడినవి మంచివేమి చెడ్డవేమి సమస్తమును బట్టబయలు చేయబడును; "గూఢమైన ప్రతి యంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతిక్రియను అది మంచిదే గాని, చెడ్డదే గాని తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12:14). తీర్పు దినమున సమస్తము బయలుపరచబడును.

యేసు ఇంకా ఏమి చెప్పెనంటే : "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడ వని తీర్పు నొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు" (మత్తయి 12:36,37). దేవుడు మనుష్యుని క్రియలను గూర్చియే గాక అతని మాటలను గూర్చి కూడ రికార్డు ఉంచుచున్నాడు (మలాకీ 3:16; ఎఫెసీ 4:29).

ఆ న్యాయాధిపతి బాహ్యక్రియలు, తలంపు

లనే గాక "అంధకార మందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి హృదయములోని ఆలోచనలను బయలు పరచును" (1 కొరింథీ 4:5). ఆయన మనుష్యుల రహస్యములను తీర్పులోనికి తెచ్చును (రోమా 2:16). అనేకులవలె ఈ లోకములో పాపమును అవినీతిని దాచిపెట్టుట సాధ్యమే కాని ఆ గొప్ప దినమందు. సమస్తమును బయలుపరచబడును. మరియు అందరు వ్యక్తిగతముగా పరిగణించబడుదురు.

**ఇ. వాక్యము మానవునికి తీర్పు తీర్చును**

మానవులు దేవుని చట్టానుసారముగ తీర్పు తీర్చబడుదురు. ఈ సంగతిని యోహాను చూచిన తీర్పు దృశ్యమును బట్టియు (ప్రక 20:12), క్రీస్తు యొక్క మాటలను బట్టియు మనము తెలిసికొనవచ్చును : "నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). మానవుల ప్రమాణ పుస్తకములు, వేదాంతములను బట్టి గాక దేవుని నిత్య వాక్యములను బట్టి అందరికి తీర్పు జరుగును.


ప్రతివాడు యేసుక్రీస్తునందలి విశ్వాసమును విధేయత ద్వారా తన శక్తికొలది చూపించినట్లయిన, దానిని బట్టియే నిజానికి మానవుడు అంగీకరించబడును (హెబ్రీ 5:8,9; మత్తయి 7:21-27; ప్రక 22:12,14; మత్తయి 12:41,42; లూకా 10:12-14; 12:47,48; మత్తయి 25:15,35,45).

తీర్పులో ప్రతివాడు తన ఆత్మను గూర్చి దేవుడిచ్చిన తీర్పును అంటే నిత్యసంతోష మునో లేక నిత్యవేదననో వినును. అప్పుడు కొందరు ఆశీర్వదింపబడిన వారితో కలిసి యుండుటకు విజయవంతులగుదురు. మరికొందరు శపింపబడిన వారితో యుండు టకు పోవుదురు. ఆసమయమందు నీతిమంతులు, అనీతిమంతులు నిత్యము వేరుచేయబడుదురు. అప్పుడు ఇయ్యబడిన తీర్పు మరెన్నడు మార్చబడదు. తీర్పులో ప్రతివాడు యూదాను గూర్చి చెప్పబడినట్టు తన చోటికి పోవును (అపొ.కా. 1:25). అతడు జీవించుచుండగా తన క్రియలను బట్టియు, కోరికలను బట్టియు తన చోటును నిశ్చయము చేసికొనియుండును. ఈ స్థానములో అతడు నిత్యము ఉండును. గనుక రక్షణ గాని లేక శిక్ష గాని అందరికీ ఒకే రోజున ఆఖరి దినమందు ఈయబడును (యోహాను 6:39,40, 12:48; గలతీ 6:7:8).

మత్తయి 25:31-46లో యేసు పలికిన మాటలలో ఈ దిగువ సంగతులు చెప్పబడెను: 1) తీర్పు జరుగు సమయము - క్రీస్తు రెండవ రాకడనాడు 2) తీర్పరి-క్రీస్తు 3) తీర్పు తీర్చబడువారు-సమస్త జనాంగములు 4) ఈయబడే తీర్పు-నిత్యజీవములోనికి గాని లేక నిత్యశిక్షలోనికి గాని ప్రవేశము.

**5) నీ దేవుని కలసికొనుటకు సిద్ధపడుము**

పాపులారా, జీతమురోజు వచ్చుచున్నది.



నీతిమంతులు ఎంత నిశ్చయముగా బహుమానము నొందుదురో అట్లే దుర్మార్గులు శిక్షింపబడుదురు. జనసమూహములతో కలసి నిత్యశిక్షలోనికి మళ్లించబడినప్పుడు పొందే ఎడబాటు బహు దుఃఖకరము. మరెన్నడు కలసికొనకుండగ అప్పుడు కుటుంబములు విడదీయబడును. అయితే యెవడును నశింపవలెనని దేవుడు కోరుటలేదు. అందరు మారుమనస్సు పొందవలెనని ఆయన కోరుచున్నాడు. ఆయన కృపను బట్టి క్రీస్తు

రక్తము ద్వారా ప్రతి మానవుడు తన పాపక్షమాపణ పొందే అవకాశమును కలుగజేసియున్నాడు (ఎఫెసీ 2:8:9; మార్కు 16:16; అపొ.కా. 2:38). ఒకడు సువార్తకు లోబడుట ద్వారా క్రీస్తు రక్తమునుపయోగించుకొనిన యెడల అతని పాపములు క్షమించబడును. వాటిని గూర్చి తీర్పునాడు న్యాయాధిపతి లెక్క అడుగడు. "వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనననని ప్రభువు సెలవిచ్చు చున్నాడు" (హెబ్రీ 8:12).

అయితే సువార్తకు విధేయత చూపుటకు ఆలసించిన అపాయము కలదు (2థెస్స 1:7-8). ఇదియే రక్షణదినము. పౌలు ఫేలిక్సు యెదుటను, ద్రుసిల్ల యెదుటను బోధించినప్పుడు అతడు నీతిని గూర్చియు ఆశానిగ్రహమును గూర్చియు రాబోవు విమర్శను గూర్చియు ప్రసంగించెను. ఆ ప్రసంగము శక్తివంతముగా యుండెను గనుక గవర్నరయిన ఫేలిక్సు మిగుల భయపడెను గాని అతడు విధేయత చూపలేదు. "ఇప్పటికి వెళ్లుము. నాకు సమయమైన నిన్ను పిలువ నంపింతునని" అతడు పౌలుతో చెప్పెను (అపొ.కా. 24:25). అయితే మరెన్నడు అతడు సత్యమును గూర్చి తన ఆత్మలో అట్లు కలవరపడలేదు. మనకు తెలిసినంతమట్టుకు అతడు క్రీస్తును ఎన్నడు అంగీకరించలేదు గాని అతడు జీవించిన రీతిగానే పాపపు బానిసగా మరణించెను. తనకు వీలుగాయున్న సమయము ఎన్నడు రాలేదు.

తీర్పును గూర్చిన ఆలోచన పాపనిరోధక శక్తివలె పనిచేయవలెను. అందరు ప్రతి పనిని, ప్రతి నిర్ణయమును, ప్రతి శోధనను, ప్రతి క్రియను, ప్రతి సంబంధమును ఆ యాఖరి లెక్కను బట్టి జరిగించవలెను. నిష్కళంకులు గాను, నిరపరాధులుగాను ఆయన దృష్టిలో అగుపడునట్లు అందరు జాగ్రత్త వహించ వలెను. నమ్మకమైన క్రైస్తవునిగా యుండుట వలన మాత్రమే ఒకడు క్రీస్తు రాకడకొరకు ఎల్లప్పుడు సిద్ధపడి యుండగలడు. సిద్ధపడని వారు తీర్పునాడు దేవుని కలిసికొనుటకు ఇప్పుడే సిద్ధపడవలెను.

"నిశ్చింతగల ఆత్మా, ఇదిగో ఈ హెచ్చరికను వినుము. నీ జీవితము త్వరలోనే అంతమగును; నీ దేవుని ఎదుర్కొనుటకు సిద్ధపడని యెడల ఇదిగో తీర్పును ఎదుర్కొను టకు ఎంతో దుఃఖకరము".

– పెర్రీ కోథమ్

# పాపుల మిత్రుడు
## ( A Friend of Sinners )

*- Ken Tyler*



యేసు ఏ పాపము చేయకపోయినా, పాపముతో నిండియున్న లోకంలో జీవించారు. ఆయన జననము మొదలుకొని సిలువపై మరణము వరకు ఆయన జీవిత మంతయు పాపముకై వెచ్చించెను. ఆయన పెదవుల నుండి పాపపు మాట ఒక్కటియైనను రాలేదు. పాపపు పని ఆయన యేమీ చేయలేదు. పాపపు తలంపులు ఆయన ఎన్నడు ఆలోచించలేదు. ఆయన పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక

ప్రత్యేకముగా ఉన్ననాడు (హెబ్రీ 9:25-26). తన జీవితంలో పాపమును నిరూపించుమని తనకాలము నాటివారిని ఆయన సవాలు చేసెను (యోహాను 8:46). వారు కనుగొనలేకపోయారు. ఆయన ఏ పాపమును చేయలేదు (1 పేతురు 2:21). ఏ పాపమును ఎరుగడు (2 కొరింథీ 5:21). ఆయనలో పాపము ఏమియులేదు (1 యోహాను 3:5). అయినను పాపియొక్క మంచి మిత్రుడాయనే. ఎందువలన ? దిగువ సంగతులు గమనించగోర్తాను.

మొదటిగా, యేసుక్రీస్తు అతిక్రమము చేయువారిలో లెక్కింపబడెను గనుక ఆయన పాపుల మిత్రుడు. ఆయన "అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను. అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" అని యెషయా ప్రవచించెను (యెషయా 53:12). అతిక్రమము చేయువారిలో ఎంచబడుట యనగా పాపము చేయువారితో ఎంచబడుటయే. ఏలయనగా ఆజ్ఞాతి క్రమమే పాపము (1 యోహాను 3:4). సుంకరియైన మత్తయిని అపొస్తలునిగా యుండుటకు యేసు పిలిచెను. మత్తయి ఆయన పిలుపు నంగీకరించి తనయింటిలో గొప్పవిందు నేర్పాటుచేసెను. అది సుంకరు లతో నిండియుండెను. తనతో భోజనము నకతడు యేసును ఆహ్వానించెను. దాని నాయన అంగీకరించెను. అప్పుడు శాస్త్రులును పరిసయ్యులును అదిచూచి, "సుంకరులతోను పాపులతోను మీరేల తిని త్రాగుచున్నారని ఆయన శిష్యులమీద సణగిరి'' (లూకా 5:27-30). "అందుకు యేసు-రోగులకే గాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కరలేదు. మారు మనస్సు పొందుటకై నేను పాపులను పిలువ వచ్చితినిగాని నీతిమంతులను పిలువ రాలేదని వారితో చెప్పెను'' (లూకా 5:31-32). అవును, క్రీస్తు ఈ లోకములో యుండగా పాపులతో కలసిమెలిసి తిరిగెను.

లూకా 7:36-39 లో పరిసయ్యుడొకడు యేసును భోజనమునకు ఆహ్వానించిన సందర్భమును చూడగలము. ఆయన భోజన పంక్తిని కూర్చుండగా పాపాత్మురాలైన యొక స్త్రీ ఒక బుడ్డిలో అత్తరు తీసికొని వచ్చి వెనుకతట్టు ఆయన పాదముల యొద్ద నిలబడి యేడ్చుచు కన్నీళ్లతో ఆయన పాదములు తడిపి, తన తల వెంట్రుకలతో తుడిచి, ఆయన పాదములను ముద్దు పెట్టుకొని ఆ అత్తరు వాటికి పూసెను. ఆయనను పిలిచిన పరిసయ్యుడు అదిచూచి - ఈయన ప్రవక్త యైన యెడల తన్నుముట్టుకొనిన స్త్రీ ఎవతియో, ఎటువంటిదో యెరిగియుండును; యిది పాపాత్మురాలు అని తనలో తాననుకొనెను. అవును యేసు పాపులతో కలసిమెలిసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడిన వాడాయెను.

"ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధవినుటకు ఆయన

దగ్గరకు వచ్చుచుండగా, పరిసయ్యులును శాస్త్రులను అదిచూచి - ఇతడు పాపులను చేర్చుకొని వారితో కూడ భోజనము చేయుచున్నాడని చాల సణగుకొనిరి" యని లూకా 15:1-2లో వ్రాయబడియున్నది. "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" యేసు చెప్పెను (లూకా 19:10). అందువలననే ఆయన పాపుల మధ్య ఎల్లప్పుడు యుండెను. ఆయన ఇద్దరు దొంగల మధ్య సిలువ వేయబడెను. పాపులలో ఒకనిగా సిలువ వేయబడెను. వారిద్దరిలో ఒకనితో, "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నా ననెను" (లూకా 23:29-43).

యేసు ప్రభువు ఎవరితో సహవాసము చేసారో, అట్టివారితో ఉండుటకు మనం ఇష్టపడము. మన కాలము నాటి పాపులను మనం నిర్లక్ష్యం చేస్తే ఈ లోకానికి సువార్త ఎట్లు ప్రకటించగలము ? మనవారితోనే సహవాసం చేయగోర్తాము. అందువలన సంఘము క్షీణించుచున్నది. సంఘమునకు వెలుపల యున్నవారికి, లోకస్థులకు సువార్త బోధించాలి. క్రైస్తవులను చేయాలి.

రెండవదిగా, పాపుల పాపములను తీసివేయుటకు యేసుక్రీస్తు సిలువపై మరణించెను గనుక ఆయన పాపుల మిత్రుడు. "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను, మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవానిగాను దేవుని వలన బాధింపబడినవాని గాను శ్రమ నొందినవానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమక్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడు తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనయందరి దోషమును అతని మీద మోపెను" (యెషయా 53:4-6). "మనము పాపముల విషయమై చనిపోయి నీతివిషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను" అని పేతురు చెప్పెను. (1 పేతురు 2:24). "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను" అని పౌలు చెప్పెను. (1 కొరింథీ 15:3). పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనని కూడ అతడు చెప్పెను (1 తిమో 1:15). పాపమును, అపవిత్రతను పరిహరించుటకై తీయబడు ఊటను గూర్చి జెకర్యా 13:1లో చెప్పబడినది. "ఇమ్మానుయేలు రక్తము ఇంపైనయూటగు, ఓ పాపి యందు మున్గుము పాపంబు పోవును" అనే పాట మనందరం పాడుచుందుము. ఎంత నిజమో! పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు తన రక్తమును చిందించెను (మత్త 26:28). నిజముగా,

యేసుక్రీస్తు లోక పాపములను మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్లయే

మూడవదిగా, అతిక్రమము చేయువారిని గూర్చి ఆయన విజ్ఞాపనము చేయును గనుక క్రీస్తు పాపుల మిత్రుడైయున్నాడు (యెషయా 53:12). "ఈయన తనద్వారా దేవుని యొద్దకు వచ్చు వారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు" (హెబ్రీ 7:25). మనం పాపము చేసినప్పుడు దేవునికిని మనకును మధ్యవర్తి ఒకరున్నారు. ఆయన క్రీస్తు యేసను నరుడు (1 తిమో 2:5). మనం పాపము చేసినప్పుడు మారుమనస్సు పొంది దేవుని క్షమాపణ నడిగిన యెడల మనలను గూర్చి యేసుక్రీస్తు దేవుని దగ్గర విజ్ఞాపనము చేయును. "ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు" (1 యోహాను 1:21). "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9).

"సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు" అని సొలొమోను చెప్పెను (సామెతలు 18:24). సొలొమోను చెప్పిన స్నేహితుడు యేసుక్రీస్తే! దయగల మన యేసు ఎంతో గొప్పమిత్రుడు! "తన స్నేహితుల కొరకు తన ప్రాణమును పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమ గలవాడెవడును లేడు. నేను మీకాజ్ఞాపించువాటిని చేసిన యెడల మీరు నా స్నేహితులై యుందురు" అని యేసు చెప్పెను (యోహాను 15:13-14). యేసు పాపులమిత్రుడు ! పాపులు ఆయన మిత్రులుగా యుండగోరుదురు.

నీవాయన చిత్తమును జరిగించిన యెడల యేసు యొక్క మిత్రుడవు కాగలవు. తనకు విధేయులైన వారందరికీ ఆయన నిత్య రక్షణకు కారకుడు (హెబ్రీ 5:8-10). మనం ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించుచున్నారు (యోహాను 8:24; లూకా 13:3; మార్కు 16:16). రక్షింపబడి మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల మనం ఆయనకు మిత్రులముగా యుండగలము (ప్రకటన 2:10).

– కెన్ టేలర్

# HEAR THE VOICE OF TRUTH ON RADIO SRILANKA

TELUGU : Sunday, Monday, Wednesday & Thursday,
**2:00 p.m. - 2.15 p.m.**

T.V. : Every Monday & Tuesday 6:00 a.m. on Subhavartha Channel
Every Wednesday at 7.00 a.m. on Vissa and
Every Saturday at 6:30 a.m. on TV-5 Channel.
Speakers: **Joshua Gootam & Ricky Gootam.**
P.O. Box. 80, **Kakinada-533 001.**

HINDI : Sunday 6:45 p.m. 7.00 p.m. and
Thursday, 6:45 p.m. 7.00 p.m.
Speaker: **Sunny David,**
P.O. Box 3815. New Delhi - 110049.

TAMIL : Monday, Tuesday, Wednesday, Thursday and
Friday 5:30 p.m. to 5:45 p.m.
Speaker: **P.R. Swamy.**
P.O. Box 8405, Bangalore - 560084.

MALAYALAM : Friday, 3.45 p.m. - 4.00 p.m.
Speaker: **P.K. Varghese,** P.O. Box 5540,
Thrivandrum - 695043 (Kerala).

Please write to these addresses for Bible correspondence courses, Magazines, and other Christian literature in your language.

All of these Programmes are sponsored by
Churches of Christ

# Help Is Just a Prayer Away



While on earth we know we're strangers
And as vagabonds we roam
'Tis a pathway filled with dangers
That we have to travel home.

Oft it's hard to keep on going
In this struggle day by day
But there's comfort found in knowing
Help is just a prayer away.

When temptations sore beset us
And We're drowning in dismay
We've a friend who won't forget us
And will hear us when we pray.

Though this road that we've been given
Oft is clouded with despair
Help devine descends from heaven
When we go to God in prayer.

*— Harry Presley*